# ది క్రైమ్ న్యూస్
Crime News

తెలుగు దినపత్రిక

బుధవారం, జూన్ 17, 2026 | సంపుటి - 20 | సంచిక 264 | వెల - 4రూ | పేజీలు - 12

Hyderabad, Karimnagar, Khammam, Nalgonda, Nizamabad, Warangal, Mahabubnagar.


## అమెరికా, ఇరాన్ మధ్య
# శాంతి ఒప్పందం



**అయినా పలు రకాల అనుమానాలు చక్కర్లు**
**ఇరాన్‌కు 300 మిలియన్ డాలర్ల పరిహారం అంటూ వార్తలు**
**అలాంటిదేమీ లేదని ట్రూత్‌లో వెల్లడించిన ట్రంప్**
**అణ్వాయుధాలపై ఖచ్చితమైన ఒప్పందం కోసం పట్టు**

న్యూయార్క్ : అమెరికా, ఇరాన్ మధ్య శాంతి ఒప్పందం కుదిరినప్పటికీ ఇంకా అనుమానాలు తొలగడం లేదు. అయితే అణ్వాయుధాలను కలిగి ఉండబోమని ఇరాన్ అంగీకరించినట్లు సోమవారం డోనాల్డ్ ట్రంప్ తెలిపారు. ఇక తమ శాంతి ఒప్పందంలో భాగంగా ఇరాన్‌కు 300 మిలియన్ల డాలర్ల ఇవ్వనున్నట్లు వస్తున్న వార్తలను ఆయన ఖండించారు. ట్రంప్ తన ట్రుత్ సోషల్‌లో ఈ మేరకు స్పందించారు. ఇరాన్‌తో కుదిరే డీల్‌లో.. అణ్వస్త్రాలను డెవలప్ చేయబోమని ఆ దేశం అంగీకరించనున్నట్లు ట్రంప్ చెప్పారు. 2లో

## హైదరాబాద్ మెట్రోకు కేంద్ర ప్రభుత్వం
# పూర్తి సహకారం

### తెలంగాణ అభివృద్ధిపై మావరి పాఠాలు అవసరం లేదు
### తెలంగాణ, హైదరాబాద్ అభివృద్ధి పట్ల మా చిత్తశుద్ధి మాకుంది
### అన్ని విధాలుగా అనేక కార్యక్రమాలు చేపట్టాం
### రేవంత్ వ్యాఖ్యలపై ఘాటుగా స్పందించన కిషన్ రెడ్డి



***తెలంగాణ అభివృద్ధిపై తమకెవరూ పాఠాలు చెప్పాల్సిన పనిలేదని, ఎవరి కోసమో తాము తెలంగాణ అభివృద్ధికి పాటుపడడం లేదని కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి అన్నారు. దేశవ్యాప్తంగా మిగతా మెట్రో రైలు ప్రాజెక్టుల మాదిరిగానే హైదరాబాద్ మెట్రోకు కేంద్ర ప్రభుత్వం సహకారమందిస్తోందని కిషన్‌రెడ్డి అన్నారు. సాంకేతిక, ఆర్థిక విషయాలపై కేంద్రానికి రాష్ట్ర ప్రభుత్వాలు సహకరిస్తే ప్రాజెక్టులు సాకారమవుతాయన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి విమర్శల నేపథ్యంలో ఢిల్లీలో కిషన్‌రెడ్డి మీడియా సమావేశం నిర్వహించారు.***

న్యూఢిల్లీ : తాను వద్దంటే ప్రాజెక్టులు ఎక్కడా ఆగవని చెప్పారు. మెట్రో ప్రాజెక్టుకు సంబంధించి అనేక మార్పులను రాష్ట్రానికి కేంద్రం సూచించిందన్నారు. ప్రాజెక్టులను దొడ్డిదారిన ఆపే సంస్కృతి భాజపాకు లేదని.. కాంగ్రెస్‌కే ఉండొచ్చని వ్యాఖ్యానించారు. ఎవరి కోసమూ ప్రాజెక్టులను అడ్డుకోబోమన్నారు. తెలంగాణ అభివృద్ధి పట్ల మాకు చిత్తశుద్ధి ఉంది. గతంలో మెట్రో ఫేజ్-1కు కేంద్రం రూ.1,250 కోట్లు మంజూరు చేసింది. అనాలోచితంగా, దుందుడుకు ధోరణిలో సీఎం మాట్లాడటం సమంజసం కాదు. నాతో పాటు ప్రధాని మోదీ, కేంద్రానికి రేవంత్‌రెడ్డి, కాంగ్రెస్ సర్టిఫికెట్ అవసరం లేదు. మేం రేవంత్‌రెడ్డికి కాదు.. తెలంగాణ ప్రజలకు జవాబుదారీ. రాష్ట్ర అభివృద్ధి కోసం 12 ఏళ్లుగా పనిచేశాం.. ఇప్పుడూ పనిచేస్తాం. 2లో



## పారదర్శకంగా యూరియా పంపిణీ

**ఫర్టిలైజర్ యాప్ ద్వారా ఇంటినుంచే బుకింగ్**
**ఇప్పటికే 4.06 లక్షల మంది రైతులకు లబ్ది**
**క్యూ లైన్లు కట్టాల్సిన దుస్థితి రాకుండా నిర్ణయం**
**వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు**

కామారెడ్డి : రైతులకు పారదర్శకంగా యూరియా పంపిణీ చేస్తామని తెలంగాణ వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు వెల్లడించారు. మంగళవారం కామారెడ్డి జిల్లా ఎల్లారెడ్డిలో మంత్రి మాట్లాడుతూ.. క్యూ లైన్లు అవసరం లేకుండా ఇంటి నుంచే యూరియా బుకింగ్ చేసుకునే సౌకర్యాన్ని రైతులకు కల్పిస్తామన్నారు. ఫర్టిలైజర్ యాప్ ద్వారా ఇప్పటికే 4.06 లక్షల మంది రైతులు బుకింగ్ చేసుకున్నారని వివరించారు. మొత్తం13.22 లక్షల యూరియా బస్తాల బుకింగ్ చేసుకుంటే.. 84.6 శాతం పంపిణీ పూర్తి చేశామని తెలిపారు. రాష్ట్రంలో 90.22 లక్షల యూరియా బస్తాల భారీ నిల్వలు అందుబాటులో ఉన్నాయని పేర్కొన్నారు. రైతుల సూచనలతో ఫర్టిలైజర్ యాప్‌లో నిరంతర మార్పులు చేస్తున్నట్లు చెప్పారు. స్మార్ట్ ఫోన్ లేని రైతులకు టోల్ ఫ్రీ ద్వారా యూరియా బుకింగ్ చేసుకునే అవకాశాన్ని కల్పించామని 2లో



## సిఎం రేవంత్ వ్యాఖ్యలపై
# బండి ఆగ్రహం

**మెట్రోను అడ్డుకునే ఖర్మ కిషన్‌రెడ్డికి లేదని వెల్లడి**

కరీంనగర్ : తెలంగాణ అభివృద్ధికి బీజేపీ కట్టుబడి ఉందని కేంద్ర మంత్రి బండి సంజయ్ కుమార్ స్పష్టం చేశారు. మెట్రో విస్తరణను అడ్డుకోవాల్సిన ఖర్మ పట్టలేదన్నారు. మంగళవారం మీడియాతో మాట్లాడుతూ.. మెట్రో ప్రాజెక్టును అడ్డుకోవాల్సిన అవసరం కిషన్ రెడ్డికి లేదన్నారు. అర్థంలేని ఆరోపణలను పట్టించుకోవాల్సిన అవసరం లేదన్నారు. తరువాయి 2లో

## నీట్ రీ ఎగ్జామ్‌తో
# అప్రమత్తం

**టెలిగ్రామ్ యాప్‌పై కేంద్రం ఆంక్షలు**

న్యూఢిల్లీ : నీట్ 2026 రీ-ఎగ్జామినేషన్ నేపథ్యంలో కేంద్ర ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. పరీక్షను సురక్షితంగా, పారదర్శకంగా నిర్వహించేందుకు టెలిగ్రామ్ యాప్ యాక్సెస్‌పై తాత్కాలిక ఆంక్షలు విధించినట్లు తెలుస్తోంది. తరువాయి 2లో



## బిజెపికి లబ్ది చేకూర్చేలా
# సర్ ప్రక్రియ

**కేంద్రానికి తొత్తుగా మారిన ఎన్నికల సంఘం**
**బెంగాల్లో 92 లక్షల ఓట్ల తొలగింపే నిదర్శనం**
**బూత్ లెవల్ ఏజెంట్ల సమావేశంలో పిసిసి చీఫ్ విమర్శలు**

సంగారెడ్డి : కేవలం బిజెపికి లాభం చేకూర్చేలా సర్ ప్రక్రియ సాగుతోందని తెలంగాణ పీసీసీ చీఫ్ మహేశ్ కుమార్ గౌడ్ ఆగ్రహం వ్యక్తం చేశారు. మతతత్వ పార్టీలకు ప్రయోజనం చేకూరేలా ఎస్ఐఆర్ పక్రియ నిర్వహించే కుట్ర జరుగుతుందని విమర్శించారు. మంగళవారం సంగారెడ్డిలో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ఎస్ఐఆర్‌పై బూత్ లెవెల్ ఏజెంట్ల సమావేశం జరిగింది. ఈ సమావేశంలో టీపీసీసీ చీఫ్ మాట్లాడుతూ.. పశ్చిమ బెంగాల్‌లో ఎస్ఐఆర్ పేరుతో 92 లక్షల ఓట్లను అక్రమంగా తొలగించారని వివరించారు. తరువాయి 2లో



## అన్నలు లేరని అలుసు తీసుకుంటే
# ఖబర్దార్

**ఇప్పుడు వారంతా మా పార్టీలోనే ఉన్నారు**
**సింగరేణిలో అక్రమాలను నిలదీస్తూనే ఉంటాం**
**బొగ్గుబాయి బాటలో కవిత వెల్లడి**

మంచిర్యాల : తెలంగాణ రక్షణ సేన అధినేత్రి కవిత తలపెట్టిన భూగర్భగని వద్ద 'బొగ్గుబాయి' కార్యక్రమంలో ఉద్రిక్తత చోటుచేసుకుంది. మంచిర్యాల జిల్లా శ్రీరాంపూర్ ఏరియాలోని ఆర్కే 7 గని ఆవరణలోకి వెళ్లేందుకు 2లో



## ఆర్ అండ్ బిలో
# కాంట్రాక్టర్లకు బకాయిలు

### యాదగిరిగుట్టకు సంబంధించి 350 కోట్లు పెండింగ్
### కాంట్రాక్టర్లతో చర్చించిన మంత్రి కోమటిరెడ్డి

హైదరాబాద్ : గత బిఆర్ఎస్ ప్రభుత్వం కాంట్రాక్టర్లతో పనులు చేయించి బిల్లులు పెండింగ్‌లో పెట్టిందని మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి అన్నారు. యాదగిరిగుట్ట నిర్మించామని గొప్పలు చెబుతున్నారని, గుట్ట బిల్లులు కూడా రూ.350 కోట్లు బకాయిలు పెట్టారన్నారు. మంగళవారం తెలంగాణ బిల్డర్స్ అసోసియేషన్‌తో మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి సమావేశమయ్యారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. తెలంగాణ బిల్డర్స్ అసోసియేషన్‌ను చర్చలకు ఆహ్వానించామని.. చలో హైదరాబాద్ కార్యక్రమాన్ని విరమించాలని కోరినట్లు తెలిపారు. గత ప్రభుత్వం ఆర్ అండ్ బీలో రూ.4వేల కోట్లు బకాయిలు పెట్టిందని.. తరువాయి 2లో

## హోంమంత్రి అనితపై
# గుడివాడ కామెంట్స్

**దిగజారిపోయి మహిళలపై విమర్శలు సరికాదు**
**ఇది యావత్తు మహిళా లోకానికే అవమానం**
**అమరనాథ్ వ్యాఖ్యలపై మండిపడ్డ డిప్యూటి సిఎం**



అమరావతి : రాజకీయాల్లో విమర్శలు విధానపరంగానే ఉండాలని ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ అన్నారు. రాష్ట్ర హోంశాఖ మంత్రి అనితపై ఓ మాజీ మంత్రి చేసిన వ్యాఖ్యలను తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. మహిళల కట్టుబొట్టుపై కామెంట్స్ చేసే స్థాయికి ఆ నాయకుడి పార్టీవారు దిగజారి పోయారంటూ వ్యాఖ్యానించారు. స్త్రీల గురించి మాట్లాడేటప్పుడు జాగ్రత్తగా ఉండాలని హెచ్చరించారు. ఆ వ్యాఖ్యలు కేవలం హోం మంత్రిని అన్నట్టే కాదని.. సగటు మహిళలందరినీ కించపరచినట్లే అని పవన్ అన్నారు. తరువాయి 2లో



## ఎపి అభివృద్ధికి ఇతోధికంగా చేయూత


**వాజ్‌పేయ్ పార్కులో స్వచ్ఛభారత్‌లో కేంద్రమంత్రి ప్రహ్లాద్ జోషి**

విజయవాడ : కేంద్ర ప్రభుత్వం నరేంద్ర మోదీ ఆధ్వర్యంలో ఆంధ్రప్రదేశ్ అభివృద్ధికి కట్టుబడి ఉందని కేంద్ర వినియోగదారుల వ్యవహారాలశాఖ మంత్రి ప్రహ్లాద్ జోషి స్పష్టం చేశారు. ఒక రోజు పర్యటనలో భాగంగా విజయవాడ చేరుకున్న ఆయన.. నగరంలోని వాజ్‌పేయి పార్కులో తరువాయి 2లో

## అద్భుత నగరంగా
# అమరావతి నిర్మాణం

**అంతర్జాతీయ మౌలిక వసతులతో తీర్చిదిద్దుతున్నాం**
**పీపుల్ ఫస్ట్ మా విధానంలో నాలెడ్జ్ సిటీగా చేస్తున్నాం**
**క్వాంటమ్ కంప్యూటింగ్ హబ్, డిజిటల్ ఇన్ఫ్రాస్ట్రక్చర్ ప్రత్యేక ఆకర్షణలు**
**లీడర్‌షిప్ ప్లీనరీ-2లో చంద్రబాబు ప్రసంగం**

అమరావతి : పీపుల్ ఫస్ట్ మా విధానమని... ఈక్విటీ, నేచర్, ఆపర్చునిటీ, లివబుల్ సిటీగా అమరావతి ఉంటుందని సీఎం చంద్రబాబు తెలిపారు. అంతర్జాతీయ మౌలిక వసతులతో, అవకాశాల వేదికగా అమరావతిని తీర్చిదిద్దుతున్నామన్నారు. సింగపూర్‌లో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు రెండో రోజు పర్యటన కొనసాగుతోంది. 'వరల్డ్ సిటీస్ సమ్మిట్'లో పాల్గొన్న సీఎం.. లీడర్‌షిప్ ప్లీనరీ-2లో 'కెన్ స్మార్ట్ సిటీస్ లవ్ హ్యూమన్స్' అనే అంశంపై ప్రసంగించారు. అమరావతిని నాలెడ్జ్ సిటీగా చేస్తున్నామని.. జాతీయ, అంతర్జాతీయ విద్యాసంస్థలను తీసుకు వస్తున్నామని అన్నారు. 2లో



# అమెరికా, ఇరాన్ మధ్య శాంతి ఒప్పందం

ఇరాన్, అమెరికా మధ్య ఎంవోయూ కుదిరినట్లు వార్తలు వెలుబడుతున్న విషయం తెలిసిందే.జెనీవాలో శుక్రవారం అధికారికంగా రెండు దేశాల మధ్య సంతకాలు జరిగే అవకాశం ఉన్నది. అమెరికా అధ్యక్షుడు ట్రంప్ మొదటి రోజు నుంచి స్పష్టంగా ఉన్నారని, ఇరాన్ వద్ద అణ్వాయుధం ఉండబోదని ఉపాధ్యక్షుడు జేడీ వాన్స్ ఓ వీడియో సందేశంలో పేర్కొన్నారు. అణ్వాయుధ సేకరణ కోసం ఇరాన్‌కు అనుమతి ఇవ్వబోమని ఇజ్రాయల్ ప్రధాని బెంజిమన్ నెతన్యహూ కూడా స్పష్టం చేశారు. ఇరాన్ వద్ద అణ్వాయుధాలు ఉండవద్దు అని దశాబ్దాలుగా పోరాటం చేస్తున్నానని, దీన్ని జీవిత మిషన్‌గా భావించానని అన్నారు. డీల్ కుదిరినా, కుదరకపోయినా, ఇరాన్ వద్ద న్యూక్లియర్ వెపన్ ఉండబోదన్నారు. ఇజ్రాయెల్ ప్రధానిగా తాను ఉన్నంత కాలం ఇలా జరగబోదన్నారు. అమెరికా-ఇరాన్ మధ్య శాంతి ఒప్పందంతో పశ్చిమాసియాలో సంక్షోభానికి తెరపడింది. అయితే, ఈ ఒప్పందం ట్రంప్ యంత్రాంగంలో విభేదాలను బయటపెట్టింది. అణ్వాయుధాలు విడిచిపెట్టాలన్న నిర్ణయానికి ఇరాన్ కట్టుబడి ఉంటుందా అనే విషయంపై కొందరు సీనియర్ అధికారులు అనుమానాలు వ్యక్తంచేసినట్లు అమెరికా మీడియాలో కథనాలు వస్తున్నాయి. ఒప్పందం తుది దశకు చేరుకుంటున్న నేపథ్యంలో..ఇరాన్ ఉద్దేశాలపై నిఘావర్గాల అంచనాలు ఆందోళనను రేకెత్తిస్తున్నాయని సీఐఏ డైరెక్టర్ జాన్ రాట్‌క్లిఫ్ ట్రంప్‌తో సహా ఉన్నతాధికారులను హెచ్చరించారు. ఒప్పందం నేపథ్యంలో శుద్ధి చేసిన యురేనియం విషయంలో ఇరాన్ అధికారుల మధ్య చర్చలకు.. వారు మధ్యవర్తులకు చేరవేస్తున్న సమాచారానికి ఎక్కడా పొంతన లేదని తెలుస్తోందన్నారు. అమెరికా డిమాండ్ చేస్తున్నట్లు అణ్వాయుధాలు విడిచిపెట్టేందుకు ఇరాన్ సిద్ధంగా లేదని నిఘా వర్గాలు సూచిస్తున్నాయని తెలిపారు. రాట్‌క్లిఫ్‌తో పాటు విదేశాంగ మంత్రి మార్కో రూబియో, రక్షణ కార్యదర్శి పీట్ హెగ్సెత్ లు కూడా అంతర్గత చర్చల్లో ఇదే ఆందోళనను వ్యక్తంచేయడం చర్చనీయాంశంగా మారింది. అయితే, ఉపాధ్యక్షుడు జేడీ వాన్స్, పశ్చిమాసియా ప్రత్యేక రాయబారి స్టీవ్ విట్కాఫ్, ట్రంప్ అల్లుడు జారెడ్ కుష్నర్‌లు మాత్రం ఒప్పందానికి తమ మద్దతు తెలిపారు. కాగా, వైట్‌హౌస్ అధికారి ఒకరు ఈ వార్తలను ఖండించారు. శాంతి ఒప్పందంపై తుది నిర్ణయం తీసుకునే ముందు ట్రంప్ భిన్నాభిప్రాయాలు పరిగణనలోకి తీసుకున్నట్లు తెలిపారు. ఇరాన్ ఎప్పటికీ అణ్వాయుధాన్ని కలిగిఉండకూడదని, శుద్ధి చేసిన యురేనియంను వారి వద్ద ఉంచుకోకూడదు అన్న కీలక షరతులతో ఈ ఒప్పందం చాలా స్పష్టంగా ఉందన్నారు. ఈ విషయంపై సీఐఏ, విదేశాంగ శాఖ స్పందించేందుకు నిరాకరించాయి.

# అన్నలు లేరని అలుసు తీసుకుంటే ఖబర్దార్


ప్రయత్నించిన కవిత, టీఆర్ఎస్ శ్రేణులు, కార్మికసంఘం నాయకులను పోలీసులు అడ్డుకున్నారు. దీంతో స్వల్ప ఉద్రిక్తత చోటుచేసుకుంది. గేట్లను తోసుకొని కవిత, పార్టీ శ్రేణులు గని ఆవరణలోకి దూసుకెళ్లారు. 'బొగ్గు బాయి' కార్యక్రమంలో తమను అడుగడుగునా సింగరేణి యాజమాన్యం అడ్డుకుంటుందని, కార్మికులతో కలిసి గేట్ మీటింగ్ పెట్టుకునే హక్కు తమకు ఉందని ఈ సందర్భంగా కవిత అన్నారు. సింగరేణి యాజమాన్యం కార్మికులకు కనీసం తాగునీటి సౌకర్యం కూడా కల్పించకుండా మానవ హక్కుల ఉల్లంఘనకు పాల్పడుతోందని ఆరోపించారు. అడవిలో అన్నలు లేరని సింగరేణి యాజమాన్యం కార్మికులను వేధిస్తోందన్నారు. అన్నలు తమ పార్టీలో కూడా ఉన్నారన్నారు. కార్మికులకు ఇబ్బంది కలిగేలా వ్యవహరిస్తే.. ఊరుకునే ప్రసక్తే లేదని, అవసరమైతే న్యాయపరంగా ముందుకెళ్తామని హెచ్చరించారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ ప్రభుత్వంపై ప్రశ్నల వర్షం కురిపించారు. కవిత మాట్లాడుతూ.. 'గతంలో రాహుల్, రేవంత్, భట్టి సింగరేణిలో పర్యటించలేదా? కార్మికుల సమస్యలు తెలుసుకుంటే తప్పేంటి?. పోలీసులను పెట్టుకుని ఎన్నిరోజులు అధికారంలో ఉంటారు?. కార్మికుల సమస్యలపై టీఆర్ఎస్ నిరంతరం పోరాడుతుంది' అని అన్నారు. ఈ సందర్భంగా మావోయిస్టులపై ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. అడవిలో అన్నలు ఉంటే.. అప్పట్లో ఇక్కడ ధైర్యం ఉండేది. సింగరేణి అధికారులు పద్ధతిగా పనిచేసేవారు. అడవిలో అన్నలు లేరని, అడిగే దిక్కులేదని.. సింగరేణి యాజమాన్యం అనుకుంటోంది. కానీ, అడవిలో అన్నలందరూ ఇప్పుడు టీఆర్ఎస్‌లోనే ఉన్నారు. కార్మికుల హక్కులకు భంగం కలిగిస్తే వెంటాడుతాం అని అన్నారు.

# నీట్ రీ ఎగ్జామ్‌తో అప్రమత్తం

ఐటీ చట్టం సెక్షన్ 69ం కింద ఈ చర్యలు తీసుకున్నట్లు అధికార వర్గాలు తెలిపాయి. జూన్ 22 వరకు భారతదేశంలో టెలిగ్రామ్ యాప్ యాక్సెస్‌పై నియంత్రణ ఉండనుంది. ఈనెల 21న దేశవ్యాప్తంగా నీట్ 2026 రీ-ఎగ్జామ్ నిర్వహించనున్న నేపథ్యంలో, పరీక్ష భద్రతను దృష్టిలో ఉంచుకుని నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ సిఫార్సు మేరకు కేంద్రం ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలుస్తోంది.అలాగే, టెలిగ్రామ్‌లో ఈనెల 30 వరకు మెసేజ్ ఎడిటింగ్ ఫీచర్‌ను పూర్తిగా నిలిపివేయాలని ఎలక్ట్రానిక్స్, ఐటీ మంత్రిత్వ శాఖ ఆదేశాలు జారీ చేసింది. పరీక్ష పూర్తయిన తర్వాత పాత టైమ్‌స్టాంప్‌లతో నకిలీ 'పేపర్ లీక్' ఆధారాలు సృష్టిస్తున్న ముఠాలను అడ్డుకోవడానికే మెసేజ్ ఎడిటింగ్ ఫీచర్‌పై నిషేధం విధించినట్లు తెలుస్తోంది. పేపర్ లీక్ పేరుతో విద్యార్థులను లక్ష్యంగా చేసుకుని మోసాలకు పాల్పడుతున్న నకిలీ టెలిగ్రామ్ ఛానళ్లపై ఇప్పటికే సైబర్ క్రైమ్ విభాగాలు చర్యలు చేపట్టినట్లు అధికారులు తెలిపారు. అహ్మదాబాద్‌లో 8 టెలిగ్రామ్ ఛానళ్లను నడుపుతూ రూ.1.5 కోట్ల మోసాలకు పాల్పడిన అంతర్రాష్ట్ర ముఠాను సైబర్ క్రైమ్ బ్రాంచ్ అరెస్ట్ చేసింది. జూన్ 21న జరగనున్న రీ-ఎగ్జామ్‌కు ముందు ప్రశ్నాపత్రం లీక్ అయ్యిందంటూ సోషల్ మీడియాలో జరుగుతున్న ప్రచారాలపై ఎన్‌టిఎ స్పందించింది. అవన్నీ తప్పుడు ప్రచారాలేనని స్పష్టం చేస్తూ, విద్యార్థులు అధికారిక సమాచారం కోసం వెబ్‌సైట్ ను మాత్రమే అనుసరించాలని సూచించింది. ఎవరైనా మోసాలకు పాల్పడితే వెంటనే జాతీయ సైబర్ క్రైమ్ హెల్ప్‌లైన్ 1930కి ఫిర్యాదు చేయాలని కేంద్ర ప్రభుత్వం కోరింది.

## ఎపి అభివృద్ధికి ఇతోధికంగా చేయూత

స్వచ్ఛభారత్‌లో భాగంగా చీపురు పట్టి చెత్త ఊడ్చారు. భాజపా రాష్ట్ర అధ్యక్షుడు మాధవ్, ఎమ్మెల్యే సుజనా చౌదరితో కలిసి పార్కులో మొక్కలు నాటారు. అనంతరం పార్క్‌కు వచ్చిన వాకర్స్‌తో ముచ్చటించారు. దేశంలో అత్యధిక కాలం సేవలందించిన ప్రధానిగా.. నరేంద్ర మోదీ చరిత్రలో నిలిచిపోయారన్నారు. 2014కు ముందు భారత ఆర్థిక వ్యవస్థ అత్యంత క్షీణ దశలో ఉందని.. మోదీ ప్రధాని అయ్యాక అత్యంత వేగంగా అభివృద్ధి చెందే ఆర్థిక వ్యవస్థగా భారత్ రూపాంతరం చెందిందని పేర్కొన్నారు. రైల్వే ఎలక్ట్రిఫికేషన్ జరిగిన రెండో దేశం భారత్ అని వివరించారు. ఎలక్ట్రానిక్ ఉత్పత్తులు 8 రెట్లు పెరిగాయి. అమరావతి కోసం హడ్కో నుంచీ రూ.11వేల కోట్లు ఇచ్చామన్న జోషి.. అమరావతి కనెక్ట్ చేస్తూ ప్రత్యేక రైల్వే లైన్ కోసం నిధులు సమకూర్చినట్లు గుర్తుచేశారు. రాష్ట్ర అబివృద్ధి కోసం చంద్రబాబు, పవన్, మాధవ్ కలిసి బాగా పని చేస్తున్నారని ప్రహ్లాద్ జోషి కితాబిచ్చారు. రాజధాని అమరావతికి రోడ్, రైల్వే కనెక్టివిటీ పెంచుతున్నామని వెల్లడించారు. అమరావతి అభివృద్ధికి కేంద్రం నుంచి పూర్తి సహాయ సహకారాలు అందిస్తున్నట్టు చెప్పారు.



# హైదరాబాద్ మెట్రోకు కేంద్ర ప్రభుత్వం పూర్తి సహకారం

ఇచ్చిన హామీలను తు.చ. తప్పకుండా అమలు చేస్తున్నాం. తెలంగాణ, హైదరాబాద్ అభివృద్ధి పట్ల మాకెవరూ పాఠాలు చెప్పనక్కర్లేదన్నారు. తెలంగాణ బిడ్డగా ప్రత్యేక రాష్ట్ర సాధన కోసం పోరాటం చేశాను. దిల్లీకి వచ్చి రెండుసార్లు ధర్నా చేశాం. బిల్లు ఆమోదం పొందిన తర్వాతే ఏపీ భవన్‌లో ఆమరణ దీక్ష విరమించా. రైల్వేస్టేషన్ల అభివృద్ధి కోసం నాడు కేసీఆర్, నేడు రేవంత్‌రెడ్డికి లేఖలు రాశా. రేవంత్ కోరితే కాకుండా.. కేంద్ర ప్రభుత్వమే బాధ్యతగా తీసుకుని రైల్వేస్టేషన్ల అభివృద్ధి పనులు చేపట్టింది. ఎంఎంటీఎస్ ఫేజ్-2కు నాడు కేసీఆర్ సహకరించలేదు. అయినప్పటికీ ప్రధాని చేతులమీదుగా ప్రారంభించాం. తెలంగాణకు రాదనుకున్న రైల్వే కోచ్ ఫ్యాక్టరీని సాధించాం. రాష్ట్రాల్లో ఏ పార్టీకి చెందిన ప్రభుత్వాలు ఉన్నా అందరికీ కేంద్రం సహకారం అందిస్తోంది. మోదీ ఇస్తుంటే కిషన్‌రెడ్డి అడ్డుపడుతున్నారనడం దిగజారుడు రాజకీయాలని మండిపడ్డారు. 50 ఏళ్లు వడ్డీ లేకుండా రాష్ట్రానికి ఇటీవల సాస్కీ రుణాలను కేంద్రం మంజూరు చేసింది. మూసీ పునరుజ్జీవ ప్రాజెక్టుకు ఏడీబీ రుణానికి కేంద్రం ఎన్వోసీ ఇచ్చింది. ఎన్‌సీడీసీ ద్వారా పదేళ్లుగా తెలంగాణకు రూ.లక్ష కోట్లు మంజూరు చేశాం. ధాన్యం కొనుగోళ్లకు రూ.37వేల కోట్లు మంజూరు చేసి.. ఇప్పటికే రూ.34వేల కోట్లు అందించాం అని కిషన్‌రెడ్డి వివరించారు.తెలంగాణ అభివృద్ధిపై తమకు చిత్తశుద్ధి ఉందని కిషన్‌రెడ్డి స్పష్టం చేశారు. మెట్రో అంశంలో బీజేపీపై బురదజల్లుతున్నారంటూ సీఎం రేవంత్ రెడ్డిపై ఆయన మండిపడ్డారు. మెట్రో రైలు ప్రాజెక్ట్ ఆపాలని తానేందుకు చెబుతానంటూ ఈ సందర్భంగా అసహనం వ్యక్తం చేశారు. తెలంగాణలో కేంద్రం అనేక అభివృద్ధి కార్యక్రమాలు చేపడుతోంది. ఒక లక్షా 75 వేల కోట్ల రూపాయలతో రహదారులను అభివృద్ధి చేస్తున్నాం. రాష్ట్ర అభివృద్ధి మా బాధ్యత' అని కిషన్ రెడ్డి పునరుద్ఘాటించారు. తనపై సీఎం రేవంత్ తప్పుడు ఆరోపణలు చేస్తున్నారని కిషన్ రెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. రేవంత్ అనాలోచితంగా మాట్లాడుతున్నారన్న ఆయన.. తమకు రేవంత్‌రెడ్డి సర్టిఫికెట్ ఏమీ అవసరం లేదన్నారు. అభివృద్ధి అంశంలో తమకు పాఠాలు నేర్పాల్సిన అవసరం లేదని కాంగ్రెస్ నేతలకు సూచించారు.

# సిఎం రేవంత్ వ్యాఖ్యలపై బండి ఆగ్రహం

కాంగ్రెస్ సర్టిఫికెట్ తమకు అవసరం లేదని వ్యాఖ్యానించారు. కావాలనే ప్రాజెక్ట్‌పై సిఎం రేవంత్ రెడ్డి పదేపదే అనవసర విమర్శలు చేస్తున్నారని మండిపడ్డారు. 'సర్' విషయంలో కాంగ్రెస్ గందరగోళం చేస్తోందని మండిపడ్డారు. బంగ్లాదేశ్ వాళ్లకు ఓటు ఇవ్వాలా అని ప్రశ్నించారు. ఇతర దేశాల వారి ఓట్లను తొలగించాలని కాంగ్రెస్ ఎందుకు డిమాండ్ చేయడం లేదని కేంద్ర మంత్రి నిలదీశారు. మావోయిస్టులు చివరికి సాధించింది ఏంటని కేంద్ర మంత్రి ప్రశ్నించారు. తుపాకీ గొట్టంతో అమాయకులు ప్రాణాలు కోల్పోయారని.. అభం శుభం తెలియని మైనర్లు ప్రాణాలు కోల్పోయారన్నారు. చివరికి మావోయిస్టు సంస్థని నిషేధానికి గురయ్యేలా చేశారని వ్యాఖ్యానించారు. తుపాకీ గొట్టం ద్వారా ఏమీ సాధించలేమని మావోయిస్టు అగ్ర నేతలు కూడా గుర్తించారని.. కేంద్రానికి సహకరించి చాలామంది లొంగిపోయారన్నారు. మావోయిస్టులు ఇక లేరని అన్నారు. మావోయిస్టు భావజాలంతో ఏదైనా సాధిద్దాం అనే ఆలోచన ఉన్న వ్యక్తులు ఆ ఆలోచనలను విరమించుకోవాలని సూచించారు. తుపాకీ గొట్టం ద్వారా ఏమీ సాధించలేమని రుజువయ్యిందని కేంద్ర మంత్రి బండి సంజయ్ పేర్కొన్నారు. ఇదిలఅఅవుంటే తెలంగాణలోని అధికార పార్టీ కాంగ్రెస్, ప్రత్యేకించి సీఎం రేవంత్‌రెడ్డి కొంత కాలంగా బీజేపీని లక్ష్యంగా చేసుకుని విమర్శిస్తున్నారు. ప్రత్యేకంగా కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి మీద విరుచుకు పడుతున్నారు. ఈ క్రమంలో తమ మీద వస్తున్న విమర్శలకు వివరణలు ఇచ్చుకోవడంతోనే కాషాయ నేతలకు పుణ్యకాలం గడిచిపోతోంది. అందుకే ఇక ఎంత మాత్రం ఉపేక్షించకూడదన్న క్లారిటీకి వచ్చి రివర్స్ అటాక్ మొదలు పెట్టిందని సమాచారం. ఇందులో భాగంగానే బండి సంజయ్ ఎదురుదాడికి దిగిటనట్లు తెలుస్తోంది. కేంద్రమంత్రి కిషన్ రెడ్డి మాట్లాడుతున్న తీరు చూస్తే కూడా రేవంత్‌ను ఎదిరిస్తోంది. తన సహజ శైలికి భిన్నంగా ఆయన రాష్ట్ర ప్రభుత్వం, ప్రభుత్వ పెద్దల మీద హాటు ఘాటు విమర్శలు చేస్తున్నారంటే అది కచ్చితంగా మారిన పార్టీ వైఖరిలో భాగమేనని అంటున్నారు. ఇప్పుడున్న పరిస్థితుల్లో సీఎం రేవంత్ రెడ్డి మీద కౌంటర్ ఎటాక్ చేయకపోతే పార్టీ కేడర్‌లోకి కూడా తప్పుడు సంకేతాలు వెళతాయన్న అభిప్రాయం బీజేపీ నేతల్లో ఉంది. అందుకే ముఖ్యమంత్రి మీద డైరెక్ట్ అటాక్ స్టార్ట్ చేసినట్టు చెబుతున్నారు. ఆట నువ్వు మొదలు పెట్టావు 2028లో ఆ ఆటను మేము ముగిస్తాం. నన్ను తెలంగాణ నుంచి తరిమికొట్టే వాడు ఇంకా పుట్టలేదు? నేను చేతకాని రాహుల్ గాంధీ నాయకత్వం పని చేయడం లేదు. మా రాజీనామాలు సరే?. ఇచ్చిన గ్యారంటీలు అమలు చేయలేని మీ సంగతి ఏంటంటూ గతంలో ఎన్నడూ లేనతం ఘాటుగా రేవంత్ మీద మాటల దాడి చేశారు. తెలంగాణ ప్రాజెక్టలను కిషన్‌రెడ్డి అడ్డుకుంటున్నారంటూ ఆరోపిస్తున్నారు సీఎం. కిషన్ రెడ్డి పై రేవంత్ వాడుతున్న భాష విషయంలో కూడా బీజేపీ నేతలు అభ్యంతరం వ్యక్తం చేస్తున్నారు. ఈ క్రమంలో తాజాగా బండి కూడా అటాక్ మొదలు పెట్టారు.

# బిజెపికి లబ్ది చేకూర్చేలా సర్ ప్రక్రియ

ఈ పక్రియలో ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ, జగ్గారెడ్డితోపాటు తన ఓటు గల్లంతు అయినా ఆశ్చర్య పోనక్కర్లేదని వ్యంగ్యంగా అన్నారు. ప్రపంచంలోనే అతిపెద్ద ప్రజాస్వామ్య దేశం భారత్ అని ,అలాంటి దేశంలో కేంద్ర ఎన్నికల సంఘం బీజేపీకి తొత్తుగా మారిందని ఆరోపించారు. 2002లో ఎస్ఐఆర్ పక్రియ పారదర్శకంగా జరిగిందని.. కానీ ప్రస్తుతం వారికి ఓట్లు పడవనుకుంటే వాటిని తొలగిస్తుందన్నారు. తమ ఓట్లు క్షేమంగా ఉండాలంటే బీఎల్ఏ కీలకంగా పని చేయాల్సి ఉంటుందని చెప్పారు. రాజకీయాల్లో తనకు దామోదర రాజనర్సింహ ఓనమాలు నేర్పించారని గుర్తు చేసుకున్నారు. ఈ దేశంలో అతికొద్దిమంది నిజాయితీ పరుల్లో మీనాక్షి నటరాజన్ ఒకరని పేర్కొన్నారు. అకారణంతోనే ఆమె రాజ్యసభ నామినేషన్ పత్రాన్ని తిరస్కరించారని తెలిపారు. బీజేపీ వాళ్లకి కనికరం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. నిరంతరం అధికారంలో ఉండి చక్రవర్తుల్లా ఉండాలని బీజేపీ నేతలు అనుకుంటున్నారని వ్యాఖ్యానించారు. మీ కంటే పెద్ద చక్రవర్తులే నేలమట్టం అయ్యారు.. ప్రధాని మోదీ, కేంద్ర మంత్రి అమిత్ షాలు ఎంత..? అని ప్రశ్నించారు. అధికారం శాశ్వతం అనుకుంటే.. వారు మూర్ఖులే అవుతారన్నారు. దేవుళ్లకు ఎవరు వ్యతిరేకం కాదు.. కానీ దేవుడి పేరు చెప్పనిదే బీజేపీ వాళ్లకు ఓట్లు పడవన్నారు. ఏడాదిలో చాలాసార్లు టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి పూజలు నిర్వహిస్తారని.. కానీ దేవుళ్ల పేరుతో తాము ఓట్లు అడిగమన్నారు. ఏడాదికి 2 కోట్ల ఉద్యోగాలు ఇస్తానని.. ఉన్న ఉద్యోగాలను తీసేస్తున్నారంటూ కేంద్రంపై టీపీసీసీ చీఫ్ నిప్పులు చెరిగారు. ఇకపోతే జనసేన పార్టీ అధ్యక్షుడు, ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ వెనుక బీజేపీ ఉందని టీపీసీసీ చీఫ్ విమర్శించారు. కమలం పార్టీ ఆడించినట్టే.. ఆయన ఆడుతున్నారని ఆరోపించారు. మీ సానుభూతి తమకేం అవసరం లేదని పవన్‌కు స్పష్టం చేశారు. మీ కుట్రలు ప్రజలు గమనిస్తున్నారని పవన్‌కు సూచించారు. తెలంగాణ వచ్చినప్పుడు 10 రోజులు అన్నం తినలేదని పవన్ వ్యాఖ్యలను ఈ సందర్భంగా ఆయన గుర్తు చేశారు. ఈ 12 ఏళ్లలో తెలంగాణకు ఏం చేశారో చిట్టా ఇవ్వాలని కేంద్ర బొగ్గు గనుల శాఖ మంత్రి కిషన్ రెడ్డిని టీపీసీసీ చీఫ్ మహేశ్ కుమార్ గౌడ్ డిమాండ్ చేశారు. మంగళవారం ఢిల్లీలో కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి చేసిన వ్యాఖ్యలకు ఆయన కౌంటర్ ఇచ్చారు. కేంద్రం నుంచి రాష్టానికి ఇంకా నిధులు రావాల్సి ఉందన్నారు. విభజన హామీలను ఇప్పటి వరకు నెరవేర్చలేదంటూ కేంద్ర ప్రభుత్వంపై ఆగ్రహం వ్యక్తం చేశారు మీరు సబర్మతి కట్టుకో వచ్చు.. తాము మూసి ప్రక్షాళన చేస్తామంటే నిధులు ఇవ్వరని అసహనం వ్యక్తం చేశారు. వీటికి సమాధానం చెప్పాలంటూ కేంద్ర మంత్రి కిషన్ రెడ్డికి స్పష్టం చేశారు. ఓ వైపు బీజేపీ, మరో వైపు బీఆర్ఎస్ పార్టీలు రాష్ట్రంలో జరుగుతున్న అభివృద్ధిని చూసి ఓర్వలేక పోతున్నారని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మంత్రి దామోదర రాజనర్సింహ, టీజీఐఐసీ చీఫ్ నిర్మలా జగ్గారెడ్డి, టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి పాల్గొన్నారు.

# అద్భుత నగరంగా అమరావతి నిర్మాణం

క్వాంటం కంప్యూటింగ్ హబ్, డిజిటల్ ఇన్ఫ్రాస్ట్రక్చర్ ప్రత్యేక ఆకర్షణలన్నారు. ప్రపంచంలోనే అత్యుత్తమ నగరంగా అమరావతి నిర్మాణం అవుతోందన్నారు. అమరావతిని సందర్శించి.. సరికొత్త ఆలోచనలతో అవకాశాలను వినియోగించుకోవాలని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు పిలుపునిచ్చారు. 25 ఏళ్ల క్రితం ఐటీ గురించి మాట్లాడానని... ఫస్ట్ మూవర్ అడ్వాంటేజ్‌తో ఈరోజు తెలుగువాళ్లు తలసరి ఆదాయంలో ముందున్నారని తెలిపారు. ఇప్పుడు ఏఐ వచ్చిందన్నారు. నాడు సైబరాబాద్‌ను అభివృద్ధి చేశామని... నేడు తెలంగాణకు ప్రధాన ఆదాయవనరుగా మారిందని చెప్పారు. రాష్ట్ర విభజనతో మరో నగరాన్ని నిర్మించే అవకాశం వచ్చిందని... అమరావతిని గ్రీన్ ఫీల్డ్ సిటీగా నిర్మిస్తున్నామని వెల్లడించారు. కృష్ణానది, ఇన్నర్ - ఔటర్ రింగ్ రోడ్లు, ఐకానిక్ బ్రిడ్జిలతో అద్భుతంగా అమరావతి రూపుదిద్దుకుంటోందని వివరించారు. స్పోర్ట్స్, ఫైనాన్సియల్, నాలెడ్జ్, జస్టిస్, టూరిజం, హెల్త్, మీడియా వంటి కాన్సెప్ట్స్ తీసుకున్నామన్నారు. ఒకే ఒక్క పిలుపుతో రాజధాని కోసం రైతులు 35 వేల ఎకరాలను అప్పగించారని... వాటిలో కొంత భాగాన్ని అభివృద్ధి చేసి రైతులకు తిరిగి ప్లాట్లు ఇస్తున్నామన్నారు. 21 కి.మీ పొడవునా వాటర్ ఫ్రంట్ నగరంగా అమరావతి ఉంటుందని తెలిపారు. సైక్లింగ్, వాకింగ్ ట్రాక్, గ్రీన్ ఫీల్డ్ ఎయిర్ పోర్ట్, అండర్ గ్రౌండ్ యుటిలిటీస్, గ్రీన్ ఎనర్జీ, నెట్ జీరో లక్ష్యంగా రాజధాని నిర్మాణం జరుగుతోందని ముఖ్యమంత్రి వెల్లడించారు. సైబరాబాద్‌లో నాడు ఎకరం రూ.2 లక్షలు ఉంటే... నేడు రూ.200 కోట్లకు పెరిగిందన్నారు. అభివృద్ధి జరిగితే సంపద సృష్టి సాధ్యమవుతుందనేందుకు సైబరాబాద్ నిదర్శనమని తెలిపారు.

# ఆదాయానికి మించిన ఆస్తులు

### ల్యాండ్ సర్వే డిప్యూటీ డైరెక్టర్ నరహరి ఇంట్లో ఎసిబి సోదాలు

### భారీగా ఆస్తులు కూడబెట్టినట్లు గుర్తింపు

హైదరాబాద్ : ఆదాయానికి మించి ఆస్తులు కలిగి ఉన్నారనే పక్కా సమాచారంతో ల్యాండ్ అండ్ సర్వే డిప్యూటి డైరెక్టర్ నరహరి ఇంట్లో ఎసిబి అధికారులు మంగళవారం ఉదయం నుంచి విస్తృత తనిఖీలు చేపట్టారు. నగరంలోని నరహరి నివాసంతో పాటు ఆయనకు సంబంధించిన ఆఫీసులు, బంధువులు, అత్యంత ఆప్తుల ఇళ్లలో ఎసిబి బృందాలు ఏకకాలంలో సోదాలు చేపట్టారు. హైదరాబాద్, పరిసర ప్రాంతాల్లోని దాదాపు 10 విభిన్న ప్రాంతాలలో ఈ దాడులు కొనసాగుతున్నాయి. నరహరి తన అధికారిక ఆదాయానికి మించి భారీగా అక్రమ ఆస్తులను కూడబెట్టారనే ఆరోపణలపై ఎసిబి ఈ చర్యలు చేపట్టింది. ఈ తనిఖీల్లో కీలకమైన భూమి పత్రాలు, బ్యాంక్ ఖాతాల వివరాలు, నగదు, బంగారు ఆభరణాలకు సంబంధించిన డాక్యుమెంట్లను అధికారులు పరిశీలిస్తున్నట్లు సమాచారం. ప్రస్తుతం ఈ దాడులు ఇంకా కొనసాగుతున్నాయి. సోదాలు ముగిసిన తర్వాత పట్టుబడిన అక్రమ ఆస్తుల పూర్తి వివరాలను, వాటి మార్కెట్ విలువను ఏసీబీ అధికారులు అధికారికంగా వెల్లడించే అవకాశం ఉంది.ఏసీబీ డీఎస్పీ శ్రీధర్ ఆధ్వర్యంలో 13 చోట్ల సోదాలు జరుగుతున్నాయి. ఆదాయానికి మించిన ఆస్తులు ఉన్నాయనే ఆరోపణల నేపథ్యంలో ఏసీబీ సోదాలు నిర్వహిస్తోంది. చార్మినార్‌తో సహా పలు ప్రాంతాల్లో తనిఖీలు జరుగుతున్నాయి. సోదాల్లో భాగంగా భారీగా అక్రమాస్తులను ఏసీబీ అధికారులు గుర్తించారు. ల్యాండ్ డాక్యుమెంట్‌లు, బంగారు ఆభరణాలతో పాటు రూ.1.10 కోట్ల నగదును స్వాధీనం చేసుకున్నారు. నరహరితో పాటు ఆయన తమ్ముడి నివాసంలో సోదాలు కొనసాగుతున్నాయి. తమ్ముడి ఇంట్లోనూ భారీగా ఆస్తులను అధికారులు గుర్తించారు. ఇప్పటికే స్వాధీనం చేసుకున్న ఆస్తుల వివరాలపై అన్నదమ్ముల నుంచి వివరాలు సేకరిస్తున్నారు. ల్యాండ్ అండ్ సర్వే డిపార్ట్‌మెంట్‌లో మల్టీ జోన్ 2 డిప్యూటీ డైరెక్టర్‌గా నరహరి కీలక విధులు నిర్వహిస్తున్నారు. భూమి సర్వే, సరిహద్దు వివాదాల పరిష్కారం, భూమి స్వాధీనం వంటి కీలక ఉద్యోగ బాధ్యతలను ఆయన నిర్వర్తిస్తున్నారు. గతంలో రంగారెడ్డి జిల్లాకి ఏడీగా కొంకరి నరహరి పనిచేశారు. దీంతో ఆ సమయంలో కూడా భారీగా అక్రమాలకు పాల్పడినట్టు ఏసీబీ అధికారులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు.

## జూలై 19నుంచి ఉజ్జయినీ మహంకాళి బోనాలు

### ఆహ్వాన పత్రికను మంత్రి పొన్నంకు అందచేత

హైదరాబాద్,జూన్16 : తెలంగాణ సంస్కృతి, సాంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే సికింద్రాబాద్ శ్రీ ఉజ్జయిని మహంకాళి దేవస్థానం ఆషాఢ బోనాల జాతర మహోత్సవాలకు ముస్తాబవుతోంది. ఈ ఏడాది నిర్వహించబోయే వార్షిక బోనాల జాతర కార్యక్రమాల అధికారిక షెడ్యూల్ వివరాలను ఆలయ చైర్మన్, అర్చక బృందం కలిసి రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్‌కి అందజేశారు. జాతరను అత్యంత వైభవంగా, భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా నిర్వహించేందుకు వీలుగా ముందస్తు ఏర్పాట్లపై చర్చించేందుకు ఈ వివరాలను మంత్రికి సమర్పించారు. ఆలయ దేవస్థానం ప్రకటించిన అధికారిక షెడ్యూల్ ప్రకారం.. జూలై 19వ తేదీ ఆదివారం సాయంత్రం 4:00 గంటలకు అమ్మవారి ఘటోత్సవం కార్యక్రమంతో ఈ మహోత్సవాలు అత్యంత వైభవంగా ప్రారంభం కానున్నాయి.

# పారదర్శకంగా యూరియా పంపిణీ

తెలంగాణ వ్యవసాయ శాఖ మంత్రి పేర్కొన్నారు. ఉదయం 10 నుంచి సాయంత్రం 5 గంటల వరకు ఈ టోల్ ఫ్రీ సేవలు అందుబాటులో ఉంటాయన్నారు. ఈ యాప్ వినియోగంలో నిజామాబాద్ జిల్లా రైతులు రాష్ట్రంలో ముందంజలో ఉన్నారని ప్రశంసించారు. యూరియా బ్లాక్ మార్కెటింగ్, అక్రమ రవాణాకు చెక్ పెట్టేందుకే ఈ డిజిటల్ విధానం అమల్లోకి తీసుకొచ్చినట్లు వివరించారు. నిజమైన రైతులకు మాత్రమే ఎరువులు అందేలా ప్రభుత్వం చర్యలు చేపట్టిందని తెలిపారు. అంతర్జాతీయ పరిస్థితుల ప్రభావం ఉన్నా యూరియా కొరత రానివ్వమని రైతులకు ఈ సందర్భంగా మంత్రి తుమ్మల భరోసా కల్పించారు. పెద్ద రైతులు ఆందోళన చెంద వద్దని.. అందరికీ సమానంగా ఎరువుల పంపిణీ చేస్తామన్నారు. అధిక యూరియా వినియోగం భూసారానికి హానికరం అని రైతులను ఆయన హెచ్చరించారు. ఎల్‌నినో ప్రభావంతో ఈ ఏడాది తక్కువ వర్షాలు వచ్చే అవకాశం ఉందన్నారు. ఈ నేపథ్యంలో అప్రమత్తంగా ఉండాలని రైతులకు స్పష్టం చేశారు. వర్షాభావ పరిస్థితుల్లో ప్రత్యామ్నాయ పంటల సాగుపై దృష్టి పెట్టాలంటూ రైతులకు మంత్రి తుమ్మల సూచించారు. అధిక నీటి అవసరం ఉన్న వరికి బదులు ఆయిల్ పామ్ వంటి లాభసాటి పంటల వైపు వెళ్లాలని రైతులకు స్పష్టం చేశారు. ప్రతికూల వాతావరణ పరిస్థితుల్లో రైతాంగానికి తమ ప్రభుత్వం అండగా ఉంటుందని రైతులకు మంత్రి తుమ్మల నాగేశ్వరరావు భరోసా కల్పించారు.

# ఆర్ అండ్ బిలో కాంట్రాక్టర్లకు బకాయిలు

కాంట్రాక్టర్లు చేసిన పనులకు బిల్లులు చెల్లించలేదని విమర్శించారు. బిల్లుల కోసం ఈనెల 18న చలో హైదరాబాద్ కు తెలంగాణ బిల్డర్స్ అసోసియేషన్ పిలుపునిచ్చిందని మంత్రి తెలిపారు. సీఎంతో మాట్లాడి బకాయిలు చెల్లిస్తామని హామీ ఇచ్చామన్నారు. చలో హైదరాబాద్ కార్యక్రమాన్ని విరమించాలని కోరగా.. ఈరోజు సాయంత్రం వరకు చర్చించుకుని నిర్ణయం చెబుతామని వారు చెప్పారన్నారు. పత్రికల్లో వార్తల కోసం మాజీ మంత్రులు కేటీఆర్, హరీశ్ రావు తమపై తప్పుడు విమర్శలు చేస్తున్నారని మండిపడ్డారు. బట్టకాల్చి మీద వేస్తే కాలిపోతామని అనుకుంటున్నారని అన్నారు. 'మేం ఎంతకు కాంట్రాక్టులు ఇచ్చామో? చూస్తే హరీశ్ రావు తాను పొరపాటుగా మాట్లాడినట్లు ఒప్పుకుంటారు' అంటూ మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి వ్యాఖ్యానించారు.

# హోంమంత్రి అనితపై గుడివాడ కామెంట్స్

ప్రజా జీవితంలో ఉన్నవారి నోటి నుంచి వచ్చే ప్రతి మాటను పౌర సమాజం గమనిస్తోందనే విషయాన్ని మరచిపోవద్దని పవన్ అన్నారు. రాజకీయాల్లో విమర్శలు, ప్రతి విమర్శలు ఉంటాయని... అవి విధానపరంగానే ఉండాలన్నారు. ఒక పాలసీ నచ్చకపోతే ఆ పాలసీ విషయంపైనే విమర్శించాలన్నారు. వాచలత్వంతో ఇళ్లలోని స్త్రీలను కూడా కించపరచే నైజం ఉన్న పార్టీ చేసే కామెంట్స్‌లను బలంగా తిప్పికొట్టేటప్పుడు వాళ్లు చేస్తున్న వ్యాఖ్యల్లో ఎంతటి అభ్యంతరకరమైన విషయం ఉందో ప్రజలకు తెలియజెప్పాలని కూటమి నేతలకు సూచించారు. కూటమి నేతలందరూ పౌర సమాజం హర్షించే భాషలో మాట్లాడి బలంగా బదులివ్వాలన్నారు. అవతలి పార్టీవాళ్ల మాదిరి దిగజారుడు భాష, అర్థరహిత వ్యాఖ్యలు కూటమి నేతలకు అవసరం లేదని పవన్ కల్యాణ్ స్పష్టం చేశారు.

# ఒడిషాలో ఘోర రోడ్డు ప్రమాదం

### రెండు ట్రక్కులు ఢీకొని ఇద్దరు డ్రైవర్ల సజీవ దహనం

భువనేశ్వర్,జూన్16 : ఒడిశాలో దారుణం జరిగింది. రెండు ట్రక్కులు ఢీకొన్న ఘటనలో వాటిలోని ఇద్దరు డ్రైవర్లు సజీవ దహనమయ్యారు. ఈ ఘటన మంగళవారం ఉదయం ఒడిశాలోని సుందర్‌గఢ్ జిల్లా, భస్మా పోలీస్ స్టేషన్ పరిధిలో కైంత్రా వద్ద, పదో నెంబర్ జాతీయ రహదారిపై జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. హైవేపై ఝార్సుగూడ నుంచి సుందర్‌గఢ్ వెళ్తున్న ట్రక్కు అతివేగం కారణంగా అదుపుతప్పింది. వేగాన్ని డ్రైవర్ నియంత్రించలేకపోవడంతో డివైడర్‌ను దాటిన ట్రక్కు ఒకవైపు నుంచి మరోవైపు రోడ్డు మీదికి వెళ్లిపోయింది. దీంతో అటువైపు నుంచి వస్తున్న ట్రక్కును ఢీకొంది. ఇలా రెండు ట్రక్కులు ఢీకొనడంతో వెంటనే మంటలు చెలరేగాయి. అవి పెద్ద ఎత్తున వ్యాపించి, పూర్తిగా అంటుకున్నాయి. ఈ ఘటనలో రెండు ట్రక్కుల్లోని డ్రైవర్లు మంటల్లో సజీవదహనమయ్యారు. వాహనాలు ఢీకొన్న సమయంలో డీజిల్ ట్యాంకర్ పగలడం వల్ల ఒక్కసారిగా మంటలు పెద్ద ఎత్తున వ్యాపించాయి. రెండు ట్రక్కులకు పూర్తిగా మంటలు అంటుకున్నాయి. డ్రైవర్లు బయటపడే అవకాశమే లేకపోయింది. ఇది గమనించిన ఇతర వాహనదారులు వెంటనే పోలీసులు, ÷ర్ సిబ్బందికి సమాచారం అందించారు. వారు వచ్చి మంటలను ఆర్పేశారు. కానీ, ఆలోపే ట్రక్కుల్లో ఇద్దరు డ్రైవర్లు కాలిపోయి మరణించారు. మంటల తీవ్రత కారణంగా డ్రైవర్ల మృతదేహాలు తీవ్రంగా కాలిపోయాయి. ఇంకా డ్రైవర్లను గుర్తించాల్సి ఉంది. ఈ ఘటనపై కేసు నమోదు చేసిన పోలీసులు విచారణ జరుపుతున్నారు.

# యూరియా యాప్ తొలగించాల్సిందే

### బిఆర్ఎస్ ఆధ్వర్యంలో రైతుల ఆందోళన

నిజామాబాద్ : యూరియా యాప్ తొలగించాలని బీఆర్ఎస్ పార్టీ నిజామాబాద్ రూరల్ ఇంచార్జ్ బాజిరెడ్డి జగన్ రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సిరికొండ మండల కేంద్రంలోని తెలంగాణ చౌరస్తాలో యూరియా యాప్‌ను తొలగించాలని డిమాండ్ చేస్తూ బీఆర్ఎస్ ఆధ్వర్యంలో రైతులతో కలిసి ఆయన మంగళవారం మహాధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా 'యూరియా యాప్ పోవాలి.. రేవంత్ దిగిరావాలి' అంటూ నినాదాలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులకు తక్షణమే యూరియా అందుబాటులోకి తీసుకురావాలని డిమాండ్ చేశారు. రైతులపై కక్ష సాధింపు చర్యల్లో భాగంగానే యూరియా యాప్ తెచ్చి రైతులను తీవ్ర ఆందోళనకు గురి చేస్తున్నారని ఆరోపించారు. సకాలంలో రైతుబంధు ఇవ్వక రైతులను ప్రభుత్వం నట్టేట ముంచుతుందని మండిపడ్డారు. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో రైతును రాజును చేసే ఘనత కేసీఆర్ కే దక్కిందని అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం అవలంబిస్తున్న తీరుపై రైతులు తీవ్ర మనోవేదనకు గురవుతున్నా రేవంత్ సర్కార్ పట్టించుకోకపోవడం సిగ్గు చేటన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో సకాలంలో రైతులకు ఎరువులు సకాలంలో పథకాలు అందించడంతోపాటు రైతు సంక్షేమం కోరిందని గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ మాజీ మండల అధ్యక్షుడు నారబోయిన శ్రీనివాస్, ఆకుల తిరుమల, లక్ష్మి, నరసయ్య, బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు రైతులు తదితరులు పాల్గొన్నారు.

# చిన్నారులపై పెరుగుతున్న అఘాయిత్యాలు

### తెలంగాణలో 16శాతం ఫోక్సో కేసులు నమోదు

### ఆందోళన వ్యక్తం చేసిన మాజీ ఎమ్మెల్యే గొంగిడి సునీత

హైదరాబాద్,జూన్16 : రాష్ట్రంలో చిన్నారులపై అఘాయిత్యాలు పెరిగాయి. ఆడ పిల్లల్ని కనాలంటే భయపడే పరిస్థితి రాష్ట్రంలో ఉందని మాజీ ఎమ్మెల్యే గొంగిడి సునితామహేందర్ రెడ్డి అన్నారు. బీఆర్ఎస్ భవన్‌లో ఆమె మీడియాతో మాట్లాడుతూ..మోదీ భేటీ బచావో భేటీ పడావో అంటారు. కేంద్ర హోం శాఖా సహాయ మంత్రి తెలంగాణలో ఉన్నారు. తెలంగాణ రాష్ట్ర హోం మంత్రిగా సీఎం రేవంత్ రెడ్డి ఉన్నారు. ఫోక్సో కేసులు దేశంలో 6 శాతం నమోదు అయితే ఒక్క తెలంగాణలో 16శాతం ఫోక్సో కేసులు నమోదు అయ్యాయని విమర్శించారు. తెలంగాణలో క్రైమ్ రేట్ పెరుగుతోందని ఆందోళన వ్యక్తం చేశారు. రేవంత్ రెడ్డి రాష్ట్రంలో శాంతి భద్రతలపై ఇప్పటి వరకు సమీక్ష చేయలదని మండిపడ్డారు. నాగర్‌కర్నూల్ జిల్లాలో కాంగ్రెస్ సర్పంచ్ చిన్నారిపై దాడి చేస్తే పోలీసు వాళ్లు సెటిల్ మెంట్ చేశారు. తెలంగాణలో మహిళలకు రక్షణ లేదని ఆవేదన వ్యక్తం చేశారు. కోటిమంది మహిళలను కోటీశ్వరులను చేస్తామని సీఎం అంటున్నారు. ముందు తెలంగాణలో చిన్నారులను కాపాడండి. తెలంగాణలో మహిళలపై జరుగుతున్న దాడులు సోనియాగాంధీ, ప్రియాంక గాంధీకి తెలియవా అని ప్రశ్నించారు. బండి భగీరథ్ కేసు విషయంలో తొలుత వీక్ సెక్షన్లు పెట్టారు. రాష్ట్రంలో మహిళలు రోడ్డు ఎక్కితే అప్పుడు సెక్షన్లు మార్చారని గుర్తు చేశారు. చిన్నారులపై అఘాయిత్యాలపై పాల్పడే వారిపై కఠిన చర్యలు తీసుకోవాలిన డిమాండ్ చేశారు. కేసీఆర్ సీఎంగా ఉన్నప్పుడు మహిళలకు ధైర్యం ఉండేదన్నారు.

# గాలివానకు కూలిన ఇళ్లకు పరిహారం చెల్లించాలి

### కలెక్టర్‌కు విన్నవించిన సౌరసంక్షేమ సమితి

సిరిసిల్ల,జూన్16 : సిరిసిల్ల పట్టణంలో ఇటీవల గాలివానలు, భారీ వర్షాల కారణంగా ఇండ్లు కూలిపోయిన బాధితులకు ప్రభుత్వం ప్రకటించిన నష్టపరిహారాన్ని వెంటనే అందించాలని సిరిసిల్ల పౌర సంక్షేమ సమితి డిమాండ్ చేసింది. ఈ మేరకు సంఘం ఆధ్వర్యంలో మంగళవారం కలెక్టర్‌ను కలిసి వినతిపత్రం సమర్పించింది. ఈ సందర్భంగా సమితి ప్రతినిధులు మాట్లాడుతూ వర్షాలకు ఇండ్లు కోల్పోయి తీవ్ర ఇబ్బందులు పడుతున్న అనేక మంది బాధితులకు ఇప్పటికీ ఆర్థిక సాయం అందలేదని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం నిర్ణయించిన నష్టపరిహారం పూర్తిస్థాయిలో కాకపోయినా, కనీసం తక్షణ సహాయంగా ఇవ్వాల్సిన మొత్తాలు కూడా పెండింగ్‌లో ఉన్నాయని తెలిపారు. సిరిసిల్ల తహసీల్దార్ కార్యాలయంలో ఇండ్లు కూలిన బాధితుల దరఖాస్తులు పెద్ద సంఖ్యలో పెండింగ్‌లో ఉన్నాయని, వాటిని వెంటనే పరిశీలించి అర్హులైన వారికి నష్టపరిహారం విడుదల చేయాలని కోరారు. అలాగే సిరిసిల్ల తహసీల్దార్ కార్యాలయ సూపరింటెండెంట్ భాస్కర్ రెడ్డిని బదిలీ చేయాలని కూడా కలెక్టర్‌ను కోరినట్లు వారు తెలిపారు. ఆయన చాలా కాలంగా సిరిసిల్లలోని వివిధ ప్రభుత్వ కార్యాలయాల్లో విధులు నిర్వహిస్తున్నారని, ప్రస్తుతం బదిలీల సమయం కావడంతో ఇతర ప్రాంతానికి బదిలీ చేయాలని విజ్ఞప్తి చేసినట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సిరిసిల్ల పౌర సంక్షేమ సమితి అధ్యక్షుడు బియ్యంకార్ శ్రీనివాస్, సహాయ కార్యదర్శి కుసుమ గణెళిష్ తదితరులు పాల్గొన్నారు.

### మున్సిపల్ కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

సిరిసిల్ల,జూన్16 : మున్సిపల్ కార్మికుల సమస్యలను వెంటనే పరిష్కరించాలని తెలంగాణ మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయీస్ యూనియన్ (సీఐటీయూ) జిల్లా కమిటీ డిమాండ్ చేసింది. ఈ మేరకు సోమవారం మున్సిపల్ కమిషనర్ ఖదీర్ పాషాకు వినతిపత్రం సమర్పించారు. మున్సిపల్ కార్మికులకు పెండింగ్‌లో ఉన్న సమస్యలను పరిష్కరించాలని, కనీస వేతనం రూ.26 వేలుగా నిర్ణయించాలని, 60 ఏళ్లు నిండిన కార్మికులకు సంక్షేమ పథకాల ద్వారా ఆర్థిక భద్రత కల్పించాలని సీఐటీయూ నాయకులు కోరారు. అలాగే కార్మికులకు పీఎఫ్, ఈఎస్ఐ వంటి సౌకర్యాలను పూర్తిస్థాయిలో అమలు చేయాలని డిమాండ్ చేశారు.

# సన్నరకం వరి విత్తనాలు సిద్ధం చేయండి

### రైతు వేదికల వద్ద అందుబాటులో ఉంచండి

### సన్నవడ్లు పండించే రైతుల డేటా సేకరించండి

### వ్యవసాయంలో కూడా ఎఐ, టెక్నాలజీ వినయోగం పెరగాలి

### వ్యవసాయ వర్సిటీ నోడల్ ఏజెన్సీగా సాంకేతిక సహకారం

### వ్యవసాయరంగంపై ఉన్నతస్థాయి సమీక్షలో సిఎం రేవంత్ సూచన



హైదరాబాద్,జూన్16 : ధాన్యం దిగుబడిపైన వ్యవసాయ శాఖకు సంపూర్ణ అవగాహన ఉండాలని తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సూచించారు. నిర్దేశించిన వరిరకాల విత్తనాలను రైతు వేదికలో అందుబాటులో ఉంచాలని మార్గనిర్దేశం చేశారు. సన్నవడ్లు పండించే రైతుల డేటా సేకరించాలని ఆదేశించారు. మంగళవారం హైదరాబాద్ ఎంసీఆర్‌హెచ్‌ఆర్డీ బోధి పెవిలియన్‌లో వ్యవసాయ శాఖపై సీఎం రేవంత్‌రెడ్డి సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వ్యవసాయ శాఖ అధికారులకు పలు కీలక అంశాలపై సీఎం దిశానిర్దేశం చేశారు. బోనస్ ఇచ్చే 7 రకాల సన్న వడ్లను అందుబాటులో ఉంచాలని ఆదేశించారు. 7 రకాల సన్న వడ్లను సబ్సిడీపైన ఇవ్వాలని మార్గనిర్దేశర చేశారు. భద్రాద్రి కొత్తగూడం దమ్మపేట మండలంలో ప్రారంభించిన పైలెట్ ప్రాజెక్ట్‌ను మరింతగా వినియోగించుకోవాలని సూచించారు. వ్యవసాయ శాఖలో సాంకేతికతను మరింతగా పెంచుకోవాలని సీఎం రేవంత్‌రెడ్డి దిశానిర్దేశం చేశారు. ఏఐని మరింతగా వినియోగించాలని నిర్దేశిరచారు. అగ్రికల్చర్ యూనివర్సిటీని నోడల్ ఏజెన్సీగా పెట్టుకొని సాంకేతికతను పెంచుకోవాలని సూచించారు. సీడ్స్ నుంచి కొనుగోలు వరకు వ్యవసాయ శాఖ, సివిల్ సప్లయిస్, అగ్రికల్చర్ యూనివర్సిటీ సమన్వయంతో పనిచేయాలని సూచించారు. మార్క్‌ఫెడ్ నష్టాలను తగ్గించుకునే ప్రయత్నాలు చేయాలని పేర్కొన్నారు. ఆయిల్ ఫెడ్‌ను బలోపేతం చేసుకోవాలని తెలిపారు. అన్ని వ్యవసాయ మందులకు సంబంధించి ఓ యాప్ ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. యాప్ ద్వారా బుక్ చేసుకునే యూరియాను రైతు వేదిక ద్వారా పంపిణీ చేయాలని అన్నారు. జిల్లా అదనపు కలెక్టర్‌కు యూరియా పంపిణీ బాధ్యతను అప్పగించాలని ఆదేశించారు. యూరియా, ఇతర ఎరువుల కేటాయింపులపై ఎప్పటికప్పుడూ కేందప్రభుత్వానికి లేఖలు రాయాలని ఆదేశించారు. రామగుండం ఎరువుల కర్మాగారంలో ఉత్పత్తి అయిన ఎరువులు మొత్తం తెలంగాణకే ఇచ్చేలా కేంద్రంపై ఒత్తిడి తీసుకురావాలని సీఎం రేవంత్‌రెడ్డి సూచించారు. ఎరువుల పరిస్థితిపైన అన్ని పార్టీల ఎంపీలతో ఓ సమావేశం నిర్వహించి పరిస్థితిని వివరించాలని సీఎం పేర్కొన్నారు. ఈ సమావేశానికి డిప్యూటీ సీఎం మల్లు భట్టివిక్రమార్క, మంత్రులు తుమ్మల నాగేశ్వరరావు, శ్రీధర్ బాబు, రాజ్యసభ సభ్యుడు వేం నరేందర్ రెడ్డి, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు, సీఎంఓ ముఖ్య కార్యదర్శి శేషాద్రి, వ్యవసాయ శాఖ కార్యదర్శి సురేంద్ర మోహన్, పౌర సరఫరాల కమిషనర్ స్టీఫెన్ రవీంద్ర, వ్యవసాయ శాఖ డైరెక్టర్ గోపి, ప్రణాళిక శాఖ కార్యదర్శి గౌరవ్ ఉప్పల్, ఇతర ఉన్నతాధికారులు హాజరయ్యారు.

# టూవీలర్ చోరీ ముఠా అరెస్ట్

### ముగ్గురు దొంగలను పట్టుకున్న పోలీసులు

నల్లగొండ,జూన్16 : మిర్యాలగూడ పట్టణంలో పలు చోట్ల ద్విచక్ర వాహనాలు చోరికి పాల్పడిన ముగ్గురు వ్యక్తులను అరెస్ట్ చేసినట్లు పట్టణ సీఐ సోమనర్సయ్య తెలిపారు. మంగళవారం టూ టౌన్ పోలీస్ స్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన వివరాలు వెల్లడించారు. పట్టణ పోలీసులు హనుమాన్‌పేట ఫ్లై ఓవర్ వద్ద వాహనాల తనిఖీలు నిర్వహిస్తుండగా అనుమానాస్పదంగా వెళ్తున్న ద్విచక్ర వాహనాన్ని ఆపి డాక్యుమెంట్లు చూపించాలని అడగగా వారు ఎలాంటి పత్రాలు చూపించకపోవడంతో పోలీసులు అదుపులోకి తీసుకుని విచారించారు. నిందితులు మద్యం సేవించడం, గుట్కా వినియోగించడం, పేకాట ఆడడం వంటి చెడు వ్యసనాలకు అలవాటుపడి డబ్బులు సంపాదించాలన్న ఉద్దేశ్యంతో పట్టణంలోని వివిధ ప్రాంతాల్లో పార్క్ చేసి ఉన్న మోటార్ సైకిళ్లను చోరి చేసినట్లు ఒప్పుకున్నారు. నిందితులను నల్లగొండ పట్టణ అర్జాలబావికి చెందిన కొంగరి నవీన్‌కుమార్, పాలకీడు మండలం గుడుగుంట్లపాలెంకు చెందిన సోమిరెడ్డి సైదిరెడ్డి, దామరచర్ల మండలం వాడపల్లికి చెందిన కె.సుమలతగా గుర్తించారు. పాత ద్విచక్ర వాహనాలను దొంగలించి దామరచర్ల మండల కేంద్రంలో ఉన్న సుమలత పాత ఇనుప సామాను దుకాణంలో విక్రయించినట్లు తెలిపారు. ఆమె మోటార్ సైకిళ్లను రూ.2,500 నుండి రూ.3 వేలకు తక్కువ ధరకు కొనుగోలు చేసి విడి భాగాలుగా విభజించి విక్రయించినట్లు దర్యాప్తులో వెల్లడైంది. చోరీ వాహనాల స్పేర్ పార్ట్స్ విక్రయించగా వచ్చిన రూ.1.38 లక్షల నగదును సుమలత నుండి స్వాదీనం చేసుకున్నట్లు తెలిపారు. అదేవిధంగా నిందితుల నుండి రెండు మోటార్ సైకిళ్లు, రూ.1.38 లక్షల నగదును స్వాదీనం చేసుకున్నట్లు వివరించారు. ముగ్గురు నిందితులను కోర్టులో రిమాండ్ చేసినట్లు తెలిపారు. సమావేశంలో పట్టణ పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

# రాష్ట్రవ్యాప్తంగా ఈగిల్ ఫోర్స్ దాడులు

### గోవా నుంచి హైదరాబాద్‌కు డ్రగ్స్ సరఫరా

### 19మందిని అదుపులోకి తీసుకున్న పోలీసులు

### 14మందికి గంజాయి పాజిటివ్‌గా గుర్తింపు

హైదరాబాద్,జూన్16 : తెలంగాణలోని వివిధ కమిషనరేట్ల పరిధిలో గంజాయి, డ్రగ్స్ వినియోగంపై భారీగా ఫిర్యాదులు అందుతున్న నేపథ్యంలో మంగళవారం ఈగల్ ఫోర్స్ పలు ప్రాంతాల్లో ఏకకాలంలో దాడులు నిర్వహించింది. ఈ సందర్భంగా 19 మందిని ఈగల్ ఫోర్స్ అదుపులోకి తీసుకుంది. వారికి వైద్య పరీక్షలు నిర్వహించగా.. 14 మందికి గంజాయి పాజిటివ్, మరో వ్యక్తికి గంజాయితోపాటు డ్రగ్స్ పాజిటివ్ వచ్చింది. పట్టుబడిన వారందరూ డ్రగ్స్ వినియోగించినట్లు విచారణలో అంగీకరించారని ఈగల్ ఫోర్స్ వెల్లడించింది. వీరందరిని డీ అడిక్షన్ సెంటర్లకు తరలించామని పేర్కొంది. వీరి తల్లిదండ్రులకు సమాచారం అందించామని తెలిపింది. హైదరాబాద్, సైబరాబాద్, మల్కాజిగిరి, ఫ్యూచర్ సిటీ కమిషనరేట్లతో పాటు మహబూబ్‌నగర్, నిజామాబాద్ జిల్లాల్లో ఈగల్ ఫోర్స్ ఈ దాడులు చేసింది. ఈగల్ ఫోర్స్15 బృందాలను ఏర్పాటు చేసి వారి సమన్వయంతో ఈ ఆపరేషన్ నిర్వహించారు. విచారణలో గంజాయి, డ్రగ్స్ తీసుకున్న వారి నుంచి ఈగల్ ఫోర్స్ పలు కీలక విషయాలు రాబట్టింది. గోవాలోని వగటోర్ బీచ్ ప్రాంతాన్ని ఒక ముఠా కేంద్రంగా తీసుకుని కొకైన్, ఎండీఎంఏ, ఎల్ఎస్‌డీ, హ్యాష్ ఆయిల్ సరఫరా చేస్తున్నట్లు గుర్తించింది. వాటిని బెంగళూరు, గోవా నుంచి హైదరాబాద్‌కు రవాణా చేస్తున్నట్లు కనుక్కొంది. సినీ పరిశ్రమలోని పలువురికి వీటిని విక్రయించినట్లు దర్యాప్తులో వెల్లడైంది. సాంకేతిక విశ్లేషణ ద్వారా మొత్తం 44 మంది వినియోగదారులను ఈగల్ ఫోర్స్ గుర్తించింది. డ్రగ్స్ వినియోగదారులు హైదరాబాద్, ఆంధ్రప్రదేశ్, కర్ణాటకతోపాటు గోవాలో ఉన్నట్లు విచారణలో బహిర్గతమైందని ఈగల్ టీం తెలిపింది. డ్రగ్స్ కొనుగోలు కోసం వినియోగదారులు చక్రపాణి, హర్షిత్ రెడ్డిల ఖాతాలకు రూ.3.13 లక్షలకుపైగా నగదు బదిలీ అయినట్లు గుర్తించింది. 2019లో వీరిద్దరు ఎన్‌డీపీఎస్ కేసులో అరెస్టయినట్లు ఈగల్ టీం వెల్లడించింది.

# అవినీతి అనకొండ నరహరి

### భారీగా ఆస్తులు గుర్తించిన ఎసిబి

### ఇంట్లో రూ.1.54కోట్ల నగదు స్వాధీనం

హైదరాబాద్,జూన్16 : ఆదాయానికి మించిన ఆస్తుల కేసులో ల్యాండ్స్ అండ్ సర్వే డిప్యూటీ డైరెక్టర్ సుంకరి నరహరిని ఏసీబీ అరెస్ట్ చేసింది. నరహరి ఇంటితో పాటు మరో 9 చోట్ల తనిఖీలు నిర్వహించినట్లు ఏసీబీ అధికారులు వెల్లడించారు. ఈ సోదాల్లో భారీగా అక్రమాస్తులను గుర్తించినట్లు తెలిపారు. నరహరి ఇంట్లో రూ.1.54కోట్ల నగదు, రూ.5.04 కోట్ల విలువ చేసే ఫిక్స్‌డ్ డిపాజిట్లు, బ్యాంకు ఖాతాలో రూ.2.29 కోట్లు ఉన్నట్లు ఏసీబీ గుర్తించింది. 1.3 కిలోల బంగారం, 8 కిలోల వెండి ఆభరణాలు, భార్య పేరున రెండు బ్యాంకు లాకర్లు, కారు ఉన్నట్లు అధికారులు తేల్చారు. రంగారెడ్డి జిల్లాల్లో 5 ఓపెన్ ఎ÷-లాట్లు, మహేశ్వరంలో 1.24 ఎకరాల వ్యవసాయ భూమి, పుప్పాలగూడలో ఓ అపార్ట్‌మెంట్ ఉన్నట్లు గుర్తించారు. నార్సింగిలోని అపార్ట్‌మెంట్‌లో రెండు ఎ÷-లాట్లు, రాజేంద్రనగర్‌లో మరో ఎ÷-లాట్, గచ్చిబౌలి టీఎన్జీవో కాలనీలో జీప్లస్ 3 భవనం, ఛత్రినాకలో మూడంతస్తుల భవనం ఉన్నట్లు ఏసీబీ తేల్చింది. ప్రభుత్వ లెక్కల ప్రకారం ఈ ఆస్తుల విలువ రూ.13.05 కోట్లు అని.. బహిరంగ మార్కెట్‌లో రూ.150 కోట్లకు పైనే ఉంటుందని అధికారులు వెల్లడించారు.

# ఆర్థిక సంక్షోభంలో కూరుకున్న తమిళనాడు

చెన్నై,జూన్16 : తమిళనాడు ముఖ్యమంత్రి సి.జోసెఫ్ విజయ్ నేతృత్వంలోని టీవీకే ప్రభుత్వం రాష్ట్ర ఆర్థిక పరిస్థితిపై సమగ్ర శ్వేతపత్రాన్ని మంగళవారంనాడు విడుదల చేసింది. డీఎంకే ప్రభుత్వ హయాంలో రాష్ట్రం తీవ్ర ఆర్థిక సంక్షోభంలో కూరుకుపోయిందని, ఖజానా ఖాళీ అయిందని ఆ శ్వేతపత్రంలో పేర్కొంది. రాష్ట్ర మొత్తం ఆర్థిక భారం రూ.13.18 లక్షల కోట్లకు చేరిందని తెలిపింది. ప్రత్యక్ష రుణభారం దాదాపు రూ.10 లక్షల కోట్లుగా పేర్కొంది. ఎంకే స్టాలిన్ సారథ్యంలోని గత డీఎంకే ప్రభుత్వం ఐదేళ్ల పాలనలో రాష్ట్ర రుణ భారం దాదాపు రెట్టింపయిందని, రాష్ట్రంలో పుట్టే ప్రతి చిన్నారిపై రూ.1.28 లక్షల అప్పుభారం పడుతోందని ఆ నివేదిక పేర్కొంది. రాష్ట్ర ఆర్థిక లోటు 78,324 కోట్లుగా నమోదైనట్టు తెలిపింది. ప్రభుత్వానికి వచ్చే ప్రతి రూపాయిలో 22.8 పైసలు అప్పులపై వడ్డీ చెల్లింపులకే పోతోందని శ్వేతపత్రం తెలిపింది.

# మా భూములు మాకివ్వండి

### సిసిఐ ముందు భూ నిర్వాసితుల డిమాండ్

### సిసిఐ స్క్రాప్ కింద అమ్మడం దారుణమని విమర్శ

### సిసిఐ సాధన కమిటీ ఆధ్వర్యంలో ఆందోళన

ఆదిలాబాద్,జూన్16 : ఆదిలాబాద్ జిల్లాలో సీసీఐ సిమెంట్ పరిశ్రమ పునఃప్రారంభం కోసం సీసీఐ సాధన కమిటీ మరోమారు ఆందోళనకు దిగింది. సంస్థను పునరుద్దరించలేకపోతే మా భూములు మాకివ్వాలని ఆందోళనకారులు డిమాండ్ చేశారు. దీనిపై స్థానిక బిజెపి ఎమ్మెల్యే, ఎంపిలు సమాధానం చెప్పాలన్నారు. అనేక సందర్భాల్లో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు విజ్ఞప్తులు చేసినప్పటికీ ఇప్పటికీ స్పష్టమైన చర్యలు కనిపించడం లేదని మాజీ మంత్రి జోగు రామన్న అన్నారు. మంగళవారం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సీసీఐ పునఃప్రారంభ విషయంలో చూపిస్తున్న నిర్లక్ష్యానికి నిరసనగా సీసీఐ సాధన కమిటీ ఆధ్వర్యంలో ఆదిలాబాద్ పట్టణంలో 'హలో యువత చలో సీసీఐ పరిశ్రమ'కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మాజీ మంత్రి జోగు రామన్న ఆధ్వర్యంలో భారీ బైక్ ర్యాలీ చేపట్టారు. అనంతరం సీసీఐ పరిశ్రమ ప్రధాన గేటు వద్ద బైఠాయించి నిరసన వ్యక్తం చేశారు. పరిశ్రమలో స్క్రాప్‌గా మార్చిన ప్రాంతాలను జోగు రామన్న, సీసీఐ సాధన కమిటీ సభ్యులతో కలిసి పరిశీలించి తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..కళ్లముందే యువత ఆశలు చెదిరిపోతుంటే అండగా నిలవాల్సిన కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు స్వలాభాల కోసం పరిశ్రమను తుక్కుగా మారుస్తున్నాయని విమర్శించారు. ఆదిలాబాద్ జిల్లా పరిశ్రమలు లేని వెనుకబడిన జిల్లాగా ఉందని, సీసీఐ పరిశ్రమ పునఃప్రారంభమైతే వేలాది మంది యువతీ యువకులకు ప్రత్యక్ష, పరోక్ష ఉపాధి అవకాశాలు లభిస్తాయని పేర్కొన్నారు. కేంద్ర నాయకులు బహిరంగ సభల్లో ఇచ్చిన హామీలపై స్థానిక ఎంపీ, ఎమ్మెల్యేలు ఎందుకు మౌనం వహిస్తున్నారో ప్రజలకు సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. స్క్రాప్ టెండర్ల వ్యవహారంపై తాము ప్రశ్నించినప్పటికీ ఎంపీ, ఎమ్మెల్యేలు స్పందించకపోవడం అనుమానాలకు తావిస్తోందన్నారు. భూ నిర్వాసితులు తమ భూములు కోల్పోయి ఇబ్బందులు పడుతుండగా, వందేళ్లకు సరిపడా ముడి సరుకు ఉన్నప్పటికీ పరిశ్రమ పునఃప్రారంభానికి ఒత్తిడి తేవడంలో ప్రజాప్రతినిధులు విఫలమయ్యారని విమర్శించారు. రానున్న రోజుల్లో ఆదిలాబాద్ ప్రజలు దీనిపై గట్టి తీర్పు ఇస్తారని హెచ్చరించారు. సీసీఐ సాధన కమిటీ ఆధ్వర్యంలో జరుగుతున్న ఉద్యమానికి బీఆర్ఎస్ పార్టీ పూర్తి మద్దతుగా ఉంటుందని స్పష్టం చేశారు. ఇదిలావుంటే మా భూములు మాకివ్వాలని సిసిఐకి భూముల ఇచ్చిన వారు డిమాండ్ చేశారు. పరిశ్రమను మూతేసినందున భూములను అప్పగించాలని ఆందోళనకారులు కోరారు. ఈ కార్యక్రమంలో దర్శనాల మల్లేష్ సీసీఐ సాధన కమిటీ కన్వీనర్, విజ్జగిరి నారాయణ కో కన్వీనర్, కొండ రమేష్, భూ నిర్వాసితులు,మాజీ మున్సిపల్ చైర్మన్ జోగు ప్రేమేందర్ తదితరులు పాల్గొన్నారు.

# హర్మూజ్ ఇక టోల్ ఫ్రీ ఏరియా

### నౌకలు స్వేచ్ఛగా వెళ్లేందుకు అనుమతి

### శుక్రవారం నాటికి పూర్తిగా తెరుచుకుంటుంది

### ఇరాన్‌పై కుదిరిన ఒప్పందాన్ని త్వరలో వెల్లడిస్తా

### జి 7 సదస్సులో అమెరికా అధ్యక్షుడు ట్రంప్ కీలక ప్రకటన

ప్యారిస్,జూన్16 : ఫ్రాన్స్‌లో జీ 7 సదస్సు వేదికగా అధ్యక్షుడు ట్రంప్ సంచలన ప్రకటన చేశారు. హోర్ముజ్ శాశ్వతంగా టోల్ రహితంగా ఉంటుందని వెల్లడించారు. సమ్మిట్‌ను ఉద్దేశించి ట్రంప్ ప్రసంగం చేశారు. ఇరాన్‌తో కుదిరిన శాంతి ఒప్పందంపై కీలక వ్యాఖ్యలు చేశారు. ప్రపంచ ఇంధన రవాణాకు అత్యంత కీలకమైన హోర్ముజ్ జలసంధి శుక్రవారం నాటికి పూర్తిగా తెరుచుకుంటుందని.. ఇకపై అది శాశ్వతంగా టోల్ ఫ్రీగా అందుబాటులో ఉంటుందని ప్రకటించారు. అలాగే ఇరాన్‌తో కుదిరిన అవగాహన ఒప్పందం పూర్తి వివరాలను త్వరలో వెల్లడిస్తానని.. దీనిపై ప్రత్యేకంగా మీడియా సమావేశం కూడా నిర్వహిస్తానని తెలిపారు. ఇరాన్‌తో కుదిరిన ఈ ఒప్పందాన్ని అమెరికా కాంగ్రెస్ పరిశీలనకు పంపనున్నట్లు ట్రంప్ చెప్పారు. ఈ ఒప్పందంలో ఇరాన్ అణ్వాయుధాలను అభివృద్ధి చేయబోదని స్పష్టంగా పేర్కొన్నామని వెల్లడించారు. ఇరాన్‌తో చర్చల తొలి దశ విజయవంతంగా పూర్తైందని.. రెండో దశ చర్చలు మరింత వేగంగా పూర్తవు తాయని ఆశాభావం వ్యక్తం చేశారు. ఇరాన్ ఒప్పందానికి సంబంధించిన పూర్తి పాఠ్యాన్ని అధికారిక కార్యక్రమంలో విడుదల చేస్తానని వెల్లడించారు. అమెరికా-ఇరాన్ మధ్య ఇటీవల కుదిరిన శాంతి ఒప్పందం ప్రపంచ రాజకీయాల్లో కీలక పరిణామంగా మారింది. ముఖ్యంగా హోర్ముజ్ జలసంధి పునఃప్రారంభం ప్రపంచ ఇంధన మార్కెట్లకు ఊరటనివ్వనుంది. ఇదిలా ఉండగా.. ఇరాన్ ప్రభుత్వ టెలివిజన్ కీలక ప్రకటన చేసింది. అమెరికాతో ఒప్పందం అనంతరం ఇరాన్‌కు చెందిన చమురు ట్యాంకర్లు, ఇతర వాణిజ్య నౌకలు మళ్లీ సముద్ర మార్గంలో ప్రయాణాలు ప్రారంభించాయని వెల్లడించింది. అమెరికా విధించిన నౌకాదళ దిగ్బంధనం సడలింపుకు ఇది సంకేతమని పేర్కొంది. ప్రస్తుతం మూడు ఇరానియన్ చమురు ట్యాంకర్లు ఉత్తర హిందూ మహాసముద్రంలో ప్రయాణిస్తుండగా.. మరో రెండు నౌకలు అవసరమైన సరుకులు, పశువుల మేతతో దక్షిణ ఇరాన్ నౌకాశ్రయాల వైపు వెళ్తున్నాయని ఇరాన్ మీడియా తెలిపింది. ఏప్రిల్ 13 నుంచి అమల్లో ఉన్న అమెరికా నౌకాదళ ఆంక్షల నేపథ్యంలో ఇరాన్ నౌకల రాకపోకలు తీవ్రంగా ప్రభావితమయ్యాయి. అయితే తాజా ఒప్పందంతో ఆ దిగ్బంధనాన్ని ఎత్తివేసే ప్రక్రియ అమలులోకి వచ్చిందని ఇరాన్ వర్గాలు చెబుతున్నాయి. ఈ పరిణామం ప్రపంచ చమురు సరఫరా వ్యవస్థపై సానుకూల ప్రభావం చూపే అవకాశం ఉందని విశ్లేషకులు భావిస్తున్నారు.

# ట్రంప్‌తో ప్రధాని మోడీ కరచాలనం

### జి7 సదస్సులో ఆత్మయీయ పలకరింపు

ప్యారిస్,జూన్16 : ఫ్రాన్స్‌లో జరుగుతున్న జీ7 సదస్సు సందర్భంగా భారత ప్రధాని నరేంద్ర మోదీ, అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ కలుసుకున్నారు. దాదాపు 16 నెలల తర్వాత ప్రత్యక్షంగా కలుసుకున్న వీరిద్దరూ ఆత్మీయంగా పలకరించుకోవడం అంతర్జాతీయ వేదికపై ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. జీ7 సదస్సు ప్రాంగణంలో జరిగిన ఈ సమావేశంలో మోదీ, ట్రంప్ ఒకరితో ఒకరు కరచాలనం చేసుకుని కాసేపు మాట్లాడుకున్నారు. గతేడాది ఫిబ్రవరి తర్వాత వీరిద్దరూ కలుసుకోవడం ఇదే మొదటిసారి. సదస్సులో వీరిద్దరూ పక్కపక్కనే కూర్చున్నారు. బుధవారం ఈ ఇరువురు నేతలు సమావేశం కాబోతున్నారు. భారత్-అమెరికా సంబంధాలు, ప్రపంచ ఆర్థిక పరిస్థితులు, భద్రతా అంశాలు, ప్రాంతీయ పరిణామాలపై ఇద్దరు నేతలు చర్చించబోతున్నట్టు సమాచారం.జీ7 సదస్సుకు హాజరైన మోదీ ప్రపంచ నాయకులతో వరుసగా సమావేశాలు నిర్వహించనున్నారు. అమెరికా అధ్యక్షుడు ట్రంప్‌తో పాటు కెనడా ప్రధాన మంత్రి మార్క్ కార్నీ, బ్రిటన్ పీఎం కీర్ స్టార్మర్, యూఏఈ అధ్యక్షుడు షేక్ మొహమ్మద్ బిన్ జాయెద్ అల్ నహ్యాన్‌లతో పలు ద్వైపాక్షిక సమావేశాలు నిర్వహించనున్నారు.

## సంపాదకీయం

# ఎరువులు, విత్తనాలపై భరోసా ఏదీ ?

ఉభయ తెలుగు రాష్ట్రాల్లో నైరుతి ప్రవేశించినా ఇప్పటికీ ఆశించిన వర్షాలు పడడం లేదు. రైతులు ఖరీఫ్‌కు సన్నద్ధం అవుతున్నా, అప్పుడే తొందరపడవద్దని, విత్తనాలు వేసుకోవద్దని వ్యవసాయాధికారులు హెచ్చరిస్తున్నారు. మరోవైపు సన్నరకాలను, డిమాండ్ ఉన్న వంగడాలనే వేయాలని తెలంగాణ ప్రభుత్వం తాజాగా సూచించింది. నిజానికి ఏ పంటలు వేయాలో రైతులకు సూచించి, అందుకు అనుగుణంగా ఎరువులు, విత్తనాలను సరఫరా చేసే విధానం అవంబించి ఉంటే ఇవాళ వ్యవసాయ సంక్షోభం ఉండేది కాదు. ఏ భూములు ఏ పంటలకు అనువో ఇన్నేళ్లయినా గుర్తించి, రైతులను వ్యవసాయానికి అనుగుణంగా సన్నదం చేయడంలో తెలుగు రాష్ట్రాల ప్రభుత్వాలు విఫలం అవుతున్నాయి. మరోవైపు ఎల్‌నినో భయ పెడుతున్న వేళ రైతులకు తగిన సూచనలు, సలహాలు చేయడం లేదు. ప్రణాళికలు సిద్ధం చేయడం లేదు. అందుకే ప్రభుత్వ నిర్లక్ష్యానికి ఏటా రైతులు బలవుతున్నారు. నీటి లభ్యత, భూముల వివరాల ఆధారంగా పంటలు పండించే పద్ధతి కానరావడం లేదు. రైతులు కూడా తమకు తెలిసిన వరిని పండిస్తున్నారు. డిమాండ్ ఉన్న పంటలు పండించి, ఆర్థికంగా ఎదగడం లేదు. కాగా ఈ ఏడాది సాధారణ వర్షపాతం కంటే తక్కువ నమోదవుతుందని ఐఎండి. అంచనా వేసింది. ఎల్‌నినో రాష్ట్రంపై ప్రభావం చూపుతుందని రెండు రాష్ట్రాల ప్రభుత్వాలు వెల్లడించాయి. అందుకు తగ్గ ప్రణాళికలతో సన్నద్ధం కావాలని ఆదేశించినా., అదేమిటో రైతులకు బోధపడడం లేదు. రాష్ట్రంలో అత్యధికంగా వ్యవసాయం సాగేది ఖరీఫ్‌లోనే. నిరుడు పంటల సరళిలో మార్పులు చోటు చేసుకున్నప్పటికీ మొత్తంగా విస్తీర్ణ పరంగా సాధారణ సాగు నమోదైంది. అయితే వర్షాభావం, అకాల, భారీ వర్షాలు, తుపాన్లతో పంట నష్టాలు సంభవించి అన్నదాతలను ఆర్థికంగా నష్టపరిచాయి. కీలక సమయంలో వర్షాల్లేక కొన్ని ప్రాంతాల్లో పంట నష్టం వాటిల్లింది. ఖరీఫ్‌లో డ్రై స్పెల్ వందల మండలాలల్లో తిష్ట వేసినా ప్రభుత్వం కేవలం పెద్దగా పట్టించుకోలేదు. ఎపిలో రబీలో దుర్భిక్ష పరిస్థితులు విస్తరించగా 51మండలాల్లో కరువును ప్రకటించి చేతులు దులుపుకుంది. ప్రకటించిన మండలాల్లో కూడా రైతులకు ఎలాంటి ప్రత్యేక సహాయమూ చేయలేదు. ఇంకో వైపు ఖరీఫ్, రబీ రెండు సీజన్లలో రైతులకు ఏ పంటకూ ధర రాక, ధర ఇప్పించేందుకు ప్రభుత్వం తగిన చర్యలు చేపట్టక రైతులు నష్టాలను చవిచూశారు. కేంద్రం కూడా ఒక పద్ధతి ప్రకటించడం లేదు. ఎల్‌నినోతో ఏ పంటలు వేసుకోవాలో, దేనికి మద్దతు ఇస్తరో తెలియడం లేదు. తెలంగాణలో మక్కజొన్న, జొన్న పంటలు వేసిన రైతులు తీవ్రంగా నష్టపోయారు. వాటికి గిట్టుబాటు ధరలు లేక తల్లడిల్లారు. పంటలు కొనుగోలు చేయడంలో ప్రభుత్వం పూర్తిగా విఫలం అయ్యింది. ఖరీఫ్ ముంచుకొస్తున్నా, నేటికీ సక్రమంగా ధాన్యం సేకరణ జరగలేదు. ఇకపోతే ఈఖరీఫ్‌లో సేద్యానికి రైతులకు అత్యవసరంగా కావాల్సినవి నాణ్యమైన విత్తనాలు,ఎరువులు, క్రిమిసంహారక మందులు, పెట్టుబడులు. రైతులకు అవసరమైన మొత్తం విత్తనాల్లో ప్రభుత్వం రాయితీపై అందించేవి 30 శాతమే. అవీ కొన్ని పంటలకే పరిమితం. ఎపిలో వేరుశనగ విత్తనాల పంపిణీ ఏర్పాట్లు ఆలస్యమయ్యాయి. వరి, కందులు, ఇతర అపరాలూ అంతే. పచ్చిరొట్ట పంట విత్తనాలిస్తున్నామంటున్నా బహిరంగ మార్కెట్ ధరలే రాయితీ విత్తనాలకూ నిర్ణయించారు. రాయితీ విత్తనాల పంపిణీ యావత్తూ అదే తీరు. సీజన్ ప్రారంభా నికి ముందు నుంచీ కేంద్రం ఆదేశాలతో యూరియా, డిఎపి వాడకాన్ని తగ్గించేందుకు ప్రభుత్వం ప్రత్యేక యాప్‌లని, కార్డులని, పైలెట్ ప్రాజెక్టులని ప్రహసనం లేవనెత్తి రైతుల్లో, ముఖ్యంగా కౌలు రైతుల్లో గుబులు రేపింది. నిరుడు ప్రభుత్వ ముందుచూపు లేక యూరియా దొరక్క రైతులు ఇబ్బంది పడగా, ఆ పరిస్థితులే ఇం కా కొనసాగుతున్నాయి. నకిలీ, కల్తీ, అనుమతుల్లేని పత్తి విత్తనాల బెడద ఉండనే ఉంది. కేంద్రం పెంచిన డీజిల్, పెట్రోలు ధరలు, ఎరువుల ధరలు రైతాంగాన్ని కుంగదీస్తున్నాయి. తొలకరి సంకేతాలతో రైతన్నలు సాగుకు సిద్ధమయ్యేందుకు కావాల్సిన పెట్టుబడులు సమకూర్చడంపై ప్రభుత్వంలో నెలకొన్న స్తబ్దత ఆందోళన కలిగిస్తుంది. ఎపిలో కౌలు రైతులకు రెండేళ్లల్లో ఒక్క రూపాయి ఇవ్వలేదు. ఈసారైనా ఇస్తారో లేదో తెలీదు. కౌలు రైతులకు గుర్తింపు కార్డుల ఊసే లేదు. నిరుడు అక్టోబర్‌లో మొంథా తుపాన్ రాగా నేటికీ రైతులకు ఇన్‌పుట్ సబ్సిడీ ఇవ్వలేదు. పంటల బీమా సొమ్ము లేదు. కరువు మండలాల్లో రైతులకు పరిహారం లేదు. రెండేళ్లల్లో రైతులకు సున్నా వడ్డీ రూపాయి కూడా విడుదల చేయలేదు. వార్షిక రుణ ప్రణాళిక లక్ష్యాలు పుస్తకాలకే పరిమితం అయ్యింది. ప్రాజెక్టుల కింద నీటి విడుదలకు షెడ్యూల్ ఇచ్చినా ఎల్‌నినో, వర్షాభావాలను పరిగణనలోకి తీసుకోవాలి. సేద్యం సజావుగా సాగాలంటే రైతుల అవసరాలన్నింటినీ తీర్చేందుకు ప్రభుత్వంలో చిత్తశుద్ధి, ముందుచూపు, సన్నద్ధత అవసరం. ఇకపోతే తెలంగాణలో ప్రభుత్వం తీరు సక్రమంగా కనిపించడం లేదు. దేశీయంగానే కాకుండా అంతర్జాతీయ మార్కెట్‌లోనూ డిమాండ్ ఉన్న 8 రకాల మేలైన వరి వంగడాలనే సాగు చేసేలా రైతులను ప్రభుత్వం ప్రోత్సహించాలని వ్యవసాయ విశ్వవిద్యాలయ ఆచార్యులు, శాస్త్రవేత్తలు సూచించారు. ఇందుకోసం రాష్ట్రవ్యాప్తంగా అవగాహన సదస్సులను నిర్వహించాలన్నారు. డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క అధ్యక్షతన జరిగిన క్యాబినెట్ సబ్‌కమిటీ ఎనిమిది రకాల వంగడాలను సాగు చేయించేలా ప్రభుత్వం చర్యలు చేపట్టాలని శాస్త్రవేత్తలు మంత్రులకు సూచించారు. ఈ వంగడాలకు మార్కెట్‌లో ఉన్న డిమాండ్ వల్ల ప్రభుత్వ మద్దతు ధర కంటే చాలా ఎక్కువ ధర లభించే అవకాశం ఉందన్నారు. ముఖ్యంగా అమెరికా, ఆస్ట్రేలియా, యూర్‌పలలో ఈ బియ్యానికి విపరీతమైన ఆదరణ ఉందని, వీటికి విత్తనాల కొరత కూడా లేదని వివరించారు. అంతర్జాతీయ మార్కెట్ ధరల్లో వచ్చే ఒడిదొడుకుల నుంచి రైతులకు రక్షణ లభించాలన్నా ఈ 8 రకాల సాగు ఒక్కటే మార్గమని తెలిపారు. రాష్ట్రంలో సాగవుతున్న అన్నిరకాల సన్న బియ్యానికి మార్కెట్‌లో ఆదరణ లభించడం లేదని, కొన్నిరకాల ధాన్యాన్ని మిల్లింగ్ చేస్తున్నప్పుడు నూకలు ఎక్కువగా వస్తున్నాయని పౌర సరఫరాల శాఖ అధికారులు మంత్రులకు వివరించారు. డిమాండ్ లేని రకాల సాగును క్రమంగా తగ్గించి, ఎగుమతులకు ఉపయోగపడే నిర్దిష్ట రకాలనే ప్రోత్సహించాలని అభిప్రాయపడ్డారు. అయితే ఇది క్షేత్రస్థాయిలో రైతులకు చేరాలి. వారికి సక్రమంగా విత్తనాలు సరఫరాచేసి, అవే పంటలు పండించేలా ప్రోత్సహించేందుకు నడుం బిగించాలి. అప్పుడే సత్ఫలితాలు సాధించగలం.

# కామన్ స్కూల్ విధానమే ప్రత్యామ్నాయం!



పాఠశాలలు పునర్ ప్రారంభం అవుతున్నాయి. విద్య వృథాను అరికట్టడానికి సిఎం రేవంత్‌రెడ్డి ఇప్పుడున్న 26వేల ప్రభుత్వ బడులను 4వేలకు కుదిస్తామంటున్నారు. ఉపాధ్యాయ సంఘాలు ససేమిరా అంటున్నాయి. సంస్కరణ అనివార్యమే? రోజురోజుకు కుంచించుకుపోతున్న ప్రభుత్వబడుల సంస్కరణ కాదనలేం, కానీ, ప్రైవేటు పాఠశాల వ్యవస్థ స్థిరీకరణకు ఆయాచిత లబ్ధి చేకూరకూడదు. ప్రభుత్వ బడులు సంస్కరణలతో పాటు, ప్రైవేటు పాఠశాల నియంత్రణ చేయాల్సిన కర్తవ్యం ప్రభుత్వంపై ఉంది. కనుక ఏ రకంగా చూసినా సరైన ప్రత్యామ్నాయం కామన్ స్కూల్ విధానమే. విద్యా వ్యవస్థ ఎన్నో విధాల భ్రష్టుపట్టిన, విద్యా వివక్ష రూపు మారాలంటే కామన్ స్కూల్ విధానం తప్ప మరో ప్రత్యామ్నాయం లేనేలేదు. అంతకు మించిన గత్యంతరం కూడా లేదు? కనుక ప్రజలు కామన్ స్కూల్ వ్యవస్థ కోసం కొట్లాడాలసిన అనివార్యత చోటుచేసుకుంది. అసలు కామన్ స్కూల్ అనే భావన ఏమిటి? నిర్ధారించిన ఆవాసం ప్రాంతంలో నర్సరీ నుండి ఇంటర్ వరకు తెలుగు, ఆంగ్ల మాధ్యమాల్లో ఒకే స్కూల్ ప్రజలకు అందుబాటులో ఉంచడం. రాజైనా, భంట్రోతైనా వారి పిల్లలు అదేపాఠశాలలో చదువుకునే ఏకీకృత పాఠశాల వ్యవస్థ. కుల, మత వైషమ్యాలు లేని విద్యా వ్యవస్థ. పాఠశాల అందుబాటు అనే అంశానికి వచ్చినప్పుడు పిజికల్ యాక్సెస్, సోషల్ యాక్సెస్ రెండు ఉంటాయి. పిజికల్ యాక్సెస్ ప్రకారం సర్వశిక్షా అభియాన్ నిబంధనలు, వివిధ విద్యా కమిషన్లు సిఫార్సు చేసిన విధంగా కిలోమీటర్ పరిధిలో ప్రాథమిక పాఠశాల, 3 కిలో మీటర్ల పరిధిలో ప్రాథమికోన్నత పాఠశాల, 5 కిలోమీటర్ల పరిధిలో ఉన్నత పాఠశాల ప్రజలకు అందుబాటులో ఉండాలి. ఒకవేళ ఇలాయాక్సెస్‌కు దూరం అయిన సందర్భంలో ఆయా విద్యార్థులకు ఉచితంగా ట్రాన్స్‌పోర్ట్ సౌకర్యం ద్వారానైనా తాత్కాలిక యాక్సెస్ కల్పించాల్సి ఉంటుంది. మరిన్ని కనుగొనండి అంతర్జాతీయ వార్తల సేవ బ్రేకింగ్ న్యూస్ సేవ తాజా వార్తలు సేవ-ూశ్రీంశీ =ముం - వలసలపై నేతల వరుస మారుతోంది! ఇక సోషల్ యాక్సెస్ రెండు రకాలు 1) ప్రత్యేక అవసరాలు గల పిల్లలకు మూగ, బధిర, అంధ పాఠశాలలు (బ్రెయిలీ) ఏర్పాటు చేయాల్సి ఉంటుంది. అయితే మానసిక విచలితులు, మానసిక ఎదుగుదలలేని పిల్లలు ప్రత్యేక అవసరాలు గల పిల్లలుగా గుర్తించినప్పటికీ వారికి సోషల్ యాక్సెస్ పాఠశాలలకంటే పిజికల్ యాక్సెస్ పాఠశాలల్లో ఉంచడమే సరైన విధానం అవుతుంది. ఎందుకంటే వారికి తల్లిదండ్రుల ప్రత్యేక పర్యవేక్షణ అవసరం. 2) మాతృభాషాపరమైన, సాంస్కృతిక పరమైన వైవిధ్యం కలిగిన వారికి ప్రత్యేక పాఠశాలలు. ఈ రెండు యాక్సెస్ పాఠశాలలు ప్రభుత్వ రంగంలోనే ఉండాలి. విద్యా హక్కు చట్టం 2009 కూడా 5 నుండి14 సంవత్సరాల పిల్లల విద్యకు ప్రభుత్వమే బాధ్యత వహించాలని చెప్పింది. అమెరికా, బ్రిటన్ లాంటి పాశ్చాత్య దేశాలు, చైనా, రష్యా లాంటి సోషలిస్టు దేశాల్లో కూడా ఆవాస ప్రాంతాలవారిగా ఏకీకృత పాఠశాల వ్యవస్థ అదీ ప్రభుత్వ రంగంలోనే అందుబాటులో ఉంది. కానీ, మన దేశంలోనే విద్యను అవాసప్రాంత నియంత్రణ, నియమాలు లేకుండా విచ్చలవిడిగా ప్రైవేటు పాఠశాల వ్యవస్థను అనుమతించడం వలన విద్యా వ్యవస్థ వెర్రితలలు వేసింది. పాలకులు కూడా ఉన్న ప్రభుత్వ బడులను ప్రజలు అవసరాల కనుగుణంగా తీర్చిదిద్దడానికి బదులు ఆకర్షణీయ నినాదాలుతో వివిధ రకాల పాఠశాలలు నియమ రహితంగా ఏర్పరచడం వలన ప్రభుత్వ పాఠశాలల్లో కూడా నమోదు దెబ్బతిని విద్యా వృథా కనిపిస్తుంది. - పెనుభారంగా ప్రైవేటు చదువులు చివరకు పాలకులు ఇటు ప్రభుత్వ విద్యా వ్యవస్థను సరిదిద్దలేక అటు ప్రైవేటు విద్య వ్యవస్థను నియంత్రణ చేయలేక ఎప్పటికప్పుడు పిల్లిమొగ్గలు వేయయడం తప్ప నిర్దిష్టమైన ప్రణాళికతో ముందుకు రాలేకపోతున్నారు. ఇప్పటికైనా ఆవాస ప్రాంతంలో అందుబాటులో ఏకీకృత పాఠశాల వ్యవస్థ అందుబాటులో ఉంచడం, కామన్ స్కూల్ సిస్టమ్‌ను ప్రవేశ పెట్టడం తప్ప మన విద్యావ్యవస్థకు మరో గత్యంతరం లేనేలేదు. కానీ, ప్రైవేటు పాఠశాల వ్యవస్థను రద్దుచేసి ప్రభుత్వ రంగంలోనే ఆవాసప్రాంతం వారీగా నమోదు చేసుకోగల ఏకీకృత పాఠశాల వ్యవస్థను తేగలు పాలకపక్షం సుదూర భవిష్యత్తులో కనిపించడం లేదు? ఎంతసేపు విద్యా మార్పులు పేరుతో మరో తప్పుడు వైఖరి వైపే పాలకులు మొగ్గుచూపుతున్నారు. విద్యలో కూడా ఆయాచిత లబ్ధిని వెతుక్కుంటున్నారు. ఇక తెలంగాణ విద్యా వ్యవస్థను ఒకసారి పరిశీలన చేస్తే 30,022 ప్రభుత్వ బడుల్లో ఇప్పటికే నాలుగు వేల పాఠశాలలు మూతపడ్డాయి. తెలంగాణ విద్యా కమిషన్ తన నివేదికలో పొందుపరిచిన గణాంకాలు ననుసరించి తెలంగాణలోని 19వేల ప్రాథమిక పాఠశాలల్లో 13 వేల పాఠశాలలు 50 మంది కంటే తక్కువ నమోదుతో కొనసాగుతున్నాయి. ఉన్నత పాఠశాలలు 5,500, ప్రాథమికోన్నత పాఠశాలలు 4,100 లో కూడా మూడింట రెండు వంతులు దరిదాపు అదే స్థాయిలో ఉన్నాయి. అంటే నానాటికీ దిగజారుతున్న పరిస్థితిలోనే ఉన్నాయి. ఇప్పటికీ 19 లక్షల విద్యార్థులు ప్రభుత్వ విద్యాలయాల్లో చదవుతుంటే, 36 లక్షల మంది విద్యార్థులు ప్రైవేటు విద్యా సంస్థలలోనే చదువుతున్నారు. అంటే తెలంగాణ ప్రభుత్వం తెలంగాణ పబ్లిక్ స్కూల్, యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ స్కూళ్లు పేరుతో ఎన్ని సంస్కరణలు ప్రవేశపెట్టినా అత్యదిక విద్యార్థులున్న ప్రైవేటు విద్యా సంస్థల నియంత్రణ చేయకుండా, ఉన్న ప్రభుత్వ బడులను అవసరమైన మార్పులతో సంస్కరణ చేయకుండా చేపట్టే చర్యలేవీ నిర్ధిష్టమైన ఫలితాలు ఇవ్వవుగాక ఇవ్వవు. మరిన్ని కనుగొనండి వీడియో వార్తల సేవ ఇ-పేపర్ యాక్సెస్ స్థానిక వార్తల సేవ ఒకవేళ మార్పులు చేర్పులు కొద్ది ఫలితం ఇవ్వాలన్నా ఇప్పుడు ఉన్న పాఠశాల వ్యవస్థలో అంతర్భాగంగా మార్పులు జరగాలి తప్ప మరో కొత్త వైఖరి సరికాదు. ప్రభుత్వం, అధికారులు మొక్కుబడిగా చేసే విద్యా వారోత్సవాలు, బడిబాటలు ప్రభుత్వ బడులు, కళాశాలల్లో నమోదు పెంచవుగాక పెంచలేవు. అవి ఆర్భాటాలు, అనుకరణలతోకూడిన, ఎందుకు కొరగాని రొటీన్ కార్యక్రమం మాత్రమే! తల్లిదండ్రులు తమ పిల్లల భవిష్యత్తు, భద్రత, నాణ్యమైన విద్య తప్ప ప్రచార ఆర్భాటాలకు ఎక్కడా అవకాశం ఇవ్వరు. నాణ్యమైన ఉచిత విద్య ప్రభుత్వ బడిలో దొరుకుతుందనే గట్టి నమ్మకం మాత్రమే ప్రభుత్వ విద్యా సంస్థలలో నమోదును పెంచుతుంది. కనుక ప్రభుత్వాలకు నిజంగా చిత్తశుద్ధి ఉంటే ఆవాసప్రాంతం వారీగా ఏకీకృత కామన్ పాఠశాల వ్యవస్థకు రూపకల్పన చేయాలి. అంతేకాదు. ఆవాసప్రాంతంలో ప్రైవేటు విద్యా సంస్థలను నిషేధించాలి. లేదా జీ, టోఫెల్ లాంటి శిక్షణ ప్రాథమిక స్థాయిలో లేకుండా కనీసం నియంత్రణ చర్యలైనా చేపట్టాలి. నిజంగా పాలక వర్గాలు ఈ పని చిత్తశుద్ధితో చేయగలిగితే విద్యా సామానత, విద్యాప్రజాస్వామీకరణ, అంతరాలు లేని శాస్త్రీయ విద్యా అందుబాటులోకి వస్తుంది. ప్రభుత్వాలకు కళ్ళు, చెవులు, ముక్కు, నోరు, ప్రైవేటు వ్యవస్థనే ప్రధానం అయినప్పుడు విద్యావ్యవస్థలో దిద్దేపైపై మెరుగులు వంచనకు తప్ప! మార్పుకు సంకేతం కావు, కాబోవు. ప్రైవేటు విద్యావ్యవస్థ రద్దు లేదా నియంత్రణ, ప్రభుత్వ పాఠశాల వ్యవస్థలో ఆవాసప్రాంత నియంత్రణ, నియమాలతో కూడిన నమోదు, కామన్ స్కూల్ విధానం మాత్రమే ప్రజలకు నిజమైన ఏకైక విద్యాప్రత్యామ్నాయం!

# రష్యాలో కుప్పకూలిన బాంబర్

## శిక్షణ ఇస్తుండగా కూలినట్లు ప్రకటన

మాస్కో,జూన్16 : రష్యాకు చెందిన బాంబర్ విమానం (టియు-22ఎం3) కూలిపోయింది. సోమవారం సైబీరియాలోని ఇర్కుట్స్ ప్రాంతంలో శిక్షణనిస్తుండగా విమానం కూలిపోయిందని, ఆ ప్రాంతాన్ని దట్టమైన పొగ కమ్మేసిందని రక్షణ శాఖ తెలిపింది. నలుగురు సిబ్బంది సురక్షితంగా బయపడ్డారని పేర్కొంది. విమానం కూలిన దృశ్యాలు మీడియాలో వైరల్ గా మారాయి. అంగారా నది సమీపంలోని అటవీ ప్రాంతంలో విమానం కూలిపోతుండగా, దట్టమైన పొగ వెలువడుతున్న దృశ్యాలు కనిపించాయి. రష్యాకు చెందిన టియు-22ఎం3 బాంబర్ విమానం కూలిపోయిన తర్వాత, అందులోని నలుగురు సిబ్బంది బయటకు దూకారని అధికారులు తెలిపారు. విమానంలో ఎటువంటి యుద్ధ సామాగ్రి లేదని, దీంతో పెద్ద ప్రమాదం తప్పిందని అన్నారు. కామెంకా గ్రామానికి సమీపంలో విమానం కూలిపోయిందని ఇర్కుట్స్క్ గవర్నర్ ఇగోర్ కో÷-జబెవ్ ధృవీకరించారు. ప్రమాద స్థలంలో చెలరేగిన మంటలను ఆర్పివేసేందుకు అగ్నిమాపక సిబ్బంది కృషి చేస్తున్నారని అన్నారు. ఇంజన్ వైఫల్యం కారణంగా ఈ ప్రమాదం జరిగి వుండవచ్చని ఆయన వెల్లడించారు. టియు-22ఎం3 అనేది ఒక ఆధునిక వెర్షన్, ఇది ఐఠ-22 క్రూయిజ్ క్షిపణులతో పాటు గాలి నుండి ప్రయోగించే హైపర్‌సోనిక్ కింజాల్ క్షిపణులను కూడా మోయగలదు.

# యుద్ధమేఘాలు తొలగడంతో ధరలకు మళ్లీ రెక్కలు

## క్రమంగా పెరుగుతున్న బంగారం ధరలు

న్యూఢిల్లీ : అమెరికా, ఇరాన్ మధ్య శాంతి ఒప్పందం కుదిరిన నేపథ్యంలో బంగారానికి మళ్లీ డిమాండ్ పెరుగుతోంది. ముడి చమురు ధరలు తగ్గుముఖం పట్టడంతో ద్రవ్యోల్బణం భయాలు తొలగిపోయాయి. దీంతో, వడ్డీ రేట్లను అమెరికా ఫెడరల్ రిజర్వ్ పెంచే అవకాశాలు తక్కువని ఇన్వెస్టర్లు భావిస్తున్నారు. తమ పెట్టుబడులను యూఎస్ ట్రెజరీ బాండ్‌ల నుంచి మరింత లాభదాయకమైన బంగారం వైపు మళ్లిస్తున్నారని నిపుణులు చెబుతున్నారు. ఫలితంగా బంగారం ధరలకు మళ్లీ రెక్కలొచ్చాయని అంటున్నారు.

# దుర్గమ్మకు అగ్గిపెట్టెలో పట్టే చీర బహుకరణ

**ఇంద్రకీలాద్రిపై రూ.82 కోట్లతో విస్తరణ పనులు**

విజయవాడ,జూన్16 : విజయవాడలోని ఇంద్రకీలాద్రిపై కొలువైన దుర్గమ్మకు.. సిరిసిల్లకు చెందిన చేనేత కార్మికుడు నల్ల విజయ్‌కుమార్ అగ్గిపెట్టెలో పట్టే పట్టుచీరను బహూకరించారు. ఆలయ ఈవో శీనానాయక్‌కు మంగళవారం ఉదయం పట్టుచీరను అందజేశారు. ఇక్కత్ డిజైన్‌తో మగ్గంపై నేసిన ఈ చీర దాదాపు ఐదున్నర మీటర్ల పొడవు, 48 అంగుళాల వెడల్పు ఉంటుందని విజయ్‌కుమార్ తెలిపారు. దీని తయారీకి వారం రోజులు పట్టిందని చెప్పారు. ఇదిలావుంటే విజయవాడ ఇంద్రకీలాద్రిపై అభివృద్ధి పనులు శరవేగంగా సాగుతున్నాయి.భక్తుల రద్దీ పెరగడంతో అందుకు అనుగుణంగా పనులు చేపట్టారు. దీంతో కనకదుర్గమ్మ ఆలయ స్వరూపం త్వరలోనే పూర్తిగా మారనుంది. రోజురోజుకు పెరుగుతున్న భక్తుల రద్దీని దృష్టిలో పెట్టుకొని ఆలయ అధికారులు యుద్ధప్రాతిపదికన చర్యలు చేపట్టారు. మాస్టర్ ప్లాన్‌లో భాగంగా సుమారు రూ.82 కోట్లతో చేపట్టిన అభివృద్ధి పనులు శరవేగంగా సాగుతున్నాయి.

# మెతుకు విలువ

‘ఆహారం విషయంలో హద్దులు మీరే వారిని అల్లాహ్ ప్రేమించడు’ అని ఖురాన్ హెచ్చరిక. ఆహార వృథాను ఈ పవిత్ర గ్రంథం తీవ్రంగా ఖండించింది.‘తినేటప్పుడు ఆహార వస్త్రంపై పడిన మెతుకులను తీసి తినేవారిని అల్లాహ్ కరుణిస్తాడు’ అని ముహమ్మద్ ప్రవక్త (స) చెప్పారు. అంటే ఒక్క మెతుకు కూడా వృథా కారాదన్నది దీని సారాంశం. ఆహారం విషయంలో హద్దులు మీరే వారిని అల్లాహ్ ప్రేమించడు’ అని ఖురాన్ హెచ్చరిక. ఆహార వృథాను ఈ పవిత్ర గ్రంథం తీవ్రంగా ఖండించింది. ‘తినేటప్పుడు ఆహార వస్త్రంపై పడిన మెతుకులను తీసి తినేవారిని అల్లాహ్ కరుణిస్తాడు’ అని ముహమ్మద్ ప్రవక్త (స) చెప్పారు. అంటే ఒక్క మెతుకు కూడా వృథా కారాదన్నది దీని సారాంశం. అన్నం మెతుకుల్ని పారేయడానికి ఎంతో సమయం పట్టదు. కానీ, ఆ మెతుకులు మన నోటిదాకా చేరడానికి నెలలు శ్రమించాల్సి వస్తుంది. ఆహారం దేవుడు ఇచ్చిన వరం. దానిపట్ల మర్యాదగా వ్యవహరించాలి. ఆహార వృథా అరికట్టడం, అన్నదానం ఇవి రెండూ సత్‌క్రియలే. బీదబిక్కీ, దారిద్ర్యంలో మగ్గుతున్న వారిని గుర్తించి వారి ఆకలి తీర్చడం మంచి లక్షణంగా ఖురాన్ పేర్కొంది. అల్లాహ్ మీది ప్రేమతో పేదలకూ, అనాథలకూ, ఖైదీలకూ అన్నం పెడుతూ.. ‘మేము కేవలం అల్లాహ్ కోసమే మీకు అన్నం పెడుతున్నాం. మీ నుంచి ఎలాంటి ప్రతిఫలాన్ని గానీ, కృతజ్ఞతలను గానీ ఆశించటం లేదు’ అన్న ఖురాన్ మాటలు ఆచరించే వాళ్లు ధన్యులు.



ఆధ్యాత్మికం

# సమాచార హక్కు చట్టాన్ని అత్యంత ప్రాధాన్యతతో అమలు చేయాలి

● రాష్ట్ర ప్రధాన సమాచార కమిషనర్ డా. జి. చంద్రశేఖర్ రెడ్డి ● ప్రతి పౌరుడికి సమాచారం తెలుసుకునే హక్కు ఉంది ● ప్రతి ప్రజా సమాచార అధికారి ఆర్టీఐ చట్టంపై సంపూర్ణ అవగాహన కలిగి ఉండాలి ● ఆర్టీఐ దరఖాస్తులను సకాలంలో పరిష్కరించి, సమాచారాన్ని ఆన్‌లైన్‌లో అందుబాటులో ఉంచాలి ● సమాచారాన్ని 30 రోజుల్లో అందించాలి ● ఆలస్యమైతే ఉచితంగా ఇవ్వాలిలి ● ప్రతి కార్యాలయంలో పీఐఓ, మొదటి , రెండో అప్పీలేట్ అథారిటీ వివరాలు ప్రదర్శించాలి ● ప్రజా ప్రయోజనాల దృష్ట్యా అవసరమైతే మూడో పక్ష సమాచారాన్ని కూడా వెల్లడించవచ్చు








**పెద్దపల్లి ప్రతినిధి (ది క్రైమ్ న్యూస్):** సమాచార హక్కు చట్టాన్ని ఎట్టి పరిస్థితుల్లోనూ నిర్లక్ష్యం చేయరాదని, ప్రభుత్వ శాఖలు అత్యంత ప్రాధాన్యతతో అమలు చేయాలని రాష్ట్ర ప్రధాన సమాచార కమిషనర్ డా. జి. చంద్రశేఖర్ రెడ్డి అధికారులను ఆదేశించారు. మంగళవారం సమీకృత జిల్లా కలెక్టరేట్ (ఐడీఓసీ), పెద్దపల్లిలో జిల్లా అధికారులకు నిర్వహించిన సమాచార హక్కు చట్టం అవగాహన కార్యక్రమంలో రాష్ట్ర సమాచార కమిషనర్లు పి.వి. శ్రీనివాసరావు, మొహ్సినా పర్వీన్, దేశాల భూపాల్, బోరెడ్డి అయోధ్యరెడ్డి, జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష అదనపు కలెక్టర్లు జే అరుణశ్రీ, కొప్పుల వెంకటరెడ్డి, డిసిపి రాంరెడ్డి లతో కలిసి ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా రాష్ట్ర ప్రధాన సమాచార కమిషనర్ డా. జి. చంద్రశేఖర్ రెడ్డి మాట్లాడుతూ, సమాచార హక్కు చట్టం ప్రజాస్వామ్య వ్యవస్థలో పారదర్శకత, జవాబుదారీతనాన్ని పెంపొందించే శక్తివంతమైన సాధనమని అన్నారు. ప్రతి భారతీయ పౌరుడికి ప్రభుత్వ శాఖల వద్ద ఉన్న సమాచారాన్ని పొందే హక్కును సెక్షన్-3 కల్పిస్తుందని తెలిపారు. తెల్ల రేషన్ కార్డు కలిగిన బీపీఎల్ కుటుంబాలకు ఆర్టీఐ దరఖాస్తులపై ఎటువంటి ఫీజు అవసరం లేదని తెలిపారు. సమాచారాన్ని అందించేందుకు అయ్యే ఖర్చు ఎంత అనేది ప్రజా సమాచార అధికారులు ముందుగానే దరఖాస్తుదారునికి తెలియజేయాలని సూచించారు. చట్టం ప్రకారం 30 రోజుల్లోపు సమాచారం ఇవ్వాలని, గడువు దాటితే సమాచారాన్ని ఉచితంగా అందించాల్సి ఉంటుందని పేర్కొన్నారు. 30 రోజుల్లో సమాచారం అందకపోతే సమాచార కమిషన్‌కు ఫిర్యాదు చేయవచ్చని తెలిపారు. సమాచారం ఇవ్వకపోవడం వల్ల దరఖాస్తుదారునికి నష్టం సంభవిస్తే పరిహారం కోరే అవకాశం కూడా చట్టంలో ఉందని వివరించారు. ప్రజా ప్రయోజనాలకు సంబంధించిన అంశాల్లో అవసరమైతే మూడో పక్ష సమాచారాన్ని కూడా వెల్లడించవచ్చని తెలిపారు. ప్రతి కార్యాలయంలో ప్రజా సమాచార అధికారి, మొదటి అప్పీలేట్ అథారిటీ, రెండో అప్పీలేట్ అథారిటీ వివరాలను తప్పనిసరిగా ప్రదర్శించాలని సూచించారు. ఆర్టీఐ చట్టంలోని సెక్షన్-2లో నిర్వచనాలు, సెక్షన్-3లో సమాచార హక్కు, సెక్షన్-4లో స్వచ్ఛంద సమాచార ప్రకటన, సెక్షన్-5లో పీఐఓల నియామకం, సెక్షన్-6లో దరఖాస్తు విధానం, సెక్షన్-7లో సమాచారాన్ని అందించే విధానం, సెక్షన్-8లో మినహాయింపు సమాచారం, సెక్షన్-9లో కాపీరైట్ పరిరక్షణ, సెక్షన్-10లో సమాచార విభజన, సెక్షన్-11లో మూడో పక్ష సమాచారం, సెక్షన్-18లో ఫిర్యాదుల విచారణ, సెక్షన్-19లో అప్పీలు, సెక్షన్-20లో జరిమానాలు, సెక్షన్-22లో చట్టానికి ప్రాధాన్యం, సెక్షన్-24లో మినహాయింపు పొందిన సంస్థలు, సెక్షన్-25లో వార్షిక నివేదిక, సెక్షన్-26లో అవగాహన కార్యక్రమాలు, సెక్షన్-27, 28లలో నియమాల రూపకల్పన వంటి అంశాలపై అధికారులు సంపూర్ణ అవగాహన కలిగి ఉండాలని సూచించారు. ప్రతి అధికారి ఆర్టీఐ చట్టంలోని అన్ని నిబంధనలను పూర్తిగా తెలుసుకోవాలని, అందిన ప్రతి దరఖాస్తును సకాలంలో పరిష్కరించాలని, శాఖలకు సంబంధించిన సమాచారాన్ని ఆన్‌లైన్‌లో అందుబాటులో ఉంచాలని, సమాచార హక్కు చట్టాన్ని ఎప్పటికీ నిర్లక్ష్యం చేయరాదని, అత్యున్నత ప్రాధాన్యతతో అమలు చేయాలని ప్రధాన సమాచార కమిషనర్ స్పష్టం చేశారు. **జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష :** రాష్ట్ర ప్రధాన సమాచార కమిషనర్ సూచించిన మార్గదర్శకాలను జిల్లాలోని అన్ని శాఖల అధికారులు తప్పనిసరిగా అమలు చేయాలని జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష ఆదేశించారు. ఆర్టీఐ చట్టం అమలులో అధికారులు ప్రత్యేక శ్రద్ధ వహించి ప్రజలకు పారదర్శకంగా సేవలు అందించాలని సూచించారు. జిల్లాలోని వివిధ శాఖలకు చెందిన 570 మందికి పైగా ప్రజా సమాచార అధికారులు, మొదటి అప్పీలేట్ అథారిటీలు ఈ అవగాహన కార్యక్రమంలో పాల్గొనడం సంతోషకరమని కలెక్టర్ తెలిపారు. ఈ కార్యక్రమం ద్వారా అధికారులు చట్టంపై మరింత అవగాహన పెంపొందించుకుని, దరఖాస్తులను సకాలంలో పరిష్కరించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో రెవిన్యూ డివిజనల్ అధికారులు గంగయ్య, సురేష్ జిల్లా స్థాయి అధికారులు, వివిధ శాఖల ప్రజా సమాచార అధికారులు, మొదటి అప్పీలేట్ అథారిటీలు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# భూకబ్జా కుట్ర వెనుక ప్రభుత్వ ఉద్యోగి హస్తం....

● రాజకీయ అండదండలతోనే ఈర్ల సురేందర్ భూ సెటిల్మెంట్లు ● సీపీఐ జిల్లా కార్యదర్శి తాండ్ర సదానందం




పెద్దపల్లి ప్రతినిధి (ది క్రైమ్ న్యూస్): పెద్దపల్లి మండలం రంగంపల్లి శివారులోని 66/బీ సర్వే నంబర్‌లో తనకు చెందిన భూమిని అక్రమంగా కబ్జా చేసేందుకు కుట్ర జరుగుతోందని సీపీఐ జిల్లా కార్యదర్శి తాండ్ర సదానందం ఆరోపించారు. మంగళవారం పెద్దపల్లి ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. 2012లో పెర్క మొండయ్య నుంచి సదరు భూమిని చట్టబద్ధంగా కొనుగోలు చేసినట్లు సదానందం తెలిపారు. భూమికి సంబంధించి ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం జారీ చేసిన పట్టాదారు పాసుపుస్తకాలతో పాటు తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం కూడా పట్టా పాసుపుస్తకాన్ని మంజూరు చేసిందని చెప్పారు. ఈ నెల 8న భూమిని చదును చేసే పనులు చేపడుతుండగా ప్రభుత్వ ఉద్యోగి ఈర్ల సురేందర్ అడ్డుకుని తమపై దాడికి పాల్పడ్డారని ఆరోపించారు. ప్రజల పన్నులతో జీతం పొందుతూ ఉద్యోగం చేస్తున్న ఈర్ల సురేందర్ భూదందాలు, సెటిల్‌మెంట్లకు పాల్పడుతున్నారని విమర్శించారు. ఆయన ప్రోద్బలంతోనే కొందరు వ్యక్తులు తమ భూమిపై హక్కులు ఉన్నట్లు తప్పుడు ప్రచారం చేస్తూ కబ్జా యత్నాలకు పాల్పడుతున్నారని ఆరోపించారు. ఈ ఘటనపై జూన్ 9న పెద్దపల్లి పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు వెల్లడించారు. భూ వివాదంలో పెర్క రాజేశంకు ఎలాంటి సంబంధం లేదని పేర్కొన్న సదానందం, ఇటీవల నిర్వహించిన ప్రెస్‌మీట్‌లో తనపై చేసిన ఆరోపణలను తీవ్రంగా ఖండించారు. 1983లో భూమిని కొనుగోలు చేశామని కొందరు చెబుతున్నారని, నిజంగా అప్పుడే కొనుగోలు చేసి ఉంటే ఎందుకు పట్టా చేయించుకోలేదో ప్రజలకు సమాధానం చెప్పాలని ప్రశ్నించారు. తాను ఎవరినీ మోసం చేయలేదని, ఎవరి వద్ద నుంచీ బలవంతంగా సంతకాలు తీసుకోలేదని స్పష్టం చేశారు. ఈర్ల సురేందర్ ఎవరి అండతో సెటిల్‌మెంట్లు చేస్తున్నాడో ప్రజలందరికీ తెలుసని వ్యాఖ్యానించారు. తన రాజకీయ ప్రతిష్ఠను దెబ్బతీయాలనే ఉద్దేశంతోనే తప్పుడు ఆరోపణలు చేయిస్తున్నారని ఆరోపించారు. తనపై అసత్య ప్రచారం చేసిన పెర్క శ్రవణ్, పెర్క రాజేశం, పెర్క లక్ష్మణ్‌లపై పరువు నష్టం దావా వేయనున్నట్లు హెచ్చరించారు. అలాగే ప్రభుత్వ ఉద్యోగిగా కొనసాగుతూ భూదందాలు, సెటిల్‌మెంట్లకు పాల్పడుతున్నారంటూ ఈర్ల సురేందర్‌పై మార్కెటింగ్ శాఖ డైరెక్టర్‌తో పాటు జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేయనున్నట్లు తెలిపారు. ఆయనపై ప్రభుత్వం వెంటనే విచారణ జరిపి తగిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా పెర్క మొండయ్య మాట్లాడుతూ, తమ తాతల నుంచి వారసత్వంగా వచ్చిన 8 గుంటల భూమిని ఆర్థిక అవసరాల దృష్ట్యా 2012లో తాండ్ర సదానందంకు విక్రయించినట్లు తెలిపారు. ఈ విషయంలో అసత్య ఆరోపణలు చేయడం మానుకోవాలని, లేనిపక్షంలో చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ సమావేశంలో పెర్క మొండయ్య, బోంకూరి ఎల్లయ్య, పెర్క శివకుమార్ తదితరులు పాల్గొన్నారు.

# ఫిట్ నెస్ లేని బస్సులపై చర్యలేవి

● ఏఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో కలెక్టర్ కి వినతి



**ఖమ్మం ప్రతినిధి (ది క్రైమ్ న్యూస్ ):** ఫిట్ నెస్ లేని బస్సులపై చర్యలు తీసుకోవాలని ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి ఇటికాల రామకృష్ణ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. స్థానిక ఖమ్మం సోమవారం పరిష్కృతిలో ఏఐఎస్ఎఫ్ ఖమ్మం జిల్లా సమితి ఆధ్వర్యంలో జిల్లా కలెక్టర్ కి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఇటికల రామకృష్ణ మాట్లాడుతూ విద్యాసంస్థలు పున: ప్రారంభం అయినా నేపథ్యంలో జిల్లా వ్యాప్తంగా ప్రైవేట్, కార్పొరేట్ విద్యాసంస్థల సంబంధించిన బస్సులు తప్పనిసరిగా ఫిట్ నెస్ చేయించుకోవాల్సిన అవసరం ఉందన్నారు. కాలం చెల్లిన బస్సులను కూడా విద్యార్థులను పరిమితికిమించి ఎక్కిస్తున్న ఆర్ టి ఓ అధికారులు చోద్యం చూస్తున్నారు. తప్ప ఫిట్ నెస్ లేని బస్సులపై చర్యలు తీసుకోవడంలో ద్వంద వైఖరిని ప్రదర్శిస్తున్నారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. ప్రతి బస్ కి ఫిట్ నెస్ సర్టిఫికెట్ కలిగి ఉండాలని ఆయన అన్నారు. ఫిట్ నెస్ లేని వాహనాల్లో పరిమితికి మించి విద్యార్థులను ఎక్కించి ఓవర్ లోడుతో బస్సులు నడపడం వలన విద్యార్థులు ప్రమాదాల పారిన పడుతున్నారని, బస్సులకు ఫిట్ నెస్ సర్టిఫికెట్, పర్మిట్ ,ఇన్సూరెన్స్, కాలుష్యం నియంత్రణ సర్టిఫికెట్స్ తో పాటు ప్రతి బస్సులో క్లీనర్ మరియు ఆయాలు ఉండే విధంగా ఆర్ టి ఓ అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. నిబంధనలు ఉల్లంఘిస్తున్న ప్రైవేటు విద్యాసంస్థల యాజమాన్యాలపై తగు చర్యలు తీసుకోవాలని మరియు ఫిట్ నెస్ లేకుండా నడిపిస్తున్న స్కూలు బస్సులును వెంటనే సీజ్ చేయాలని అన్నారు. మోటార్ వాహనాల యాక్ట్ ప్రకారం బస్సులు నిబంధనలకు విరుద్ధంగా ఉల్లంఘించే పాఠశాలల డ్రైవర్లు విద్యాసంస్థల యాజమాన్యాలపై మోటార్ వాహనాల చట్టం ప్రకారం క్రిమినల్ కేసులు నమోదు చేయాలని ఏఐఎస్ఎఫ్ అఖిలభారత విద్యార్థి ఫెడరేషన్ ఖమ్మం జిల్లా సమితి డిమాండ్ చేస్తుంది. లేనియెడల ప్రత్యక్షంగా ప్రైవేట్ కార్పొరేట్ విద్యాసంస్థల యాజమాన్యాల బస్సులపై దాడులు నిర్వహిస్తామని వారు హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షులు మడుపల్లి లక్ష్మణ్, జిల్లా కార్యవర్గ సభ్యులు పవన్, వెంకట్, రాము, రాంబాబు, గోపి, నరేందర్ తదితరులు పాల్గొన్నారు.

## పచ్చునూర్ గ్రామంలో ట్రాన్స్‌ఫార్మర్ భయం

**ప్రాణాలు అరచేతిలో పెట్టుకుని బతుకుతున్న కుటుంబం**



**కరీంనగర్ టౌన్, జూన్ 16(ది క్రైమ్ న్యూస్):** మానకొండూర్ మండలం పచ్చునూర్ గ్రామంలో హైవోల్టేజ్ విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ కారణంగా ఒక కుటుంబం ప్రాణభయంతో కొట్టుమిట్టాడుతోంది. గ్రామానికి చెందిన చిలగాని లక్ష్మి, ఆమె కుమారుడు తిరుపతి నివాసం ఉంటున్న ఇంటి పక్కన ఈ ప్రమాదకరమైన ట్రాన్స్‌ఫార్మర్ ఉంది. ప్రస్తుతం వర్షకాలం ప్రారంభం కావడంతో ఈ ట్రాన్స్‌ఫార్మర్ నుండి పెద్ద ఎత్తున మంటలు చెలరేగుతున్నాయి. అంతేకాకుండా, వర్షపు నీటి వల్ల ఇంటి గోడలు తడిసిపోవడంతో ఇల్లంతా విద్యుత్ షాక్ (కరంట్) వస్తోందని బాధితులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఎప్పుడు ఏ ప్రమాదం ముంచుకొస్తుందో తెలియక రాత్రిళ్ళు నిద్రలేని గడుపుతున్నామని, ఇల్లు ప్రమాదం అంచున ఉందని కన్నీరు మున్నీరవుతున్నారు. తమ ప్రాణాలకు రక్షణ కల్పించి, ఇంటి ఆవరణలో ఉన్న ఈ హైవోల్టేజ్ ట్రాన్స్‌ఫార్మర్‌ను తక్షణమే వేరే ప్రాంతానికి తరలించాలని బాధితులు విద్యుత్ శాఖ అధికారులను, ప్రజా ప్రతినిధులను వేడుకుంటున్నారు. అధికారులు స్పందించి తమను ఈ గండం నుండి గట్టెక్కించాలని కోరుతున్నారు.

## విద్యార్థుల రవాణా వాహనాలపై ప్రత్యేక తనిఖీ డ్రైవ్

**- నిబంధనలు అతిక్రమిస్తే కఠిన చర్యలు - కరీంనగర్ పోలీస్ కమిషనర్ గౌష్ ఆలం**





**కరీంనగర్ టౌన్, జూన్16(ది క్రైమ్ న్యూస్):** కరీంనగర్ పోలీస్ కమిషనరేట్ పరిధిలో పాఠశాల విద్యార్థుల రవాణా వాహనాల భద్రతపై పోలీస్ మరియు రోడ్డు రవాణా శాఖ అధికారులు సంయుక్తంగా ప్రత్యేక తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థుల రవాణాలో నిమగ్నమైన వాహనాల డ్రైవర్లకు రోడ్డు భద్రతా నియమాలు మరియు మోటారు వాహన చట్టాలపై అవగాహన కల్పించారు. ఈ తనిఖీలలో భాగంగా, ఫిట్‌నెస్ లేని 17 స్కూల్ బస్సులు, 50 ఆటోలను సీజ్ చేయడం జరిగింది. అలాగే, సరైన పత్రాలు (రిజిస్ట్రేషన్, పర్మిట్, ఇన్సూరెన్స్) లేని 64 వాహనాలపై, యూనిఫాం ధరించని 13 మంది డ్రైవర్లపై, నంబర్ ప్లేట్ లేని వాహనం మరియు ఓవర్‌లోడింగ్‌తో నడుపుతున్న 9 వాహనాలపై చట్టపరమైన చర్యలు తీసుకున్నాము. మొత్తంగా 87 వాహనాలపై ఉల్లంఘనలు నమోదు చేశాము. "ప్రతి చిన్నారి భద్రత మనందరి బాధ్యత. పాఠశాల వాహనాల డ్రైవర్లు నిబంధనలను అతిక్రమిస్తే సహించేది లేదు. వాహనాలకు తప్పనిసరిగా చెల్లుబాటు అయ్యే ఫిట్‌నెస్ మరియు ఇతర పత్రాలు ఉండాలి. వేగ నియంత్రణ పాటిస్తూ, మొబైల్ ఫోన్ వినియోగం లేదా మద్యం సేవించి వాహనాలు నడపడం వంటివి చేస్తే కఠిన చర్యలు తీసుకుంటాము," అని కరీంనగర్ పోలీస్ కమిషనర్ గౌష్ ఆలం గారు హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఏసీపీలు యాదగిరిస్వామి, వెంకటస్వామి, మోటార్ వెహికల్ ఇన్స్పెక్టర్ జి కవిత, ట్రాఫిక్ ఇన్స్పెక్టర్ అంజయ్య ఇతర అధికారులు సిబ్బంది పాల్గొన్నారు.

## 45వ డివిజన్‌లో ఓపెన్‌ను జిమ్ ప్రారంభించిన నగర మేయర్ కొలగాని శ్రీనివాస్





**కరీంనగర్ టౌన్, జూన్16(ది క్రైమ్ న్యూస్):** కరీంనగర్ నగరపాలక సంస్థ పరిధిలోని 45వ డివిజన్ రాజీవ్ పార్క్‌లో కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ సహకారంతో, సీఎస్ఆర్ నిధుల ద్వారా మలయప్ప ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఓపెన్ జిమ్‌ను నగర మేయర్ కొలగాని శ్రీనివాస్ ప్రారంభించారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ, ప్రజల ఆరోగ్య పరిరక్షణకు, యువతలో శారీరక దృఢత్వం పెంపొందించేందుకు ఓపెన్ జిమ్‌లు ఎంతో ఉపయోగపడతాయని అన్నారు. పార్కులకు వచ్చే ప్రజలు, యువత, మహిళలు ఈ సదుపాయాన్ని సద్వినియోగం చేసుకుని ఆరోగ్యవంతమైన జీవనశైలిని అలవర్చుకోవాలని సూచించారు. ప్రజలకు అవసరమైన మౌలిక సదుపాయాలతో పాటు ఆరోగ్యాన్ని ప్రోత్సహించే కార్యక్రమాల అమలుకు నగరపాలక సంస్థ కట్టుబడి ఉందని పేర్కొన్నారు. ఈ ఓపెన్ జిమ్ ఏర్పాటుకు సహకరించిన కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ కి, మలయప్ప ఫౌండేషన్ ప్రతినిధులకు మేయర్ ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ మేయర్ వై. సునీల్ రావు, స్థానిక కార్పొరేటర్ గుగ్గిళ్ళ జయశ్రీ, నగరపాలక సంస్థ అధికారులు, ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు, డివిజన్ ప్రజలు పాల్గొన్నారు.

# 12 ఏళ్ల పాలన నేపథ్యంలో మానకొండూరులో ఆర్ఎంపీ, పీఎంపీలతో కేంద్ర మంత్రి “చాయ్ పే చర్చ”

**● గ్రామీణ ఆరోగ్యానికి భరోసా ఆర్ఎంపీ, పీఎంపీలే: కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్**





**కరీంనగర్ టౌన్, జూన్16(ది క్రైమ్ న్యూస్):** ప్రధాని నరేంద్రమోదీ 12 ఏళ్ల పాలనను పురస్కరించుకుని కేంద్ర మంత్రి బండి సంజయ్ కుమార్ ఈరోజు ఉదయం మానకొండూరులోని ఓ ప్రైవేట్ ఫంక్షన్ హాలులో ఆర్ఎంపీ, పీఎంపీలతో “చాయ్ పే చర్చ” కార్యక్రమాన్ని నిర్వహించారు. మోదీ 12 ఏళ్ల పాలనలో సాధించిన విజయాలను, ప్రజల అభివృద్ధి, సంక్షేమం కోసం చేపట్టిన కార్యక్రమాలను వివరించారు. సమాజంలో అట్టడుగునున్న చిట్ట చివరి వ్యక్తికి సైతం సంక్షేమ ఫలాలు అందించడమే బీజేపీ సిద్ధాంతమని, తూ.చ తప్పకుండా అమలు చేస్తున్న మహనీయుడు మోదీ అని కొనియాడారు. మోదీ పాలనా విజయాలను వివరించడంతోపాటు ప్రజలకు మరింత మేలు చేసేందుకు చేపట్టాల్సిన చర్యలపై అవసరమైన సలహాలు సూచనలు తీసుకునేందుకు “చాయ్ పే చర్చ” వంటి కార్యక్రమాలను నిర్వహిస్తున్నామని చెప్పారు. ఈ సందర్భంగా ఆర్ఎంపీ, పీఎంపీ డాక్టర్లు ఫీల్డులో తమకు ఎదురవుతున్న సమస్యలను ఏకరవు పెట్టారు. కొంత మంది కావాలని తమపై అకారణంగా దాడులు చేస్తున్నారని వాపోయారు. తమపై జరుగుతున్న దాడులను అరికట్టాలని, కఠిన చర్యలు తీసుకునేలా ప్రభుత్వంపై ఒత్తిడి తేవాలని కోరారు. మానకొండూరు నియోజకవర్గంలో ఆర్ఎంపీ, పీఎంపీ డాక్టర్ల అసోసియేషన్ సంఘ భవనం లేదని, నూతన భవన నిర్మాణానికి ఆర్థిక సాయం అందించాలని విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగా బండి సంజయ్ మాట్లాడుతూ ఆర్ఎంపీలపై దాడులను ఖండించారు. “ఆర్ఎంపీ, పీఎంపీలతో సమాజానికి మంచి జరుగుతోందే తప్ప నష్టం జరగడం లేదు. తక్కువ ఖర్చుతో కుటుంబ సభ్యుల్లా మెలుగుతూ వైద్య సేవ అందిస్తున్నది ఆర్ఎంపీలే. ఆర్ఎంపీలు లేని సమాజాన్ని ప్రజలు ఊహించుకోలేరు. అలాంటి వారిపై దాడులు చేయడం సమర్ధనీయం కాదు. ఆర్ఎంపీలు 10 రోజులు తమ సేవలను నిలిపివేస్తే గ్రామీణ ఆరోగ్య వ్యవస్థ పూర్తిగా స్థంభించిపోవడం ఖాయం. గ్రామీణ ప్రజల ఆరోగ్యానికి భరోసా ఇస్తున్నది ఆర్ఎంపీలే.” అని చెప్పారు. మోదీ పనితీరు గురించి మాట్లాడుతూ “మోదీ విజన్ ఉన్న నేత. 10 ఏళ్ల ముందు ఈ దేశం ఎలా ఉంటుందో ఆలోచించి అందుకు అనుగుణంగా కార్యక్రమాలు చేపడతారు. డిజిటల్ విప్లవం అందులో భాగమే. 10 ఏళ్ల ముందు జన్ ధన్ ఖాతాలను ఓపెన్ చేసి డిజిటిల్ లావా దేవీలను ప్రారంభిస్తే అందరూ హేళన చేశారు. ఇయాళ ఏమైంది? రోడ్డుపై చాయ్ అమ్ముకునే వ్యాపారాలు కూడా ఫోన్ పే, గూగుల్ పే ద్వారా లావా దేవీలు జరుపుతున్నారు. ఒక్క రూపాయి అవినీతికి తావు లేకుండా కేంద్ర ప్రభుత్వ సంక్షేమ పథకాల నగదును దళారుల ప్రమేయం లేకుండా నేరుగా లబ్దిదారుడి ఖాతాలోనే పడుతోంది.”అని చెప్పారు. 12 ఏళ్ల పాలనలో కరీంనగర్ పార్లమెంట్ పరిధిలో జరిగిన అభివృద్ధిపైనా మాట్లాడారు. తన ఏడేళ్ల ఎంపీ పదవీ కాలంలో రూ.22 వేల కోట్లకు పైగా నిధులొచ్చాయన్నారు. విద్య, వైద్య, మౌలిక సదుపాయాల రంగాలకు పెద్ద ఎత్తున నిధులిస్తున్నట్లు తెలిపారు. తెలంగాణలోనూ బీజేపీ సర్కార్ వస్తే... కేంద్ర నిధులు దుర్వినియోగం కాకుండా ఉంటాయన్నారు. “మా ప్రాధాన్యత విద్య, వైద్యం. పేద వాడికి కార్పొరేట్ స్థాయిలో విద్యను అందిస్తాం. మానకొండూరు లో ఆర్ఎంపీ, పీఎంపీ డాక్టర్లకు సంక్షేమ భవన్ విషయంలో ల్యాండ్ చూపిస్తే సంఘ భవన నిర్మాణానికి తప్పకుండా ఆర్థిక సాయం అందిస్తా.”అని చెప్పారు. అందరికీ ఇచ్చారు అధికారం ఈసారి బీజేపీకి ఇవ్వండి అవకాశం అంటూ అభ్యర్థించారు.

# థింక్ బిగ్.. వర్క్ హార్డ్ - మీ గెలుపును ఎవ్వరూ ఆపలేరు

**● స్టూడెంట్లకు టీచర్స్ ఎమ్మెల్సీ మల్క కొమరయ్య దిశానిర్దేశం ● పల్లవి ఇంజినీరింగ్ కాలేజీలో ఇంటర్ టాపర్స్‌కు ఎక్స్ లెన్స్ అవార్డులు ● తెలంగాణ పీపుల్స్ వాయిస్ ఆధ్వర్యంలో కార్యక్రమం ● 150 మంది స్టూడెంట్లకు మెడల్స్, ప్రశంసా పత్రాలు ● హాజరైన పద్మశ్రీ అవార్డు గ్రహీత వెంకటేశ్వరరావు మోటివేషనల్ స్పీకర్ ఆకెళ్ల రాఘవేంద్ర**






**హైదరాబాద్ (ది క్రైమ్ న్యూస్):** లక్ష్యంతో సాగుతూ.... అవకాశాలు అంది పుచ్చుకుంటూ.... ప్రతి విద్యార్థి ఉన్నత శిఖరాలు చేరుకోవాలని పిలుపునిచ్చారు టీచర్ ఎమ్మెల్సీ / ఢిల్లీ పబ్లిక్ స్కూల్స్ / పల్లవి గ్రూప్ ఆఫ్ ఎడ్యుకేషన్స్ ఛైర్మన్ మల్క కొమరయ్య. పద్మశ్రీ అవార్డు గ్రహీత వెంకటేశ్వర్ రావు, మోటివేషనల్ స్పీకర్ ఆకెళ్ల రాఘవేంద్ర. మంగళవారం హైదరాబాద్ కుంట్లూరులోని పల్లవి ఇంజినీరింగ్ కాలేజీలో ఎక్సలెన్స్ అవార్డ్స్ 2026 కార్యక్రమంలో పాల్గొని విద్యార్థులకు మెడల్స్, ప్రశంసా పత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్రంలో ఇటీవల విడుదలైన ఇంటర్ ఫలితాల్లో ఉత్తమ ప్రతిభ కనబర్చిన సుమారు 150 మంది విద్యార్థులకు, పాఠాలు బోధించిన ఆయా కాలేజీల ప్రిన్సిపల్స్, పేరెంట్స్ కి, పేరెంట్స్ కి 2026 తెలంగాణ పీపుల్స్ వాయిస్ సౌజన్యంలో మెడల్స్, ప్రశంసా పత్రాలు అందజేశారు. ఈ దేశ భవిష్యత్తు మీరే.. భారత దేశ భవిష్యత్తు విద్యార్థులే అన్నారు ఎమ్మెల్సీ మల్క కొమరయ్య. ఆ విషయాన్ని గుర్తెరిగి.. కష్టపడి కాదు ఇష్టపడి చదివి ఉన్నత శిఖరాలకు చేరుకోవాలన్నారు. ఇటీవల భారత సరిహద్దుల్లో మనదేశం అద్భుతమైన ప్రాజెక్టులు కట్టింది. అందంగా దేశ ఇంజనిరింగ్ అద్భుత సృష్టే, ప్రపంచమే నివ్వెర పోయాలే నిర్మించిన ఈ ప్రాజెక్టులు దేశ విద్యా ప్రమాణాలకు నిదర్శనాలు. అందుకే ఈ దేశ యువత విద్యార్థుల అభివృద్ధికి కేంద్రంలోని ప్రధాని నరేంద్రమోదీ ప్రభుత్వం అన్ని రకాలుగా ప్రయత్నిస్తోంది. అంతా మోదీ విజనే.. ప్రధానిగా నరేంద్ర మోదీ అయినప్పటి నుంచి ఈదేశం అన్ని రంగాల్లో అభివృద్ధి చెందుతూనే ఉంది. ముఖ్యంగా 2047 వికసిత్ భారత్ లక్ష్యంతో అడుగులు వేస్తున్న ప్రధాన మంత్రి నరేంద్రమోదీ .. ఆ దిశగా పెద్ద రాష్ట్రాలను ముందుగా అభివృద్ధిచేస్తూ వస్తున్నాడు. తాజాగా వెస్ట్ బెంగాల్ గెలుపు తర్వాత అక్కడి పరిణానమాలు ఎలా మారిపోతున్నాయో గమనిస్తున్నాం. ముఖ్యంగా డిఫెన్స్ రంగంలోని దేశీయ ఉత్పత్తి, దేశానికి మరో 16 యూనివర్సిటీల మంజూరు చేయిం ఇంటి నిర్ణయాలు దేశంలోని నిరుద్యోగ యువతకు చల్లని కబురనే చెప్పలి. ఇకపై ఎలాంటి కోర్సులైనా వేలకు వేలు పెట్టి విదేశాలకు వెళ్లాల్సిన అవసరం లేకుండా... ఏఐ జాబ్స్, మరేఇతరత కోర్సులైనా ఇండియాలోనే మన దేశంలోనే చేసుకునేలా వీలు కలుగుతుంది. ఆలోచించండి.. అడుగులు వేయండి విద్యార్థంతా గమనించాల్సిన విషయం ఏంటంటే ఈదరోజు దేశ వ్యాప్తంగా ఉన్న ఎమ్మెన్సీ కంపెనీల సీఈవోలుగా ఉన్నది మనవాళ్లే.. చివరకు మనల్ని పాలించిన బ్రిటీష్ వారి ఈస్టిండియా కంపెనీ కూడా మన దేశస్తులదే.. అందుకే మీరంతా ఒక లక్ష్యంగా ముందుకెళ్లంగా పల్లవి ఇంజినీరింగ్ కాలేజీ ఛైర్మన్ గా మీకు అందించాల్సిన సహాయ సహకారాలన్నీ అందిస్తాం.. మీ చేయాల్సిందల్లా.. మీ టార్గెట్ ను రీచ్ అవకామే... అప్రమత్తంగా ఉండండి.. ఆలోచించండి.. అడుగులు వేయండని సూచించారు. ప్రతి మనిషి నిత్య విద్యార్థే - ఆకెళ్ల (మోటివేషనల్ స్పీకర్ ఆకెళ్ల) ఈ సందర్భంగా వక్తలు మాట్లాడుతూ.. జీవితంలోప్రతి మనిషి నిత్య విద్యార్థేనని గుర్తు చేశారు. ఈరోజుల్లో విద్యార్థులు మొబైల్ ఫోన్లపై పెట్టే శ్రద్ధ చదువులపై పెడితే మరింత రాణిస్తారని సూచించారు. ఈ రోజు మీరిల్లా ఉన్నతారంటే అందుకు సహకరించిన మీ పేరెంట్స్ కి, చదువులు నేర్పిన గురువులకు రుణపడి ఉండాలన్నారు. చాటింగ్ లు.. డేటింగ్ లు ఆపు.. వాట్ నెక్స్ అని ఆలోచించు యువత టెక్నాలజీ ముసుగులో మొబైల్ ఫోన్లకు అలవాటు పడిపోయారన్నవక్తలు.. మీకు తెలియని విషయాలు తెలుసుకుంటూ.. అందవచ్చిన అవకాశాలు సద్వినియోగం చేసుకుంటూ.. మీరు కన్న కలలు నెరవేర్చుకునే దిశగా అడుగులు వేయాలన్నారు. ఈకార్యక్రమంలో విద్యార్థులతో ఆపటు, వారి తల్లిదండ్రులు, చదువులు నేర్పిన గురువులు, పీఈసీ కాలేజీ డైరెక్టర్, ప్రిన్సిపల్ తోపాటు కాలేజీ యాజమన్యం పాల్గొన్నారు.

# అండర్ గ్రౌండ్ నుంచి సర్ఫేస్ జనరల్ అసిస్టెంట్ల విషయంలో రాజీలేని పోరాటం చేస్తున్నది ఏఐటీయూసీ మాత్రమే: పీవీకే-5 గని పిట్ కమిటీ




**ఖమ్మం ప్రతినిధి (ది క్రైమ్ న్యూస్ ):** మంగళవారం ఉదయం పివికే5 గని లో ఏర్పాటు చేసిన సమావేశంలో ఎఐటియుసి నాయకులు మాట్లాడుతూ అండర్‌గ్రౌండ్ కార్మికులను సర్ఫేస్ జనరల్ అసిస్టెంట్లుగా మార్చే విషయంలో రాజీలేని పోరాటం చేస్తున్నది ఏఐటీయూసీ యూనియన్ మాత్రమేనని, కార్మికులను తప్పుదోవ పట్టించే కార్యక్రమాలను ఇతర యూనియన్లు చేపట్టడాన్ని పీవీకే -5 గని పిట్ కమిటీ తీవ్రంగా ఖండించారు. పీవీకే-5 గనిలో జరిగిన ఐ ఎన్ టీ యు సి గేట్ మీటింగ్‌లో ఏఐటీయూసీ యూనియన్ పై చేసిన విమర్శలను పిట్ కమిటీ ఖండించారు. ఐ ఎన్ టీ యు సి నాయకులు ఇకనుంచి పోరాటాలకు దిగుతామని చెప్పడం మంచిదే కానీ, అయితే ఆ పోరాటాలు ఐ ఎన్ టీ యు సి కి అనుబంధంగా ఉన్న ప్రభుత్వం పైన చేస్తారా,యాజమాన్యం పైన చేస్తారా, లేక ఇతర కార్మిక సంఘాల పైన చేస్తారా అనే విషయాన్ని ఐ ఎన్ టీ యు సి నాయకులు కార్మికులకు స్పష్టంగా చెప్పాలని డిమాండ్ చేశారు. అదేవిధంగా డిపెండెంట్ లకు నియామక పత్రాలు ఇప్పించడం లో ఐ ఎన్ టీ యు సి పాత్ర ఏమిటో చెప్పాలని, డిపెండెంట్ వారసుల నియామకాల కోసం ఏఐటీయూసీ అనేక పోరాటాలు చేసిన విషయం కార్మికులకు, డిపెండెంట్ లకు తెలుసని అన్నారు. అలాగే ఐ ఎన్ టీ యు సి నాయకులకు చిత్తశుద్ధి ఉంటే సింగరేణి సంస్థకు రాష్ట్ర ప్రభుత్వం నుంచి రావాల్సిన రూ.56వేల కోట్ల బకాయిల విషయంలో ఐ ఎన్ టీ యు సి నాయకులు తన వైఖరిని వెల్లడించాలని, అసెంబ్లీలో ఉప ముఖ్యమంత్రి “మెడికల్ బోర్డును మేమే ఆపాము” అని చేసిన వ్యాఖ్యలపై కూడా ఐ ఎన్ టీ యు సి నాయకులు అభిప్రాయాన్ని చెప్పాలని డిమాండ్ చేశారు. అదేవిధంగా పీవీకే- 5 గనిలో మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి సొంత ఇంటి పథకం విషయంలో “రెవెన్యూ మంత్రిగా నేనే సంతకం చేసి ఇస్తాను” అని ఇచ్చిన హామీ అమలుపై ఐ ఎన్ టీ యు సి నాయకులు మంత్రిని ప్రశ్నించాలని డిమాండ్ కోరారు. అదేవిధంగా టి బి జి కే ఎస్, బీజేపీ నాయకులు ప్రస్తావిస్తున్న 40 లక్షల టన్నుల బొగ్గు మాయం అంశంపై వాస్తవాలు వెలుగులోకి తేవాలని కోరారు,మణుగూరులో సర్ఫేస్ పోస్టులు తమ వల్లే వచ్చాయని చెప్పుకుంటున్న ఐ ఎన్ టీ యు నాయకులు, కొత్తగూడెం ప్రాంతంలో మాత్రం సర్ఫేస్ పోస్టులు ఎందుకు ఇప్పించలేకపోతున్నారో కార్మికులకు సమాధానం చెప్పాలని ప్రశ్నించారు. ఐఈడి ప్రకారం కొత్తగూడెం భూగర్భ గాని కార్మికులకు 270 సర్ఫేస్ పోస్టులు ఇప్పించి భూగర్భ గని కార్మికులకు న్యాయం చేస్తే, ఐ ఎన్ టీ యు సి నిర్వహించే పాలాభిషేక కార్యక్రమంలో ఏఐటీయూసీ కండువాలతో పాల్గొని పాలాభిషేకం చేస్తామని తెలిపారు. ఏఐటీయూసీతో ఎలాంటి సంబంధాలు వద్దని ఐ ఎన్ టీ యు నాయకులు చెప్పడం హాస్యాస్పదమని, అది వారి వ్యక్తిగత అభిప్రాయమా లేదా కాంగ్రెస్ పార్టీ అభిప్రాయమా అనేది స్పష్టం చేయాలని కోరారు. ఐ ఎన్ టీ యు సి నాయకులు చేసే పోరాటాలు కార్మిక సమస్యల పరిష్కారానికి దోహదపడేలా ఉండాలని, ఇతర కార్మిక సంఘాలపై విమర్శలకు మాత్రమే పరిమితం కాకూడదని తెలిపారు. ఈ కార్యక్రమంలో పిట్ కార్యదర్శి భూక్య రమేష్, అసిస్టెంట్ పిట్ కార్యదర్శి సందీప్ సెత్, పిట్ ఉపాధ్యక్షులు ఎస్.నాగేశ్వరరావు, మైనింగ్ స్టాఫ్ ఇన్‌చార్జ్ సాయి పవన్, సేఫ్టీ కమిటీ సభ్యులు రామచందర్, సురేందర్ రెడ్డి, సంజీవ్, ప్రశాంత్, హరికృష్ణ, ఈర్ప కృష్ణ, సురేష్, రవీందర్, రాజేష్, కోటేశ్వరరావు, మహేష్, రామారావు, కార మోహన్, మదనయ్య, ముబారక్, మేకల శీను, మహేష్, సంతానం తదితరులు పాల్గొన్నారు.

# మున్సిపల్ కార్యాలయం, పార్కింగ్ ప్రాంతంలో డాగ్ స్క్వాడ్‌తో క్షుణ్ణంగా తనిఖీలు

**మత్తు పదార్థాల నియంత్రణకు ప్రజలు పోలీసులకు సహకరించాలని విజ్ఞప్తి**



**గోదావరిఖని క్రైమ్ (ది క్రైమ్ న్యూస్):** మున్సిపల్ కార్యాలయం మరియు పార్కింగ్ ప్రాంతంలో డాగ్ స్క్వాడ్‌తో క్షుణ్ణంగా పరిశీలన చేసినట్లు గోదావరిఖని-1 టౌన్ ఇన్స్పెక్టర్ ఇంద్ర సేనా రెడ్డి వెల్లడించారు. మంగళవారం రామగుండం పోలీస్ కమిషనరేట్ పరిధిలోని గోదావరిఖని-1 టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలో ఉన్న మున్సిపల్ కార్యాలయం, పార్కింగ్ ప్రాంతంలో గోదావరిఖని-1 టౌన్ ఇన్స్పెక్టర్ ఇంద్ర సేనా రెడ్డి, అఫ్జలోద్దిన్, ఎస్ ఐ మనోహర్ లతో పాటు నార్కోటిక్ డాగ్ స్క్వాడ్ సమన్వయంతో ఆకస్మిక తనిఖీలు చేపట్టారు. ఈ సందర్భంగా కార్యాలయ ప్రాంగణం, పార్కింగ్ ప్రాంతం, సందర్శకుల సామగ్రి మరియు పరిసర ప్రాంతాలను క్షుణ్ణంగా పరిశీలించారు. మత్తు పదార్థాల అక్రమ రవాణా, నిల్వ మరియు వినియోగాన్ని అరికట్టే లక్ష్యంతో ఈ తనిఖీలు నిర్వహించినట్లు పోలీసులు తెలిపారు. ఈ సందర్భంగా గోదావరిఖని-1 టౌన్ ఇన్స్పెక్టర్ ఇంద్ర సేనా రెడ్డి మాట్లాడుతూ మత్తు పదార్థాల రవాణా లేదా వినియోగానికి సంబంధించి ఎలాంటి అనుమానాస్పద సమాచారం ఉన్నా వెంటనే పోలీసులకు సమాచారం అందించి భాగస్వాములు కావాలన్నారు. సమాచారం అందించిన వారి వివరాలను గోప్యంగా ఉంచుతామని, యువత భవిష్యత్తును నాశనం చేసే మత్తు సంస్కృతిపై కఠినంగా వ్యవహరిస్తామని స్పష్టం చేశారు.

# ఫిటినెస్ లేని బస్సులను కట్టడి చేసి ఆ యాజమాన్యాలపై తగు చర్యలు తీసుకువాలి

**పాలడుగు శ్రీనివాస్ ఉస్మానియా విద్యార్థి ఉద్యమ నాయకులు**



**హైదరాబాద్ (ది క్రైమ్ న్యూస్):** తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా నడుస్తున్న ప్రవేట్, కార్పొరేట్, ఇంటర్నేషనల్, ఇంజనీరింగ్, మెడికల్ కళాశాలల్లో నడుస్తున్న రవాణా వ్యవస్థ మరి దారుణంగా తయారై విద్యార్థుల ప్రాణాలు ఫణంగా పెట్టి ప్రయాణం కొంసాగించాల్సిన పరిస్థితి దాపూరించింది. గతములో ఫిటినెస్ లేని బస్సుల కారణంగా ఎన్నో ప్రవేట్ విద్యాసంస్థల బస్సులు ప్రమాదానికి గురైన సంఘటనలు కోకొల్లలు. అరకొర జీతాలతో అనుభవం లేని డ్రైవర్ల నియమించుకొని, అతి తక్కువ ధరలకే నాణ్యత కోల్పోయిన సెకండ్ గ్రేడ్ బస్సులను కొనుగోలు చేసి ఆ యొక్క బస్సులకు సరైన ఫిటినెస్ తో పాటుగా ఫైర్ సేఫ్టీ, ఏమర్జెన్సీ డోర్, ప్రాథమిక మెడికల్ కిట్, హెల్పర్ వ్యవస్థ లేకపోయిన విద్యాసంస్థల యాజమాన్యాలు, రవాణా శాఖ అధికారులతో కుమ్మక్కై ఫిటినెస్ ధ్రువీకరణ పత్రాలను ప్రవేశపెడుతు లేనివి ఉన్నట్టుగా క్రియేట్ చేసి విద్యార్థుల ప్రాణాలతో చలగాటమాడుతున్నారు. తక్షణమే తెలంగాణ రవాణ శాఖ అధికారులు ప్రతి ప్రవేట్, కార్పొరేట్ ఇతరాత్ర అనుబంధ విద్యాసంస్థలో నడుస్తున్న బస్సులను పునఃపరిశీలన చేసి రవాణా శాఖ నిబంధనలకు విరుద్ధంగా నడుస్తున్న బస్సులను సేజ్ చేసి ఆ యొక్క విద్యాసంస్థల యాజమాన్యాలపై తగు చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉన్నది.

# ఆస్తి పన్ను బకాయిలు వెంటనే చెల్లించాలి

**మున్సిపల్ కమిషనర్ కె. రవీందర్ రెడ్డి**





**నల్గొండ ప్రతినిధి, జూన్ 16 (ది క్రైమ్ న్యూస్):** హాలియా మున్సిపాలిటీ పరిధిలోని ఇంటి యజమానులు 2026-27 ఆర్థిక సంవత్సరానికి సంబంధించిన ఆస్తి పన్ను బకాయిలను వెంటనే చెల్లించాలని మున్సిపల్ కమిషనర్ కె. రవీందర్ రెడ్డి సూచించారు. ఆస్తి పన్ను చెల్లించని గృహ యజమానులకు ముందస్తు నోటీసులు జారీ చేయాలని మున్సిపల్ బిల్ కలెక్టర్లు మరియు వార్డు అధికారులకు ఆదేశాలు జారీ చేసినట్లు తెలిపారు. ఆస్తి పన్ను బకాయిలు ఉన్న గృహ యజమానులు 2026 జూలై 1వ తేదీ నుంచి మొదటి త్రైమాసికానికి 2 శాతం అపరాధ రుసుము చెల్లించాల్సి ఉంటుందని ఆయన వెల్లడించారు. అందువల్ల బకాయిలతో పాటు ప్రస్తుత సంవత్సర పన్నులను కూడా గడువులోగా చెల్లించి అపరాధ రుసుము భారాన్ని తప్పించుకోవాలని సూచించారు. మున్సిపాలిటీ ప్రజలు తమ పన్నులను సకాలంలో చెల్లించడం ద్వారా హాలియా పట్టణ అభివృద్ధికి సహకరించాలని కమిషనర్ కోరారు. పన్నుల ద్వారా లభించే ఆదాయంతో పట్టణంలో మౌలిక వసతుల అభివృద్ధి, పారిశుధ్య నిర్వహణ, ప్రజా సేవల మెరుగుదల వంటి కార్యక్రమాలు మరింత సమర్థవంతంగా చేపట్టవచ్చని ఆయన పేర్కొన్నారు.

# ఒక్కటి.. ఒకే ఒక్కటి.. పడుకునే ముందు అరటిపండు తింటే ఏమవుతుందో తెలుసా..?

అరటిపండులో ఎన్నో పోషకాలు దాగున్నాయి. ఇవి శరీరానికి ఎంతో మేలు చేస్తాయి. అందుకే.. ఎప్పటికీ అందుబాటులో ఉండే అరటిపండును తినాలని వైద్య నిపుణులు సూచిస్తున్నారు. అరటిపండులో పొటాషియం, విటమిన్ సి, విటమిన్ బి6, ఫైబర్, మాంగనీస్ వంటి అనేక ముఖ్యమైన పోషకాలు పుష్కలంగా ఉన్నాయి. వాటిలో కేలరీలు, కొవ్వు తక్కువగా ఉంటాయి. అందుకే..అయితే, పడుకునే ముందు అరటిపండు తినడం వల్ల నిద్ర, జీర్ణక్రియతోపాటు మొత్తం ఆరోగ్యంపై మంచి ప్రభావం చూపుతుంది. నిద్రపోయే ముందు అరటిపండును తినడం వల్ల కలిగే ప్రయోజనాలేంటో తెలుసుకోండి.. మంచి నిద్రను ప్రోత్సహిస్తుంది: అరటిపండ్లలో ట్రిప్టోఫాన్ అనే అమినో యాసిడ్ ఉంటుంది. ఇది సెరోటోనిన్‌గా.. మెలటోనిన్‌గా మారుతుంది. ఇవి కండరాలను సడలించే లక్షణాలకు ప్రసిద్ధి చెందిన ఖనిజాలను కలిగి ఉంటాయి. పడుకునే ముందు వాటిని తీసుకోవడం వల్ల మీ కండరాలు విశ్రాంతి తీసుకోవడానికి, మరింత ప్రశాంతమైన నిద్రను ప్రోత్సహిస్తాయి. రక్తంలో చక్కెర స్థాయిలను నియంత్రిస్తుంది: పడుకునే ముందు ఒకటి తినడం వల్ల రాత్రంతా రక్తంలో చక్కెర స్థాయిలలో వచ్చే అవాంతరాలను నివారించవచ్చు. అరటిపండ్లు ఫైబర్ కు మంచి మూలం. పడుకునే ముందు అరటిపండు తినడం వల్ల రాత్రి సమయంలో ఆకలి బాధలను నివారిస్తుంది. నిరంతరాయంగా నిద్రపోయేలా చేస్తుంది. పోషకాలు సమృద్ధిగా ఉంటాయి.. అరటిపండ్లు విటమిన్లు సి, బి6, పొటాషియం, మాంగనీస్ వంటి అవసరమైన పోషకాలతో నిండి ఉన్నాయి.పడుకునే ముందు వాటిని తీసుకోవడం వల్ల మీ శరీరానికి ఈ పోషకాలు అందుతాయి. ఇది మొత్తం ఆరోగ్యాన్ని ప్రోత్సహిస్తుంది..

# కాలం కరుణించకపోతే... రైతన్నను కాచుకునేదెవరు?

● ఆకాశం వైపు దీనంగా చూస్తున్న రైతన్నల గడ్డు పరిస్థితిపై ది క్రైమ్ న్యూస్ అందిస్తున్న ప్రత్యేక కథనం...

- తొలకరి లేక తల్లడిల్లుతున్న రైతులు
- ఆశలన్నీ ఆకాశం వైపే
- రోహిణి దాటింది...
- మృగశిర ముఖం చాటేసింది...
- ఆరుద్రపై ఆశలు కరువు ...
- ఇక రైతన్న భవిష్యత్తు ఏమిటి?




**బ్యూరో,(ది క్రైమ్ న్యూస్):** వానాకాలం సీజన్ ప్రారంభమై సుమారు నెలరోజులు గడుస్తున్నా ఆకాశం కరుణించక పోవడంతో రైతన్న గుండెల్లో ఆందోళన మేఘాలు కమ్ముకుంటున్నాయి. సాధారణంగా రోహిణి కార్తెలో ప్రారంభమయ్యే పునాస పనులు షరా మామూలుగా ఈసారి కూడా మొదలయ్యాయి. రైతులు అప్పులు చేసి, ఖరీదైన విత్తనాలు కొనుగోలు చేసి, భూములను సిద్ధం చేసి విత్తనాలు వేసినా... వాటిని పలకరించాల్సిన తొలకరి వాన మాత్రం ఇంకా జాడ చూపలేదు. పెద్దపల్లి జిల్లా సహా అనేక ప్రాంతాల్లో రైతులు పత్తి విత్తనాలు వేసి వారం, పది రోజులు గడిచినా ఒక్క చినుకు రాలక గింజ కూడా మొలకెత్తని పరిస్థితి నెలకొంది. దీంతో రైతులు ప్రత్యామ్నాయ మార్గంగా బోర్లు, మోటార్ల ద్వారా నీటిని పారించి పంటను కాపాడుకునే ప్రయత్నం చేస్తున్నారు. కానీ ఇది అదనపు ఖర్చుతో కూడుకున్న భారంగా మారుతోంది. తెల్ల బంగారంపై చావని మమకారం రైతన్నలకు అదనపు ఆర్థిక భారంగా మారింది. పత్తిని "తెల్ల బంగారం"గా భావించే రైతన్నకు ఈ పంట కేవలం సాగు కాదు... జీవనాధారం. ప్రతి ఏడాది ప్రకృతి ఎంత పరీక్షించినా పత్తి సాగుపై ఉన్న నమ్మకం, మమకారం, ప్రేమ ఎంతమాత్రం తగ్గలేదు. ఈసారి కూడా అదే ఆశతో రైతులు విత్తనాలు వేసినా , వర్షాభావం వారి ఆశలను ఆరబెడుతోంది. చిత్రంలో కనిపిస్తున్న రైతు కూడా అలాంటి వారిలో ఒకరే. వర్షం కోసం ఎదురుచూడలేక పొలంలో నీటిని పారిస్తూ, విత్తనాలను కాపాడుకునే ప్రయత్నం చేస్తున్నాడు. కానీ ప్రకృతి సహకరించకపోతే ఈ ప్రయత్నాలు ఎంతవరకు ఫలిస్తాయో? అనే ప్రశ్న అందరినీ వెంటాడుతోంది. "సూపర్ ఎల్-నినో" సంకేతాలు... కరువు భయాలు ఇప్పుడు రైతన్న వెన్నులో వణుకు పుట్టిస్తున్నాయి. వాతావరణ నిపుణులు ఇప్పటికే "సూపర్ ఎల్-నినో" ప్రభావం కారణంగా వర్షపాతం తగ్గే అవకాశం ఉందని హెచ్చరిస్తున్నారు. ప్రస్తుతం నెలకొన్న పరిస్థితులు కూడా ఆ అంచనాలను నిజం చేస్తున్నట్లుగానే కనిపిస్తున్నాయి. రోహిణి కార్తె ముగిసింది. మృగశిర కూడా రైతన్నకు నిరాశే మిగిల్చింది. ఇక ఆరుద్ర కార్తెను రైతులు "అరుపు కార్తె"గా పిలుస్తారు. ఎందుకంటే ఈ సమయంలో కురిసే వర్షాలపై వారికి అంతగా నమ్మకం ఉండదు. అంటే సాగుకు అనుకూలమైన వర్షాలు ఈ కాలంలో అరుదుగానే ఉంటాయని రైతు అనుభవం చెబుతోంది. నలుదిక్కుల కష్టాలతో రైతన్న పరిస్థితి ప్రస్తుతం మహాభారతంలోని అభిమన్యుడిని తలపిస్తోంది. ఒకవైపు ఖరీదైన విత్తనాలు, మరోవైపు నాసిరకం ఎరువులు, పురుగు మందులు, ఇంకోవైపు సహకరించని ప్రకృతి, మరోవైపు కనికరించని పాలకులు ఈ నాలుగు సమస్యల మధ్య రైతు పద్మవ్యూహంలో చిక్కుకున్న అభిమన్యుడిలా పోరాడుతున్నాడు. రైతు భరోసాపైనా సందేహాలే కలుగుతున్నాయి. పంట పరిస్థితి ఇలాగే కొనసాగితే కనీసం ప్రభుత్వం ప్రకటించిన రైతు భరోసా అయినా సకాలంలో అందుతుందా లేదా అన్న అనుమానాలు రైతుల్లో వ్యక్తమవుతున్నాయి. ఇప్పటికే పెట్టుబడులు పెట్టి ఇబ్బందులు పడుతున్న రైతులకు ప్రభుత్వ మద్దతు అత్యవసరంగా మారింది. ఈ పరిస్థితుల్లో"బతికేది ఎలా?" అని ఒకరినొకరు ప్రశ్నించుకుంటున్నారు. వానాకాలం సీజన్ ప్రారంభమైనా ఇప్పటివరకు సరైన వర్షాలు లేకపోవడంతో ఏ పంటా ఆశించిన స్థాయిలో మొలకెత్తలేదు. దీంతో రాబోయే రోజుల్లో పరిస్థితి ఎలా ఉంటుందోనని రైతులు ఆందోళన చెందుతున్నారు. "కాలం కరుణించకపోతే... మమ్మల్ని కాచుకునే వారు ఎవరు?" అనే ప్రశ్న ఇప్పుడు ప్రతి రైతు నోట వినిపిస్తోంది. ఆకాశం వైపు ఆశగా చూస్తూ... పొలంలో నీళ్లు పారిస్తూ... అప్పుల భారం మోస్తూ... "బతికేది ఎలా?" అని రైతన్నలు దిగులు పడుతున్నారు. వాన కోసం ఎదురుచూస్తున్నది కేవలం నేల కాదు... రైతు భవిష్యత్తు కూడా... ఇలాంటి గడ్డు పరిస్థితుల్లో దేశానికి అన్నం పెట్టే రైతన్నకు చేదోడు వాదోడుగా నిలవాల్సిన బాధ్యత నాయకులదే. ఈ వానాకాలానికి రైతు భరోసాను ఎలాంటి మెలికలు పెట్టకుండా అందిస్తే రైతన్నకు ఎంతో మేలు చేసిన వారు అవుతారు.

# టి జి ఎస్ ఆర్ టి సి గ్యారేజీ కార్మికులపై పని భారం తగ్గించాలి

● గారేజిలో అన్ని ఖాళీలను భర్తీ చేయాలి ● పని భారం తగ్గించాలి, భద్రత కల్పించాలి
● గ్యారేజీ కార్మికుల రాష్ట్ర సదస్సులో వి.ఎస్.రావు, లింగమూర్తిలు డిమాండ్

**ఖమ్మం ప్రతినిధి (ది క్రైమ్ న్యూస్ ):** గ్యారేజీలో అన్ని ఖాళీలను భర్తీ చేసి, పని భారం తగ్గించి భద్రత కల్పించాలని గ్యారేజీ కార్మికుల రాష్ట్ర సదస్సులో టిఎస్ఆర్టిసి స్టాఫ్ & వర్కర్స్ ఫెడరేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వి.ఎస్.రావు, లింగమూర్తి లు డిమాండ్ చేసారు. మంగళవారం ఖమ్మంలోనే స్థానిక సీఐటీయు ఆఫీసు నందు కామ్రేడ్ పిట్టల సుధాకర్ అధ్యక్షతన జరిగిన గ్యారేజ్ కార్మికుల రాష్ట్ర సదస్సులో గ్యారేజీ కార్మికులు వివిధ డిపోల నుండి పాల్గొన్నారు. సదస్సు ఉద్దేశించి వి ఎస్ రావు మాట్లాడుతూ సమ్మెకు ముందు సమ్మె తర్వాత పరిణామాలు వివరించారు. ఎస్ డబ్ల్యూ ఎఫ్ స్వతంత్రంగానే అనేక సమస్యలను కార్మికుల దృష్టికి తీసుకొస్తూ, వివిధ రూపాలలో ఆందోళన చేసిందన్నారు. కార్మికులపై భారాలు తగ్గించాలని, యూనియన్ల పై ఆంక్షలు ఎత్తివేయాలని, విద్యుత్ బస్సుల విధానంలో మార్పులు చేయాలని సదస్సులు జరిపి సంస్థకు, కార్మికులకు వచ్చే ప్రమాదం వివరించిందన్నారు. హయ్యర్ పెన్షన్ పై ఇందిరాపార్క్ వద్ద ధర్నా చేయటం,మహాలక్ష్మి స్కీము వల్ల వస్తున్నటు వంటి ఇబ్బందులు పై సెమినార్ పెట్టి రిప్రజెంటేషన్ చేయటం, లేబర్ కోడ్స్ పై విస్తృతంగా కార్మికుల్లో చర్చ జరిపి వాటి వల్ల ప్రమాదం ఏ రూపంలో ఉంటుందో బుక్లెట్స్ వేసి దానిపై సమ్మె చేయటం జరిగిందన్నారు. జూనియర్ క్లర్క్ ఎగ్జామ్ కు డ్రైవర్లకు, గ్యారేజీ సిబ్బందికి అవకాశం ఇవ్వాలని ఎస్డబ్ల్యుఎఫ్ రిప్రజెంటేషన్ మేరకు అవకాశం రాగా ఎగ్జామ్లో క్వాలిఫై కోసం అనేక సెంటర్ లో అవగాహన సదస్సులు పెట్టటం ఇలా ప్రతి సమస్యపై ఎస్డబ్ల్యుఎఫ్ పనిచేసింది అని తెలియజేసినారు. ఎస్ డబ్ల్యూ ఎఫ్ స్వతంత్రంగా కృషి చేస్తూనే ఉమ్మడి సమస్యలు పై అన్ని కార్మిక సంఘాలు కల్సి పని చేసేలా కృషి చేసింది. 2026 ఏప్రిల్ లో జరిగిన సమ్మెకు జాఏసీ మద్దతు ఇచ్చిన పిదపే అన్ని కార్మిక సంఘాలు మద్దతు తెలపటం వలనే సమ్మె విజయవంతం అయ్యింది. ఇది మొత్తం కార్మికుల విజయము అని తెలియజేసినారు. ఇచ్చిన హామీలను నెరవేర్చడం కోసం అందరూ ఐక్యంగా ఉండాల్సిన అవసరం ఎంతైనా ఉందని తెలియజేసినారు. సమ్మె విరమణ సమయం లో ప్రభుత్వం ఇచ్చిన హామీలు అమలు చేయాలనీ కోరారు. విలీన ప్రక్రియ వెంటనే మొదలుపెట్టాలని, విలీనానికి ముందు కొన్ని సమస్యలు పరిష్కారం చేయాలని ఇతర రాష్ట్రాలను అధ్యయనం చేసి బుక్లెట్స్ వేసి విస్తృతంగా కార్మికుల్లో చైతన్యపరిచి, నివేదికనే విలీన కమిటీకి ఇవ్వడం జరిగిందని అన్నారు. అలాగే ఉద్యోగ భద్రతపై కూడా పూర్తిగా అధ్యయనం చేసి నివేదిక



ఇవ్వటం జరిగిందని అన్నారు. సదస్సును ఎస్ డబ్ల్యూ ఎఫ్ డిప్యూటీ జనరల్ సెక్రెటరీ జి. లింగమూర్తి ప్రారంభోపన్యాసం చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గతంలో ఖమ్మం రీజియన్ లో ఎస్ డబ్ల్యూ ఎఫ్ స్థానిక గుర్తింపు సంఘంగా గ్యారేజీ కార్మికులకు టూల్స్, జిప్ క్రేన్స్, ఫెడస్టల్ ఫ్యాన్స్,గ్యారేజీ కార్మికులకు టీటీ ఇంజక్షన్స్, ఎప్పటికప్పుడు టెక్నాలజీకి అనుగుణంగా టూల్స్ ఇప్పించటం జరిగిందని, ప్రతి సమస్యపై పనిచేయడం జరిగిందని తెలియజేసినారు. వివిధ డిపోల నుండి వచ్చిన గ్యారేజీ కార్మికులు రోజువారి వారి పనిలో వస్తున్నటువంటి ఇబ్బందులు, పెరిగిన పని భారాలు, వేధింపుల ను వివరించారు.అన్ని డిపోలలో మెకానికులు, శ్రామికులు, హెల్పర్స్, లీడింగ్ హ్యాండ్, మెకానికల్ ఛార్జ్ హ్యాండ్ ల తో సహా షెడ్యూల్స్ అనుగుణం గా సిబ్బంది కొరత చాలా ఉన్నది అని, విపరీత పని భారం ఉందని తెలియ చేసారు. - మహిళా మరియు డ్రైవర్స్ సదస్సు లు జయప్రదం చేయండి. సదస్సు అధ్యక్షులు పిట్టల సుధాకర్ మాట్లాడుతూ కార్మికుల కోసం నిరంతరం పని చేసే ఎస్ డబ్ల్యూ ఎఫ్ ను బలోపేతం చేయాలనీ, జూన్ 18 న ఖమ్మం లో జరిగే మహిళా సదస్సు ను అలాగే జూన్ 21 న హనుమకొండ లో జరిగే డ్రైవర్స్ సదస్సు లను జయప్రదం చేయాలనీ కోరారు. ఈ సదస్సులో ఎస్ డబ్ల్యూ ఎఫ్ ఖమ్మం రీజియన్ కోశాధికారి పి. నర్సింహారావు, ఎస్ డబ్ల్యూ ఎఫ్ ఖమ్మం డిపో అధ్యక్షులు జి. వెంకటయ్య లు నిర్వహణ బాధ్యతలు చెపట్టారు.

# వర్షాకాల సన్నద్ధతపై అధికారులతో విస్తృత పర్యటన చేసిన పిఎసి చైర్మన్ ఆరెకపూడి గాంధీ





**రంగారెడ్డి జిల్లా, ప్రతినిధి (ది క్రైమ్ న్యూస్):** వర్షాకాలంలో ముంపు సమస్యలు, వాటర్ లాగింగ్ నివారణ, చెరువుల ఇన్‌లెట్‌లు, ఔట్‌లెట్‌ల నిర్వహణపై ప్రత్యేక దృష్టి సారిస్తూ శేరిలింగంపల్లి నియోజకవర్గ పరిధిలోని పలు ప్రాంతాలను పిఎసి చైర్మన్ శ్రీ ఆరెకపూడి గాంధీ మంగళవారం పరిశీలించారు. మల్కం చెరువు, దుర్గం చెరువు, గురునాథం చెరువు, గంగారాం చెరువు ఇన్‌లెట్‌లు, ఔట్‌లెట్‌లతో పాటు బయోడైవర్సిటీ జంక్షన్, కొత్తగూడా సంతోష్ డాబా, నెక్టర్ గార్డెన్, జూబ్లీ గార్డెన్ తదితర వాటర్ లాగింగ్ పాయింట్లను ఆయన అధికారులతో కలిసి సందర్శించి పరిస్థితులను సమీక్షించారు. ఈ పర్యటనలో తెలంగాణ ప్రభుత్వ సలహాదారు సుదర్శన్ రెడ్డి, రాష్ట్ర డీజీపీ సి. వి. ఆనంద్, హైడ్రా కమిషనర్ ఏ. వి. రంగనాథ్, తెలంగాణ డెయిరీ డెవలప్‌మెంట్ కోఆపరేటివ్ ఫెడరేషన్ చైర్మన్ గుత్తా అమిత్ రెడ్డి, సీఎంసీ కమిషనర్ సృజన, సైబరాబాద్ పోలీస్ కమిషనర్ ఎం. రమేష్, జోనల్ కమిషనర్లు, డీసీపీలు, సీఎంసీ ఇంజనీరింగ్, ప్రాజెక్ట్స్, ట్రాఫిక్, టౌన్ ప్లానింగ్, ఇరిగేషన్ విభాగాల అధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆరెకపూడి గాంధీ మాట్లాడుతూ వర్షాకాలాన్ని దృష్టిలో ఉంచుకుని అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. లోతట్టు ప్రాంతాలు, వాటర్ లాగింగ్ పాయింట్లపై ప్రత్యేక దృష్టి సారించి శాశ్వత పరిష్కారాలు అమలు చేయాలని అధికారులను ఆదేశించారు. చెరువుల ఇన్‌లెట్‌లు కుంచించుకుపోవడం, చెత్తాచెదారం పేరుకుపోవడం వల్ల మురుగు నీటి సమస్యలు ఉత్పన్నమవుతున్నాయని పేర్కొన్నారు. వరద నీరు ఎటువంటి అవరోధాలు లేకుండా సాఫీగా ప్రవహించేలా చర్యలు తీసుకోవాలని, డ్రైనేజీ వ్యవస్థను బలోపేతం చేయాలని, మ్యాన్‌హోల్స్ మరమ్మతులు చేపట్టాలని సూచించారు. ఎయిర్‌టెక్ మిషన్ల ద్వారా మ్యాన్‌హోల్స్‌లోని పూడిక, చెత్తను తొలగించి నీటి ప్రవాహాన్ని మెరుగుపరచాలని అధికారులకు దిశానిర్దేశం చేశారు. నాలాలపై అక్రమ నిర్మాణాలను ఉపేక్షించబోమని స్పష్టం చేసిన గాంధీ, నాలాల ఆక్రమణలపై కఠిన చర్యలు తీసుకోవాలని తెలిపారు. అసంపూర్తిగా ఉన్న నాలాల పనులను త్వరితగతిన పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని కోరారు. ప్రజలు ఎదుర్కొనే ఏ సమస్యనైనా తన దృష్టికి తీసుకువస్తే వెంటనే పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఇరిగేషన్, సీఎంసీ ఇంజనీరింగ్, ప్రాజెక్ట్స్ ఇంజనీరింగ్, ట్రాఫిక్, టౌన్ ప్లానింగ్ విభాగాల అధికారులు, కాలనీవాసులు తదితరులు పాల్గొన్నారు.

# స్ట్రీట్ వెండర్స్‌కు అండగా నిలిచిన ఎంపీ కొండా విశ్వేశ్వర్ రెడ్డి





**రంగారెడ్డి జిల్లా, ప్రతినిధి (ది క్రైమ్ న్యూస్):** మియాపూర్ డివిజన్ న్యూ కాలనీ శివాలయం ఎదురుగా ఉన్న గ్రౌండ్‌లో ప్రతి మంగళవారం నిర్వహించే స్ట్రీట్ వెండర్స్ మార్కెట్‌ను సీఆర్పీఎఫ్ సిబ్బంది, స్థానిక పోలీసులు అడ్డుకుంటున్నారనే సమాచారం అందడంతో చేవెళ్ల ఎంపీ కొండా విశ్వేశ్వర్ రెడ్డి, బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి రవి కుమార్ యాదవ్ అక్కడికి చేరుకుని వ్యాపారుల సమస్యలను తెలుసుకున్నారు. గత 20 సంవత్సరాలుగా ఈ ప్రాంతంలో ప్రతి మంగళవారం కూరగాయలు, పండ్లు, ఇతర చిన్న వ్యాపారాలు నిర్వహిస్తూ జీవనం సాగిస్తున్న స్ట్రీట్ వెండర్స్‌ను వ్యాపారం చేయనీయకుండా అడ్డుకోవడం పట్ల వారు ఆందోళన వ్యక్తం చేశారు. అనంతరం సీఆర్పీఎఫ్ కేంద్ర అధికారులతో, సంబంధిత అధికారులతో చర్చించి మార్కెట్ యథావిధిగా కొనసాగేందుకు చర్యలు తీసుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూఈమార్కెట్‌పై ఆధారపడి అనేక మంది పేద కుటుంబాలు జీవిస్తున్నాయని, వ్యాపారులు వారంలోని మిగతా రోజుల్లో ఇతర ప్రాంతాల్లో మార్కెట్లు నిర్వహిస్తూ ఉపాధి పొందుతున్నారని తెలిపారు. ఎన్నో ఏళ్లుగా కొనసాగుతున్న మార్కెట్‌ను అకస్మాత్తుగా అడ్డుకోవడం సమంజసం కాదన్నారు. అలాగే ఇటీవల జరిగిన రాజకీయ సమావేశాలకు అనుమతులు ఇచ్చిన అధికారులు, పేదల ఉపాధికి సంబంధించిన మార్కెట్‌ను ఎందుకు అడ్డుకుంటున్నారో సమాధానం చెప్పాలని ప్రశ్నించారు. సంబంధిత అధికారులతో చర్చల అనంతరం ప్రతి మంగళవారం ఇదే ప్రాంతంలో మార్కెట్ నిర్వహించేందుకు అనుమతులు లభించడంతో స్ట్రీట్ వెండర్స్ హర్షం వ్యక్తం చేశారు. తమ సమస్యను పరిష్కరించిన ఎంపీ కొండా విశ్వేశ్వర్ రెడ్డి, రవికుమార్ యాదవ్‌లకు వ్యాపారులు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మహేష్ యాదవ్, లక్ష్మణ్, గణేష్, పట్టాభిరామ్, పవన్, విజయేందర్, శ్రీనివాస్, రాము, బసవ శివ, శ్రీనివాస్ యాదవ్, ప్రసాద్, మనోజ్ తదితరులు పాల్గొన్నారు.

# గో టు విలేజ్ - మాదిగ పల్లెలకు తరలండి కార్యక్రమాన్ని విజయవంతం చేయండి

- ఎమ్మార్పీఎస్ కరీంనగర్ జిల్లా ఇంచార్జి మంద రాజు
- గ్రామగ్రామాన ఎమ్మార్పీఎస్ 32వ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు






**కరీంనగర్ టౌన్,జూన్ 16(ది క్రైమ్ న్యూస్):** పద్మశ్రీ మందకృష్ణ మాదిగ పిలుపునిచ్చిన 40 రోజుల కార్యచరణలో భాగంగా 'గో టు విలేజ్ - మాదిగ పల్లెలకు తరలండి' కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఎమ్మార్పీఎస్ కరీంనగర్ జిల్లా ఇంచార్జి మంద రాజు మాదిగ పిలుపునిచ్చారు. రామడుగు మండల ఇన్చార్జి తడగొండ శంకర్ మాదిగ ఆధ్వర్యంలో జరిగిన ఎమ్మార్పీఎస్, ఎమ్ఎస్పీ అనుబంధ సంఘాల ముఖ్య నాయకుల సమావేశానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మంద రాజు మాదిగ మాట్లాడుతూ పద్మశ్రీ మందకృష్ణ మాదిగ గారి నాయకత్వంలో 30 ఏళ్ల సుదీర్ఘ పోరాటం ద్వారా సాధించుకున్న ఎస్సీ వర్గీకరణ ఫలాలను జాతి బిడ్డలు అందిపుచ్చుకునేలా మాదిగ యువతను చైతన్యపరచడమే ఈ కార్యక్రమం ముఖ్య ఉద్దేశ్యమన్నారు. విద్యా, సంస్థగత నిర్మాణం, జెండా ఆవిష్కరణల కోసం ప్రతి నాయకుడు మాదిగ పల్లెల్లోకి వెళ్లాలని ఆదేశించారు. ఈనెల 25 నుండి జూలై 05 వరకు అన్ని గ్రామాల్లో విస్తృతంగా పర్యటించాలి. కమిటీలు లేని గ్రామాలలో ఎమ్మార్పీఎస్, ఎమ్ఎస్పీ అనుబంధ సంఘాల నూతన గ్రామ కమిటీలను వెంటనే నిర్మించాలి. గ్రామాలలో నూతనంగా ఎమ్మార్పీఎస్ గద్దెల నిర్మాణ పనులను పూర్తి చేయాలి. జూలై 7వ తేదీతో ఎమ్మార్పీఎస్ 32వ వసంతంలోకి అడుగుపెడుతున్న శుభసందర్భంగా, ప్రతి గ్రామంలో ఎమ్మార్పీఎస్ జెండా ఆవిష్కరణలు చేసి పండుగ వాతావరణంలో వేడుకలు నిర్వహించాలి. ఈ సమావేశంలో భాగంగా ఇటీవల విడుదలైన పదవ తరగతి ఫలితాలలో అత్యధిక మార్కులతో ప్రతిభ కనబరిచి, ఉత్తీర్ణులైన మాదిగ సామాజికవర్గ విద్యార్థులను నాయకులు ఘనంగా సన్మానించి, వారిని అభినందించారు. ఈ కార్యక్రమం లో చిలుముల రాజన్న మాదిగ రాష్ట్ర నాయకులు. గంగాధర ఇంచార్జి కల్వల మల్లన్న ఎమ్ ఈ ఫ్ రాష్ట్ర నాయకులు,దండు వరలక్ష్మి ఎంఎంఎస్ కరీంనగర్ జిల్లా కన్వీనర్,గజ్జల స్వామి మాదిగ ఎంఎస్పి రామడుగు మండల అధ్యక్షులు గంగాధర రవి మాదిగ ఎమ్మార్పీఎస్ గంగాధర మండల అధ్యక్షులు, లంక నర్సింగ్ ఎమ్మార్పీఎస్ సీనియర్ నాయకులు,గుడిసె విజయ్ ఎమ్మార్పీఎస్ వెదిర గ్రామశాఖ అధ్యక్షులు, జుట్టు శంకర్ చిప్పకుర్తి గ్రామశాఖ అధ్యక్షులు, విద్యార్థులు గ్రామస్తులు పాల్గొన్నారు

# ఎఫ్ఐఆర్‌లో రూ.1 లక్ష.. రికవరీ మాత్రం రూ.16 లక్షలా

● కాంట్రాక్ట్ ముగిసిన తర్వాత ఘటన.. రూ.16 లక్షల రికవరీపై వివాదం ● డ్రాగ్‌లైన్ దొంగతనం కేసులో అమాయక కాంట్రాక్టర్‌ను బలిపశువుగా చేస్తున్నారని ఆరోపణ ● ఆదికారుల భద్రతా వైఫల్యాన్ని కప్పిపుచ్చేందుకే కాంట్రాక్టర్‌పై చర్యలంటూ ఆవేదన ● డ్రాగ్‌లైన్ దొంగతనం కేసులో కాంట్రాక్టర్‌కు అన్యాయం? ● డ్రాగ్‌లైన్ స్క్రాప్ చోరీ కేసులో నిష్పక్షపాత విచారణ కోరిన బాధితుడు ● పరిహారం లేఖపై కాంట్రాక్టర్ నాగండ్ల రవికుమార్ ఆవేదన

**రామగిరి, జూన్ 16(ది క్రైమ్ న్యూస్):-** సింగరేణి ఆర్జీ-త్రీ ఏరియా సెక్యూరిటీ అధికారుల నిర్లక్ష్యం వల్ల జరిగిన డ్రాగ్‌లైన్ స్క్రాప్ దొంగతనం కేసు విషయంలో ఆదికారుల భద్రత వైఫల్యాన్ని కాంట్రాక్టర్లపై నెట్టడం సరికాదని, నష్ట పరిహారం తమపై మోపీ కుట్ర జరుగుతోందని కాంట్రాక్టర్ నాగండ్ల రవికుమార్ ఆవేదన వ్యక్తం చేశారు. మంగళవారం మండలంలోని పెంటిసరీకాలనీ సాయిరాం గార్డెన్లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో మాట్లాడుతూ శ్రీజ ఇన్ఫ్రా సెక్యూరిటీ కాంట్రాక్ట్ 02-03-2023న ప్రారంభమై 15-04-2026న ముగిసిందని, కాంట్రాక్ట్ ముగిసినట్లు ఏరియా సెక్యూరిటీ కార్యాలయం అధికారికంగా లేఖ కూడా జారీ చేసిందన్నారు. అయితే కాంట్రాక్ట్ ముగిసిన ఆరు రోజుల తర్వాత, అంటే 21-04-2026న జరిగిన డ్రాగ్‌లైన్ స్క్రాప్ దొంగతనానికి తనను బాధ్యుడిగా చూపిస్తూ రూ.16 లక్షల నష్టం భరించాలని లేఖ పంపడం పూర్తిగా అన్యాయమని పేర్కొన్నారు. సంఘటన జరిగిన సమయంలో మరో కాంట్రాక్టర్ పరిధిలో భద్రత బాధ్యతలు ఉన్నప్పటికీ - బాధ్యతలు ఉన్నప్పటికీ తమపై కేసు మోపతం కక్షపూరిత చర్యగా కనిపిస్తోందన్నారు. ఏరియా సెక్యూరిటీ అధికారుల భద్రతా అధికారులు భద్రతా వైఫల్యాన్ని కప్పిపుచ్చుకునేందుకు అమాయక


THE SINGARENI COLLIERIES COMPANY LIMITED
(A GOVT. COMPANY)
S & PC DEPARTMENT: RAMAGUNDAM – 3 DIVISION
Ref.No:RG.3/S&PC/78/2026/360 Date:21/05/2

M/s Sreeja Infra,
H.No. 6-382/A,
Power House Colony,
Godavarikhani.

Sir,

Sub:-Theft of 980 mtrs of 185sqmm cable from surveyed-off Dra at RGOCM-I – Reg.
Ref:- 1). PO.No. 7500051742, Dated:- 02-03-2023,
2). RG3/EOC1/02/2026/69, Dated: 23.04.2026.

***

With reference to the above purchase order under ref.no.1, suppl Outsourced Security Guards contract was awarded to you for prote Company's property.

With reference no.2 cited above, 980mts of 185sqmm Single Core arm Cable approximate cost of Rs.16,00,000/- was found missing from surveye Dragline at RGOCM-I.

Upon preliminary enquiry and police enquiry it is revealed that your pri security personnel were involved in this theft incident as cooperative to miscreants in their shifts while your firm running.

"As per the order terms and condition no. 1.7.ix " In the event of any of property entrusted to the successful tenderer the same shall be bro immediately to the notice of SCCL officials and preliminary investigate report be submitted to enable them to take up the matter further. The succe tenderer shall also pursue the same with the police or any other agency/auth for recovery of stolen property. The value of the items stolen will be dedu from the bills of the successful tenderer if the material is not recovered".

It is to inform you that the cost of the stolen cable i.e. Rs.16,00,000/- be deducted from the bills as per the terms and conditions of the order.

General Manager,
Ramagundam-3 Area

Cc to: GM (Vigilance),
DGM (F&A) RG-3 → Deduct the above mentioned amount from the Bills.

కాంట్రాక్టరు బలిపశువుగా మార్చే ప్రయత్నంజరుగుతోందన్నారు. దొంగతనం కేసులో పేర్లు వచ్చిన సెక్యూరిటీ గార్డులు శ్రీజ ఇన్ఫ్రా నియమించుకున్న సిబ్బంది కాదని, వారు గత ఆరు సంవత్సరాలుగా ప్రైవేట్ సెక్యూరిటీ గార్డులుగా పనిచేస్తున్న వారేనని తెలిపారు. సంఘటన జరిగిన సమయంలో మరో కాంట్రాక్టర్ పరిధిలో భద్రతా బాధ్యతలు ఉన్నప్పటికీ తమపై కేసు మోపడం కక్షపూరిత చర్యగా కనిపిస్తోందన్నారు. పోలీసులు నమోదు చేసిన



ఎఫ్ఐఆర్‌లో దొంగిలించబడిన స్క్రాప్ విలువ సుమారు రూ.1 లక్షగా పేర్కొన్నప్పటికీ, ఏరియా సెక్యూరిటీ ఆఫీసర్ మాత్రం ఎటువంటి ముందస్తు నోటీసు ఇవ్వకుండా రూ.16 లక్షల రికవరీ విధించడం అనుమానాలకు తావిస్తోందన్నారు. సహజ న్యాయ సూత్రాలకు విరుద్ధంగా తన వివరణ తీసుకోకుండా, ఎటువంటి విచారణ లేకుండానే భారీ మొత్తాన్ని రికవరీ చేయాలని నిర్ణయించడం వెనుక కక్షపూరిత ధోరణి కనిపిస్తోందని ఆరోపించారు. ఏరియా సెక్యూరిటీ అధికారుల భద్రతా వైఫల్యాన్ని కప్పిపుచ్చుకునేందుకు ఒక అమాయక కాంట్రాక్టర్‌ను బలిపశువుగా మార్చే ప్రయత్నం జరుగుతోందని పేర్కొన్నారు. ఈ వ్యవహారంపై సింగరేణి సీఎండీ, విజిలెన్స్ అధికారులు తక్షణమే స్పందించి పూర్తి స్థాయి విచారణ జరిపించాలని, నిజమైన బాధ్యులపై చర్యలు తీసుకోవాలని, తనపై విధించిన రూ.16 లక్షల రికవరీ ఉత్తర్వులను రద్దు చేసి న్యాయం చేయాలని బాధిత నాగండ్ల రవికుమార్ కాంట్రాక్టర్ విజ్ఞప్తి చేశారు.

# గసగసాలు గట్టిగా తినండి.. మధుమేహం నుండి గుండె జబ్బుల వరకు పరార్..!

గసగసాలు ఆరోగ్యానికి ఎంతో మేలు చేస్తాయి. వేసవిలో గసగసాలు తినడం వల్ల ఆరోగ్యానికి చాలా ప్రయోజనాలు కలుగుతాయి. ఎందుకంటే ఇవి చల్లటి గుణాన్ని కలిగి ఉంటాయి. అద్భుత ఔషధ గుణాలు కలిగి ఉన్న గసగసాలు తినటం ద్వారా పీచు, కాల్షియం, మెగ్నీషియం, ఐరన్, జింక్, విటమిన్లు సమృద్ధిగా లభిస్తాయి. అనేక వ్యాధుల నుండి రక్షిస్తుంది. నాడీ వ్యాధులు, మధుమేహం, గుండె జబ్బులు వంటి వివిధ రకాల ఆరోగ్య సమస్యలను దూరం చేయడంలో గసగసాలు ఉపయోగపడతాయి. గసగసాలు తినడం వల్ల పొట్టకు చల్లదనం చేకూరుతుంది. ఇది ఎసిడిటీ, మలబద్ధకం సమస్య నుంచి ఉపశమనం కలిగిస్తుంది. గసగసాలు తినడం వల్ల శరీరంలో రక్తం కొరత తీరుతుంది. ఇవి ఎముకలను దృఢంగా చేస్తాయి. వేసవిలో తినడం వల్ల శరీరానికి లెక్కలేనన్ని ప్రయోజనాలు కలుగుతాయి. గసగసాల వల్ల కలిగే ఆరోగ్య ప్రయోజనాల గురించి ఇక్కడ తెలుసుకుందాం. మెదడు సామర్థ్యం: మెదడుకు నరాల, రక్త కణాల ప్రవాహాన్ని నియంత్రించే సామర్థ్యం గసగసాలకు ఉంది. మెదడులోని నాడీ




కణాలు ఉత్తేజితం కావడం వల్ల మెదడు సామర్థ్యం పెరుగుతుంది. కాబట్టి పాలలో ఉడకబెట్టిన గసగసాలు తింటే పిల్లల్లో జ్ఞాపకశక్తి మెరుగవుతుంది. పెద్దలు గసగసాల పాలను తాగడం వల్ల ప్రయోజనం పొందుతారు. ఎముకల ఆరోగ్యం: గసగసాలలో కాల్షియం, కాపర్ పుష్కలంగా ఉంటాయి. ఈ రెండు పోషకాలు ఎముకల ఆరోగ్యానికి ముఖ్యమైనవి. అలాగే ఎముకల మధ్య బంధన కణజాలాన్ని బలపరుస్తుంది. దీంతో కీళ్ల నొప్పుల నుంచి ఉపశమనం పొందవచ్చు. రక్త ప్రసరణ: గసగసాలలో ఫైబర్ పుష్కలంగా ఉంటుంది. ఇది హానికరమైన చెడు కొలెస్ట్రాల్ స్థాయిలను తగ్గించడంలో, శరీరంలో మంచి కొలెస్ట్రాల్ స్థాయిలను పెంచడంలో సహాయపడుతుంది. గసగసాలలో ఐరన్ కూడా పుష్కలంగా ఉంటుంది. అందువల్ల, ఇది రక్త ప్రసరణను మెరుగుపరుస్తుంది. గుండెను ఆరోగ్యంగా ఉంచుతుంది. నిద్రలేమి: నిద్రలేమితో బాధపడేవారు రాత్రిపూట గసగసాలు ఎక్కువగా తీసుకుంటే మంచి ఫలితాలు పొందవచ్చు. ఒత్తిడిని తగ్గిస్తుంది. మనస్సును ప్రశాంతంగా ఉంచుతుంది. ఆందోళనను తగ్గిస్తుంది. ప్రశాంతమైన నిద్రను ప్రోత్సహిస్తుంది. రోగనిరోధక శక్తి:మన రోగనిరోధక శక్తిని బలోపేతం చేయడానికి విటమిన్ సి ఎంత ముఖ్యమైనదో జింక్ కూడా అంతే ముఖ్యం. గసగసాలలో జింక్ పుష్కలంగా ఉంటుంది. దీనిని రెగ్యులర్ గా తీసుకోవడం వల్ల శరీరంలో రోగనిరోధక శక్తి పెరుగుతుంది. థైరాయిడ్ సమస్య:థైరాయిడ్ గ్రంధికి జింక్ చాలా ముఖ్యమైన పోషకం. ఇది థైరాయిడ్ హార్మోన్లను సమతుల్యం చేస్తుంది. కాబట్టి, థైరాయిడ్ సమస్యలు ఉన్నవారు జింక్ పుష్కలంగా ఉండే గసగసాలను తీసుకోవచ్చు. నోటి పుండు:తరచుగా నోటిపూత వచ్చినప్పుడు గసగసాలు తింటే ఉపశమనం లభిస్తుంది. యాంటీ బాక్టీరియల్ కాకుండా, గసగసాలు శరీరాన్ని చల్లబరుస్తాయి. రాత్రి పూట గసగసాలు మెత్తగా చేసి పాలలో మరిగించి తాగాలి. ఇది ఆరోగ్యానికి అన్ని విధాలుగా మేలు చేస్తుంది.

# బ్రెస్ట్ క్యాన్సర్ రాకుండా నివారించే అద్భుత పండు ఇది.. మహిళలు తప్పక తినాల్సిందే



మహిళల్లో అధికంగా వచ్చే అనారోగ్య సమస్యల్లో బ్రెస్ట్ క్యాన్సర్ ముఖ్యమైనది. అయితే బ్రెస్ట్ క్యాన్సర్ నివారణకు తీసుకునే అనేకానేక చర్యల్లో ఆహారం ఒకటి. సరైన ఆహారం తింటే శరీరంలో క్యాన్సర్ కారకాలు ఉత్పత్తి కాకుండా నివారించవచ్చు. బ్రెస్ట్ క్యాన్సర్ రాకుండా నివారించే ఆహారాల్లో పుచ్చకాయ ముఖ్యమైనది. ఇది రుచికి ఎంత కమ్మగా ఉంటుందో, దాని వల్ల చాలా ప్రయోజనాలు కూడా అంతే అధికంగా ఉన్నాయి. పుచ్చకాయలో 90 శాతం నీరు ఉంటుంది. కాబట్టి శరీరాన్ని హైడ్రేట్ గా ఉంచడంలో ఈ పండు ప్రధాన పాత్ర పోషిస్తుంది. అంతేకాకుండా పుచ్చకాయలో ఉండే యాంటీ ఆక్సిడెంట్లు వివిధ వ్యాధులను దూరం చేస్తాయి పుచ్చకాయ క్యాన్సర్‌ను నివారించడంలో కూడా సహాయపడుతుంది. ఇందులోని యాంటీఆక్సిడెంట్లు ఫ్రీ రాడికల్స్ (కణాలను నాశనం చేసే క్రియాశీల అణువులు) తొలగించడంలో సహాయపడతాయి. అందుకే పుచ్చకాయ వివిధ క్యాన్సర్ల ప్రమాదాన్ని తగ్గిస్తుందని నిపుణులు అంటున్నారు. పుచ్చకాయలో ఉండే యాంటీ ఆక్సిడెంట్లు, విటమిన్-సి రోగనిరోధక శక్తిని పెంపొందించడానికి సహాయపడుతుంది. అంతేకాకుండా ఇది ఫ్రీ రాడికల్స్‌ను తొలగించడం ద్వారా క్యాన్సర్ నివారించడంలో సహాయపడుతుంది. ప్రత్యేకంగా ఇది రొమ్ము క్యాన్సర్ ప్రమాదాన్ని తగ్గిస్తుంది. పుచ్చకాయలో ఉండే లైసోపీన్ అనే యాంటీ ఆక్సిడెంట్ సూర్యుని అతినీలలోహిత కిరణాల నుంచి చర్మాన్ని రక్షిస్తుంది. ఫలితంగా పుచ్చకాయ సన్ టాన్ తొలగించడమే కాకుండా, చర్మ క్యాన్సర్‌ను కూడా నివారిస్తుంది. పుచ్చకాయలో విటమిన్ ఎ అధికంగా ఉంటుంది. కాబట్టి ప్రతిరోజూ పుచ్చకాయ తినడం వల్ల కంటి ఆరోగ్యం మెరుగుపడుతుంది. దృష్టి మెరుగుపడుతుంది. అంతేకాకుండా ఈ సీజనల్ వివిధ రకాల ఇన్ఫెక్షన్ల నుంచి కళ్లను రక్షిస్తుంది. నీటి కంటెంట్‌తో పాటు, పుచ్చకాయలో తగినంత మొత్తంలో విటమిన్-బి6 ఉంటుంది. ఇది మెదడును ఆరోగ్యంగా ఉంచడంలో సహాయపడుతుంది. రోజూ పుచ్చకాయ తినడం వల్ల వేసవితాపం నుంచి కాపుడుకోవచ్చు. పుచ్చకాయలో ఎక్కువగా నీరు ఉంటుంది. కేలరీల కంటెంట్ చాలా తక్కువగా ఉంటుంది. కాబట్టి శరీర బరువును తగ్గించుకోవాలనుకుంటే, ప్రతిరోజూ మీ ఆహారంలో ఈ పండును తీసుకోవచ్చు.

## ఆలివ్ ఆయిల్‌తో అద్భుతాలు..! ఇలా వాడితే మధుమేహం పరార్..



మధుమేహం అనేది ఒక దీర్ఘకాలిక అనారోగ్య సమస్య. ఈ వ్యాధి ఒకసారి వస్తే ఎప్పటికీ నయం కాదు. ఎందుకంటే దీనిని పూర్తిగా నయం చేసే చికిత్స ఇంతవరకు అందుబాటులోకి రాలేదు. చాపకింద నీరులా సోకే మధుమేహం రాకుండా ఉండాలంటే ఆరోగ్యంపట్ల అప్రమత్తంగా ఉండటం అవసరం. రక్తంలో గ్లూకోజ్ పెరిగినప్పుడు మనిషికి మధుమేహం వస్తుంది. గ్లూకోజ్ మన శరీరానికి శక్తి ప్రధాన వనరుగా పరిగణిం చబడుతుంది. శరీరం గ్లూకోజ్‌ని తయారు చేయగలదు. ఇన్సులిన్ అనేది ప్యాంక్రియాస్ ఉత్పత్తి చేసే హార్మోన్. ఇది గ్లూకోజ్ కణాలలోకి ప్రవేశించడానికి సహాయపడుతుంది. మధుమేహం బాధితుల్లో శరీరం తగినంత ఇన్సులిన్‌ను ఉత్పత్తి చేయదు..లేదంటే ఇన్సులిన్‌ను సరిగ్గా ఉపయోగించదు. అటువంటి పరిస్థితిలో గ్లూకోజ్ రక్తంలో పేరుకుపోతుంది. కణాలకు చేరుకోలేకపోతుంది. మధుమేహం మొత్తం శరీరాన్ని ప్రభావితం చేస్తుంది. ఇది మూత్రపిండాలు, నాడీ వ్యవస్థ, గుండె ఆరోగ్యాన్ని ప్రతికూలంగా ప్రభావితం చేస్తుంది. మధుమేహాన్ని నియంత్రించడానికి, నిపుణులు ఆరోగ్యకరమైన జీవనశైలిని, మంచి ఆహారాన్ని సిఫార్సు చేస్తారు. మధుమేహాన్ని నియంత్రించడంలో ఆలివ్ ఆయిల్ ఎంత ప్రభావవంతంగా ఉంటుందో తెలుసుకుందాం మధుమేహాన్ని నియంత్రించడానికి ఆలివ్ ఆయిల్ ప్రయోజనాలు: ఆలివ్ ఆయిల్ రక్తంలో చక్కెర, కొలెస్ట్రాల్ స్థాయిలను తగ్గించడంలో సహాయపడుతుంది. ఇది దయాబెటిక్ రోగులకు మేలు చేస్తుంది. ముఖ్యంగా టైప్ 2దయాబెటిస్ రోగులకు ఇది అద్భుతంగా పనిచేస్తుంది. ఆలివ్ నూనెలో అనేక రకాల పోషకాలు ఉన్నాయి. ఆలివ్ ఆయిల్ యాంటీఆక్సిడెంట్లకు మంచి మూలం. అధిక చక్కెర కారణంగా ఆక్సీకరణ ఒత్తిడి పెరుగుతుంది. అదే సమయంలో, యాంటీఆక్సిడెంట్లు దాని స్థాయిలను తగ్గించడంలో సహాయపడతాయి. ఇదిదయాబెటిస్ ప్రమాదాన్ని తగ్గిస్తుంది. అంతే కాదు మధుమేహం వల్ల శరీరంలో చాలా సార్లు వాపు వస్తుంది. ఆలివ్ ఆయిల్ గుణాలు శరీరంలో మంటను తగ్గించి, సెల్ డ్యామేజ్‌ను నివారిస్తాయి. 1టేబుల్ స్పూన్ ఆలివ్ నూనెలో 14 గ్రాముల మొత్తం కొవ్వు ఉంటుంది. కానీ ఫైబర్, చక్కెర ఉండదు. ఇది విటమిన్లు మంచి మూలం. ఆలివ్ నూనెలో ఫైటోస్టెరాల్స్ ఉంటాయి. ఇదిగుండె ఆరోగ్యాన్ని కాపాడుకోవడంలో సహాయపడుతుంది. ఇదిమన ఆహారం నుండి కొలెస్ట్రాల్ శోషణను నిరోధిస్తుంది. గుండె జబ్బులతో సంబంధం ఉన్న చెడు కొలెస్ట్రాల్ మొత్తాన్ని తగ్గిస్తుంది. మీరు ఒక రోజులో ఎంత తింటారు అనేది ముఖ్యం. మీరు రోజుకు 3 నుండి 4 టీస్పూన్ల ఆలివ్ నూనెను మాత్రమే తీసుకోవాలి. ఆలివ్ ఆయిల్ ఇతర ప్రయోజనాలు..ఆలివ్ ఆయిల్ మంటను తగ్గిస్తుంది. ఆలివ్ నూనె ఆక్సీకరణ ఒత్తిడిని తగ్గిస్తుంది. ఆలివ్ ఆయిల్ చెడు కొలెస్ట్రాల్‌ను తగ్గిస్తుంది. మంచి కొలెస్ట్రాల్‌ను పెంచుతుంది. ఇది రక్తం గడ్డకట్టే ప్రమాదాన్ని తగ్గిస్తుంది. ఆలివ్ నూనె రక్తపోటును తగ్గిస్తుంది.

# గుండెకు మేలు చేసే ఉల్లి కాడలు..

### రక్తప్రసరణ సజావుగా సాగాలంటే వీటిని తినాల్సిందే



ఉల్లిపాయలో అనేక సుగుగుణాలు ఉంటాయి. అందుకే ఉల్లి చేసిన మేలు తల్లి కూడా చేయదనే నానుడి ప్రజాజీవనంలో స్థిరపడి పోయింది. ఉల్లిపాయలే కాదు ఉల్లి కాడలు కూడా ఆరోగ్యానికి మేలు చేసే ఆహారాల్లో అగ్రస్థానంలో ఉన్నాయి. ప్రతి మార్కెట్‌లో ఉల్లి కాడలు తక్కువ ధరకే లభ్యమవుతుంటాయి. ఉల్లి కాడలను ఇతర కూరగాయలతో కూడా జోడించి వంటలు చేయొచ్చు. ఆకర్షణీయంగా కనిపించడమేకాకుండా రుచి కూడా అద్భుతంగా ఉంటుంది. ఆరోగ్య నిపుణుల అభిప్రాయం ప్రకారం..ఉల్లి కాడలు హృద్రోగులకు, వృద్ధులకు చాలా ఉపయోగకరంగా ఉంటుంది. ఉల్లి కాడల్లో అనేక పోషకాలు ఉంటాయి. ఇవి గుండెకు ఎంతో మేలు చేస్తాయి. దీన్ని కూరలో వేసుకుని తింటే గుండె జబ్బులు తగ్గుతాయని ఆరోగ్య నిపుణులు అంటున్నారు. అలాగే ఉల్లి కాడల్లో ఉండే క్వెర్సెటిన్ అనే పదార్థం యాంటీ ఆక్సిడెంట్‌గా పనిచేస్తుంది. ఈ యాంటీఆక్సిడెంట్ ఫ్రీ రాడికల్స్‌తో పోరాడుతుంది. అలాగే గుండె జబ్బుల వంటి తీవ్రమైన సమస్యల నుంచి ఉపశమనం పొందుతుంది. ఇందులో విటమిన్ సి, ఫోలిక్ యాసిడ్, ఫైబర్ ధమనులను ఆరోగ్యంగా ఉంచి గుండె ఆరోగ్యాన్ని కాపాడుతాయి. ఉల్లి కాడలను తినడం వల్ల రక్తంలోని కొలెస్ట్రాల్ స్థాయిలు తగ్గుతాయి. అంటే, శరీరంలో కొలెస్ట్రాల్ స్థాయిలు ఎక్కువగా ఉంటే, దానిని నియంత్రించడంలో సహాయపడుతుంది. ఇందులో అధికంగా సల్ఫర్ ఉంటుంది. ఇది రక్తపోటును తగ్గించడంలో సహాయపడుతుంది. అంతేకాకుండా ఇందులోని యాంటీ బ్యాక్టీరియల్, యాంటీ ఇన్ఫ్లమేటరీ గుణాలు శరీర నొప్పిని తగ్గిస్తాయి. నిత్యం ఉల్లి కాడలను ఆహారంలో భాగంగా తీసుకుంటే శరీరంలో రక్తప్రసరణ సజావుగా జరుగుతుంది. ఇది శరీరాన్ని ఆరోగ్యంగా ఉంచుతుంది.

# అంత డేంజరా..? ఫ్రిజ్‌లో పెట్టిన పుచ్చకాయ తింటే.. శరీరంలో ఏమవుతుందంటే..!



సమ్మర్ సీజన్ మొదలైంది. ఎండలు మండిపోతున్నాయి. ఉదయం 10దాటిందంటే.. సూర్యుడు ప్రతాపం మొదలవుతుంది. ఇంట్లోంచి బయటకు అడుగు పెట్టామంటే.. చాలు ఉక్కపోత చెమట పట్టడం సహజం. బయటకు వెళ్లాక బట్టలన్నీ చెమటతో తడిసిపోతున్నాయి. మన శరీరం నుండి పోషకాలు కోల్పోవడమే దీనికి కారణం. అయితే దీన్ని బ్యాలెన్స్ చేసేందుకు చాలామంది వేసవిలో పుచ్చకాయ ఎక్కువగా తింటుంటారు. పుచ్చకాయలో లైకోపీన్, యాంటీ ఆక్సిడెంట్ ఎలిమెంట్స్, విటమిన్ ఎ, విటమిన్ సి, పొటాషియం, అమినో యాసిడ్స్ అధికంగా ఉంటాయి. అలాగే బరువు తగ్గాలని ప్రయత్నించే వారికి కూడా ఈ పండు బాగా ఉపయోగపడుతుంది. ఇందులో క్యాలరీలు చాలా తక్కువ కాబట్టి, ఈ పండును తీసుకోవడం వల్ల మన పొట్ట ఎక్కువ సమయం నిండుగా ఉంటుంది. ఈ పండు వేసవిలో ఎండ వేడిమి నుండి మన శరీరాన్ని చల్లగా ఉంచుతుంది. అలాగే ఇందులో 92శాతం నీరు ఉంటుంది. కాబట్టి ఇది మన శరీరానికి ఎక్కువ వాటర్ కంటెంట్ అందిస్తుంది. తాజా పుచ్చకాయలో సిట్రులిన్ అనే ముఖ్యమైన అమైనో ఆమ్లం ఉంటుంది. ఈ సిట్రులైన్ నైట్రిక్ ఆక్సైడ్ 6 ను ఉత్పత్తి చేస్తుంది. ఫలితంగా రక్తపోటు అదుపులో ఉంటుంది. పుచ్చకాయలో కేలరీలు తక్కువగా ఉంటాయి. ఫలితంగా, పుచ్చకాయ శరీరంలో చక్కెర పరిమాణాన్ని నియంత్రిస్తుంది. డైటింగ్ చేసేవారికి కూడా పుచ్చకాయ చాలా మంచిది. కానీ కొందరు పుచ్చకాయను రిఫ్రిజిరేటర్ లో ఉంచి తింటారు. కానీ ఇలా చేయడం వల్ల పోషక విలువలు తగ్గుతాయని మీకు తెలుసా..సాధారణంగా కొంతమంది మార్కెట్ నుండి పండ్లను కొనుగోలు చేసి ఇంటికి తెచ్చిన తర్వాత వాటిని ఫ్రిజ్‌లో ఉంచుతారు. అయితే పండ్లను కోసి ఫ్రిజ్‌లో ఉంచే అలవాటు ఉంటే మాత్రం వెంటనే దానిని వదిలేయండి. ముఖ్యంగా పుచ్చకాయను ఫ్రిజ్‌లో పొరపాటున కూడా పెట్టకూడదు. పుచ్చకాయను రిఫ్రిజిరేటర్‌లో ఉంచడం కంటే గది ఉష్ణోగ్రత వద్ద ఉంచడం మంచిదని పరిశోధనలు చెబుతున్నాయి. ఎంత ఎండలోనైనా పుచ్చకాయ చాలా చల్లగా ఉంటుంది. తినడానికి రుచికరమైనది. కానీ కట్ చేసిన పుచ్చకాయను ఫ్రిజ్ లో ఉంచితే ఫుడ్ పాయిజన్ అయ్యే అవకాశం ఉంది. సాధారణంగా కోసిన పుచ్చకాయపై బ్యాక్టీరియా పెరగడం ప్రారంభమవుతుంది. ఇది ఆరోగ్యానికి చాలా హానికరం.

# నేలపై పడుకుంటే ఇన్ని లాభాలా..? తెలిస్తే బెడ్‌కు గుడ్ బై చెప్పేస్తారు..!

కాలం మారింది.. దాంతో పాటుగానే ప్రజల జీవన విధానాలు మారిపోతున్నాయి. సౌకర్యాల విషయానికి వస్తే చాలా మంది ప్రజలు లగ్జరీ లైఫ్ కోసం పరుగులు పెడుతున్నారు.కానీ నేటికీ నేలపై పడుకునే పాత సంప్రదాయం ఇప్పటికీ సరైనదని మరోసారి నిరూపించబడింది ఈ ఆధునిక యుగంలో అందరూ మంచాలు, సుతిమెత్తటి బెడ్‌లను వాడుతున్నారు. కానీ, అలాంటి మంచాన్ని వదిలి నేలపై పడుకోవడం వల్ల కలిగే ప్రయోజనాలేంటో తెలుసా..? ఆ లాభాలు తెలిస్తే మీరు ఆశ్చర్యపోతారు. నేలపై పడుకోవడం వల్ల కలిగే అసంఖ్యాక ప్రయోజనాల గురించి ఇప్పుడు తెలుసుకుందాం.. నేల మీద పడుకోవడం వల్ల మానసిక ఆరోగ్యం: మనస్తత్వవేత్తలు నేలపై పడుకోవడం వల్ల శరీరం రిలాక్సేషన్, నేలతో అనుబంధం ఏర్పడుతుందని అంటున్నారు. నేలపై పడుకోవడం వల్ల శరీర భంగిమ సరైన రీతిలో ఉంటుంది. అదే బెడ్‌పై పడుకున్నప్పుడు మనం నిద్రించే సమయంలో కుంగి ఉంటాయి. ఇది అసౌకర్యాన్ని కలిగిస్తుంది. నేలపై పడుకోవడం వల్ల వెన్నెముక నిటారుగా ఉంటుంది. మనం నేలపై పడుకున్నప్పుడు మన శరీరం పూర్తిగా రిలాక్స్ అవుతుంది. మనం పూర్తి విశ్రాంతి తీసుకుంటాము. ఇది వెన్నునొప్పిని తగ్గిస్తుంది. వెన్నెముకపై ఒత్తిడి తగ్గించుకునేందుకు పిల్లోను వాడుకోవచ్చు. నడుము భాగంలో పలుచని పిల్లోను పెట్టుకుని నిద్రించాలన్నది వైద్యుల సూచన. నేలపై పడుకోవడం వల్ల కలిగే ఆధ్యాత్మిక ప్రయోజనాలు: నేలపై పడుకోవడం వల్ల మన శరీరానికి కావలసిన సహజమైన విశ్రాంతి లభిస్తుంది. ఇది మన వీపును నిటారుగా ఉంచుతుంది. కండరాలను రిలాక్స్ చేస్తుంది. మీరు ఫ్లాట్ ఫ్లోర్‌లో పడుకున్నప్పుడు, మీ మనస్సులోని ఆందోళనలు కూడా తగ్గుతాయి. నేటి బీజీ లైఫ్ అత్యధిక ఒత్తిడితో కూడిన యుగంలో నేలపై నిద్రపోవడం మనల్ని ప్రకృతికి దగ్గర చేస్తుంది. భూమితో అనుసంధానం చేయడం ద్వారా మనం మరింత సమతుల్యత, ప్రశాంతతను పొందవచ్చు. నేలపై పడుకోవడం వల్ల మంచి నిద్రపడుతుంది. అదే విధంగా నిద్రలో సహజ శరీర కదలిక ఉంటుంది. పరుపులు, దిండ్ల ఒత్తిడి ఉండదు. మంచి రక్త ప్రసరణ ఉంటుంది. వేసవిలో నేలపై పడుకోవడం వల్ల శరీరానికి కాస్త చల్లగా అనిపిస్తుంది. నేల చల్లదనానికి, శరీర ఉష్ణోగ్రత నెమ్మదిగా తగ్గిపోతుంది. దీనివల్ల మరింత గాఢంగా నిద్ర పోవచ్చు. అంతేకాదు, చాలా మంది ఆఫీసు, ఇంటి పనితో అలసిపోతుంటారు. బాడీ పెయిన్స్‌తో బాధ పడుతుంటారు. ఆ పెయిన్స్ ఉన్న వారు బెడ్ కి గుడ్ బై చెప్పి నేల మీద పడుకోవడం అలవాటు చేసుకోండి. ఆ హాయిని మీరు ఆస్వాదిస్తారు.

# గొడవపై వైభవ్ సూర్యవంశీకి జరిమానా

## స్పోర్ట్స్

కేవలం 15 ఏళ్ల వయసు ఉందని చెప్పి ఎలాంటి ప్రవర్తనకైనా మినహాయింపు లభించదు. భారత యువ క్రికెటర్ వైభవ్ సూర్యవంశీ ఈ విషయాన్ని గుర్తుంచుకోవాల్సిన అవసరం ఉందని క్రీడా విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. సోమవారం జరిగిన భారత్-ఏ, శ్రీలంక-ఏ జట్ల మధ్య మ్యాచ్ అనంతరం సూర్యవంశీ ఓ శ్రీలంక ఆటగాడితో వాగ్వాదానికి దిగినట్లు, అనంతరం అతడిని తోసినట్లు వీడియోల్లో కనిపించింది. భారత్ సూపర్ ఓవర్‌లో ఓడిపోయిన తర్వాత ఈ ఘటన చోటుచేసుకోవడంతో మ్యాచ్‌పై చర్చ మొత్తం ఈ వివాదం వైపు మళ్లింది. ఈ ఘటనపై న్యూస్18తో మాట్లాడిన మాజీ అంపైర్ అనిల్ చౌదరి తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. ఆటగాళ్లు భౌతికంగా ఒకరినొకరు తాకే పరిస్థితి రావడం సరైంది కాదని, మ్యాచ్ నిర్వహించిన ఫీల్డ్ అంపైర్లు కూడా పరిస్థితిని మరింత సమర్థంగా నియంత్రించాల్సి ఉండేదని ఆయన అభిప్రాయపడ్డారు. ఐసీసీ నిబంధనలు ఏమంటున్నాయి? ఇప్పటివరకు అంతర్జాతీయ క్రికెట్ మండలి అధికారిక ప్రకటన విడుదల చేయకపోయినా, ఈ ఘటనను ఐసీసీ ప్రవర్తనా నియమావళిలోని ఆర్టికల్ 2.12 కింద పరిశీలించే అవకాశం ఉంది. ఈ నిబంధన ప్రకారం మ్యాచ్ సమయంలో ఆటగాడు, సపోర్ట్ స్టాఫ్, అంపైర్, మ్యాచ్ రిఫరీ లేదా ఇతర వ్యక్తితో అనుచితంగా తాకడం ఉల్లంఘనగా పరిగణిస్తారు. అనిల్ చౌదరి ప్రకారం, వీడియోలో ఆటగాళ్ల మధ్య భౌతిక ఘర్షణ జరిగినట్లు స్పష్టంగా కనిపిస్తోందని,



ఇప్పుడు ఈ వ్యవహారంలో మ్యాచ్ రిఫరీ పాత్ర కీలకంగా మారుతుందని చెప్పారు. మ్యాచ్ రిఫరీ ప్రదీప్ జయప్రకాశన్ ఈ అంశంపై త్వరలో నిర్ణయం తీసుకునే అవకాశం ఉందని భావిస్తున్నారు. నిర్ణయం ఎలా తీసుకుంటారు? ఈ ఘటన వెనుక అసలు కారణాలు ఏమిటి, దాగడం వెనుక ఉద్దేశపూర్వకంగా జరిగిందా లేదా అనుకోకుండా జరిగిందా, దాన్ని నివారించే అవకాశం ఉందా వంటి అంశాలను మ్యాచ్ రిఫరీ పరిశీలిస్తారు. అంపైర్ల నివేదికను కూడా పరిగణనలోకి తీసుకుంటారు. అలాగే క్రికెట్ రూల్స్ తీవ్రత ఎంత, ఎదుటి ఆటగాడికి గాయమైందా లేదా, వివాదం ఎంతవరకు వెళ్లింది వంటి అంశాలు కూడా తుది నిర్ణయాన్ని ప్రభావితం చేస్తాయి. సూర్యవంశీకి ఎలాంటి శిక్ష పడొచ్చు? అనిల్ చౌదరి అభిప్రాయం ప్రకారం, ఈ ఘటనను ఉల్లంఘనగా నిర్ధారిస్తే వైభవ్ సూర్యవంశీపై మ్యాచ్ ఫీజులో 50 శాతం వరకు జరిమానా విధించే అవకాశం ఉంది. అదనంగా ఒకటి లేదా రెండు డీమెరిట్ పాయింట్లు కూడా ఇవ్వవచ్చు. తక్కువ తీవ్రత కలిగిన కేసుల్లో అధికారిక హెచ్చరిక లేదా మందలింపు విధించే అవకాశమూ ఉంది. ఒక ఆటగాడు 12 నెలల వ్యవధిలో నాలుగు డీమెరిట్ పాయింట్లు సంపాదిస్తే మ్యాచ్‌ల నుంచి సస్పెన్షన్ విధించే అవకాశం ఉంటుంది. అసలు ఏమి జరిగింది? సూపర్ ఓవర్‌లో భారత్-ఏ జట్టుకు 17 పరుగుల లక్ష్యం లభించింది. అయితే సూర్యాంశ్ షెడ్గే, వైభవ్ సూర్యవంశీ జోడీ కేవలం 9 పరుగులు మాత్రమే చేయగలిగింది. దీంతో శ్రీలంక-ఏ జట్టు విజయం సాధించింది. మ్యాచ్ ముగిసిన తర్వాత మైదానం విడిచివెళ్తున్న సమయంలో ఇరు జట్ల ఆటగాళ్ల మధ్య మాటల యుద్ధం జరిగినట్లు సమాచారం. ఆ సమయంలో సూర్యవంశీ ప్రత్యర్థి బౌలర్ వైపు దూసుకెళ్లి, మధ్యలో జోక్యం చేసుకున్న మరో ఆటగాడిని కూడా తోసినట్లు తెలుస్తోంది. పరిస్థితిని అదుపులోకి తెచ్చేందుకు సీనియర్ ఆటగాళ్లు జోక్యం చేసుకోవాల్సి వచ్చింది.



## రెండో వన్డేలో కుల్దీప్ యాదవ్ రీఎంట్రీ..?

అఫ్గానిస్థాన్‌తో మూడు వన్డేల సిరీస్‌లో శుభారంభం చేసిన టీమిండియా మరో ఆసక్తికర పోరుకు సిద్ధమైంది. బుధవారం లక్నో వేదికగా జరగనున్న రెండో వన్డేలో శుభ్‌మన్ గిల్ సారథ్యంలోని భారత జట్టు పర్యాటక అఫ్గానిస్థాన్‌తో అమీతుమీ తేల్చుకోనుంది. ఈ మ్యాచ్‌లో విజయం సాధించి మూడు వన్డేల సిరీస్‌ను ఆఖరి మ్యాచ్ మిగిలి ఉండగానే 2-0తో కైవసం చేసుకోవాలనే పట్టుదలతో టీమిండియా ఉంది. తద్వారా ఆఖరి మ్యాచ్‌లో బెంచ్ బలాన్ని పరీక్షించాలని టీమిండియా మేనేజ్‌మెంట్ భావిస్తోంది. ఈ సిరీస్‌తోనే టీమిండియా వన్డే ప్రపంచకప్ 2027 సన్నాహకాలను ప్రారంభించింది. మెగా టోర్నీకి కావాల్సిన కాంబినేషన్ కోసం ప్రయోగాలు చేస్తామని సిరీస్ ప్రారంభానికి ముందే కెప్టెన్ శుభ్‌మన్ గిల్ స్పష్టం చేశాడు. ఈ క్రమంలోనే రెండో వన్డేలో భారత తుది జట్టులో మార్పులు ఉంటాయనే చర్చ జరుగుతోంది.తొలి మ్యాచ్‌లో సీనియర్ స్పిన్నర్ కుల్దీప్ యాదవ్‌ను కాదని హర్ష్‌దూబేను టీమిండియా ఆడించింది. అతను అరంగేట్ర మ్యాచ్‌లోనే (3/47) మూడు వికెట్లతో సత్తా చాటాడు. ఐపీఎల్ 2026 సీజన్‌లో తీవ్రంగా నిరాశపర్చడం, అఫ్గాన్‌తో ఏకైక టెస్ట్‌లో వికెట్లు తీయకపోవడంతో కుల్దీప్ యాదవ్‌పై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. అరంగేట్ర పేసర్ మానవ్ సుతార్ ఐదు వికెట్లతో సత్తా చాటగా.. కుల్దీప్ యాదవ్ ఆ స్థాయిలో రాణించలేకపోయాడు. కానీ కుల్దీప్ యాదవ్‌కు వన్డేల్లో మంచి రికార్డ్ ఉంది. ఈ క్రమంలోనే అతన్ని రెండో వన్డేల్లో బరిలోకి దించే అవకాశం ఉంది. తొలి వన్డేలో రోహిత్ శర్మ మణికట్టుకు గాయమైంది. మైదానంలోనే చికిత్స తీసుకున్న అతను ఆ తర్వాత ఆట కొనసాగించినా.. శుభ్‌మన్ గిల్‌తో సమన్వయ లోపం కారణంగా రనౌటయ్యాడు. తొడ కండరాల గాయం నుంచి ఇటీవలే కోలుకున్న రోహిత్.. తొలి వన్డేలో చాలా అసౌకర్యంగా కనిపించాడు. దాంతోనే అతను రెండో వన్డే ఆడటంపై సందేహాలు నెలకొన్నాయి. అతనికి విశ్రాంతి ఇస్తే యశస్వి జైస్వాల్ ఓపెనర్‌గా బరిలోకి దిగుతాడు. జైస్వాల్ కూడా చాలా రోజుల నుంచి వన్డే టీమ్‌లో అవకాశం కోసం ఎదురు చూస్తున్నాడు.ధర్మశాల వన్డేలో అరంగేట్రం చేసిన గుర్నూర్ బ్రార్ అద్భుత ప్రదర్శన కనబర్చాడు. మూడు వికెట్లతో అఫ్గాన్ పతనాన్ని శాసించాడు. జట్టులో ఉన్న మరో అన్‌క్యాప్‌డ్ ప్లేయర్ ప్రిన్స్ యాదవ్ ఆఖరి వన్డే వరకు వేచి చూడాల్సిందే. ఒకవేళ అతనికి అవకాశం ఇవ్వాలనుకుంటే గుర్నూర్ బ్రార్, ప్రసిధ్ కృష్ణలో ఒకరు బెంచ్‌కు పరిమితమవుతారు. మిగతా కాంబినేషన్‌లో పెద్దగా మార్పు జరిగే అవకాశం లేదు. అఫ్గాన్‌తో రెండో వన్డేకు భారత తుది జట్టు(అంచనా) శుభ్‌మన్ గిల్(కెప్టెన్), రోహిత్ శర్మ/యశస్వి జైస్వాల్, కేఎల్ రాహుల్, శ్రేయస్ అయ్యర్, ఇషాన్ కిషన్(కీపర్), వాషింగ్టన్ సుందర్, నితీష్ కుమార్ రెడ్డి, హర్ష్‌దూబే, గుర్నూర్ బ్రార్, అర్ష్‌దీప్ సింగ్,ప్రసిధ్ కృష్ణ/ప్రిన్స్ యాదవ్.

### రూ.50కే ఉప్పల్ మ్యాచ్ టికెట్స్..

తెలంగాణలో యువ క్రికెటర్ల ప్రతిభను వెలికితీయడమే లక్ష్యంగా హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్(హెచ్‌సీఏ) నిర్వహిస్తున్న టీజీ20 లీగ్ 2026 తొలి సీజన్‌కు రంగం సిద్ధమైంది. జూన్ 21 నుంచి హైదరాబాద్‌లోని ఉప్పల్ స్టేడియం వేదికగా ఈ టోర్నీకి తెరలేవనుంది. అయితే ఈ టోర్నీకి టాలీవుడ్ స్టార్ హీరో విజయ్ దేవరకొండ బ్రాండ్ అంబాసిడర్‌గా వ్యవహరించనున్నారు. టైటిల్ స్పాన్సర్‌షిప్‌ను శ్రీనిధి యూనివర్సిటీ దక్కించుకుంది. లీగ్ ప్రారంభానికి సమయం దగ్గరపడటంతో అభిమానులను ఆకర్షించడానికి హెచ్‌సీఏ, ఫ్రాంచైజీలు క్యాంపైన్‌ను నిర్వహిస్తున్నాయి. తెలంగాణలో యువ క్రికెటర్ల ప్రతిభను వెలికితీయడమే లక్ష్యంగా హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్(హెచ్‌సీఏ) నిర్వహిస్తున్న టీజీ20 లీగ్ 2026 తొలి సీజన్‌కు రంగం సిద్ధమైంది. జూన్ 21 నుంచి హైదరాబాద్‌లోని ఉప్పల్ స్టేడియం వేదికగా ఈ టోర్నీకి తెరలేవనుంది. అయితే ఈ టోర్నీకి టాలీవుడ్ స్టార్ హీరో విజయ్ దేవరకొండ బ్రాండ్ అంబాసిడర్‌గా వ్యవహరించనున్నారు. టైటిల్ స్పాన్సర్‌షిప్‌ను శ్రీనిధి యూనివర్సిటీ దక్కించుకుంది. లీగ్ ప్రారంభానికి సమయం దగ్గరపడటంతో అభిమానులను ఆకర్షించడానికి హెచ్‌సీఏ, ఫ్రాంచైజీలు క్యాంపైన్‌ను నిర్వహిస్తున్నాయి.ఈ టోర్నీలో 8 జట్లు ఇతర టీమ్స్‌తో ఒక్కో మ్యాచ్ ఆడనున్నాయి.

## శ్రీలంక ఆటగాళ్లే హద్దులు దాటారు..

### వైభవ్‌కు అండగా నిలిచిన తిలక్ వర్మ

టీమిండియా టీనేజ్ సెన్సేషన్ వైభవ్ సూర్యవంశీ తీవ్ర విమర్శలు ఎదుర్కొంటున్నాడు. ముక్కోణపు వన్డే సిరీస్‌లో భాగంగా శ్రీలంకతో ఏతో మంగళవారం జరిగిన మ్యాచ్‌లో వైభవ్ సూర్యవంశీ సహనం కోల్పోయి ప్రత్యర్థి ఆటగాళ్లతో గొడవకు దిగిన సంగతి తెలిసిందే. ఉత్కంఠగా సాగిన ఈ మ్యాచ్‌లో భారత్-ఏ సూపర్ ఓవర్‌లో ఓటమిపాలైంది. సూపర్ ఓవర్ ముగిసిన అనంతరం బయటకు వెళ్లే సమయంలో వైభవ్ సూర్యవంశీని శ్రీలంక ఆటగాళ్లు ఏదో అనగా.. అతను వారిపైకి దూసుకెళ్లాడు. ఓ ఆటగాడిని తన చేతులతో నెట్టేసాడు. అంపైర్లు, శ్రీలంక వికెట్ కీపర్ జోక్యం చేసుకొని ఇద్దర్ని విడదీసారు. ఈ ఘటన నేపథ్యంలో వైభవ్ సూర్యవంశీపై ఐసీసీ చర్యలు తీసుకునే అవకాశం ఉంది.మరోవైపు 15 ఏళ్ల వయసులోనే సహనం కోల్పోయి ప్రత్యర్థి ఆటగాళ్లతో గొడవపడిన వైభవ్ సూర్యవంశీని మాజీ క్రికెటర్లు తప్పుబట్టారు. ఇలాంటి వాటికి దూరంగా ఉండి ఆటపై ఫోకస్ పెట్టాలని హితవు పలికారు.అయితే ఈ విమర్శల నేపథ్యంలో కొందరు ఆకతాయిలు.. వైభవ్ సూర్యవంశీకి అండగా ఫేక్ పోస్ట్‌లు క్రియేట్ చేసి వైరల్ చేశారు. భారత్-ఏ కెప్టెన్ తిలక్ వర్మ అండగా నిలిచినట్లు ఓ ఫేక్ వార్త సృష్టించారు. ఈ మ్యాచ్ అనంతరం బ్రాడ్‌కాస్టర్‌తో మాట్లాడుతూ తిలక్ వర్మ.. వైభవ్ సూర్యవంశీకి అండగా నిలిచాడనేది ఆ వార్త. ఈ పోస్ట్ ప్రకారం.. 'మ్యాచ్ ఆసాంతం శ్రీలంక ఆటగాళ్లు మమ్మల్ని నిరంతరం దూషిస్తూనే ఉన్నారు. చివరకు అంపైర్లు కూడా కొన్ని నిర్ణయాలు వారికి అనుకూలంగా తీసుకున్నారు. మేం వాటన్నింటినీ పట్టించుకోకుండా ఆటపై మాత్రమే ఫోకస్ పెట్టాం. కానీ, వైభవ్ డ్రెస్సింగ్ రూమ్‌కు తిరిగి వెళ్తున్న సమయంలో శ్రీలంక ఆటగాళ్లలో ఒకరు అనవసరంగా అతన్ని దూషించాడు. అది హద్దులు దాటడమే. దానికి వైభవ్ సూర్యవంశీ గట్టిగా బదులిచ్చాడు. అతను చేసింది సరైన పనే'అని తిలక్ వర్మ అన్నట్లుగా ఫేక్ పోస్ట్‌ను క్రియేట్ చేశారు. అయితే ఈ మ్యాచ్ అనంతరం తిలక్ వర్మ ఏ బ్రాడ్‌కాస్టర్‌తో మాట్లాడలేదు. వైభవ్ సూర్యవంశీ గొడవ గురించి కూడా మాట్లాడలేదు. కానీ ఇది నిజమేనని పొరబడి కొందరు నెటిజన్లు ఈ పోస్ట్‌ను షేర్ చేస్తున్నారు.తిలక్ వర్మనే కాకుండా అతని చిన్న నాటి కోచ్ కూడా వైభవ్ సూర్యవంశీకి అండగా మాట్లాడినట్లు కూడా ఫేక్ పోస్ట్ క్రియేట్ చేశారు. 'నేను వైభవ్ సూర్యవంశీకి ఏడేళ్ల వయసు ఉన్నప్పటి నుంచి కోచింగ్ ఇస్తున్నాను. అతని ప్రవర్తన గురించి నాకు బాగా తెలుసు. అసలు ఏం జరిగిందో తెలుసుకోకుండానే ప్రజలు అతనిపై ఒక నిర్ణయానికి వచ్చేస్తున్నారు. నిన్న రాత్రి నేను వైభవ్‌తో మాట్లాడాను. మ్యాచ్ ఆసాంతం శ్రీలంక ఆటగాళ్లు తనను నిరంతరం దూషించారని, చివరికి తనపై వ్యక్తిగత వ్యాఖ్యలు కూడా చేశారని అతను నాతో చెప్పాడు. అతను చాలా సేపటి వరకు ప్రశాంతంగానే ఉన్నాడు, కానీ ఎవరికైనా ఒక పరిమితి ఉంటుంది. పదే పదే రెచ్చగొట్టడం వల్లే అతను అలా స్పందించాల్సి వచ్చింది. అతనిని విమర్శించే బదులు, మనం అతనికి అండగా నిలవాలి.



## భారత 'ఏ' జట్టులోకి అశోక్ శర్మ

శ్రీలంకలో జరుగుతున్న ముక్కోణపు సిరీస్‌లో భారత 'ఏ' జట్టులోకి గుజరాత్ టైటాన్స్ పేసర్ అశోక్ శర్మ ఎంపికయ్యాడు. భుజం గాయంతో టోర్నీకి దూరమైన యుధ్వీర్ సింగ్ స్థానంలో బీసీసీఐ ఇతడిని ఎంపిక చేసింది. ఐపీఎల్ 2026లో గంటకు 154.2 కిలోమీటర్ల వేగంతో బౌలింగ్ చేసి అశోక్ శర్మ అందరి దృష్టిని ఆకర్షించాడు. జూన్ 17న అఫ్ఘానిస్థాన్ 'ఏ' జట్టుతో జరగబోయే కీలక మ్యాచులో ఇతడు బరిలోకి దిగే అవకాశం ఉంది. శ్రీలంకలో ముక్కోణపు సిరీస్ ఆడుతున్న భారత- ఏ జట్టులోకి కొత్త ప్లేయర్ చేరనున్నాడు. ఈ మేరకు గాయపడిన యధ్వీర్ సింగ్ స్థానంలో గుజరాత్ టైటాన్స్ పేసర్ అశోక్ శర్మ ను బీసీసీఐ ఎంపిక చేసింది. దీంతో అతడు తక్షణమే శ్రీలంకకు బయలుదేరి వెళ్లనున్నాడు. ఇప్పటికే ఈ ట్రై సిరీస్‌లో మూడు మ్యాచులలో రెండు ఓటములతో భారత్-ఏ ఫైనల్ అవకాశాలను సంక్లిష్టం చేసుకుంది. ఇలాంటి సమయంలో అశోక్ శర్మ చేరిక జట్టుగా బలంగా మారుతుందని విశ్లేషకులు అంచనా వేస్తున్నారు. ఇటీవల ముగిసిన ఐపీఎల్ 2026 సీజన్ వ్యూయర్‌షిప్‌లో సరికొత్త చరిత్ర సృష్టించింది. టీవీ, డిజిటల్ వేదికలపై కలిపి ఏకంగా 120 కోట్ల మంది ఈ లీగ్‌ను వీక్షించినట్లు అధికారిక ప్రసారకర్త 'జియో హాట్‌స్టార్' వెల్లడించింది. ఆర్‌సీబీ వరుసగా రెండోసారి టైటిల్ గెలిచిన గుజరాత్ టైటాన్స్‌తో జరిగిన ఫైనల్ మ్యాచ్‌ను రికార్డు స్థాయిలో 40 కోట్ల మంది వీక్షించారు. డిజిటల్ వేదికలపై ప్రాంతీయ భాషల కంటెంట్ వాటా ఏకంగా 33% పెరిగింది. ఇటీవల ముగిసిన ఐపీఎల్ 2026 సీజన్ వ్యూయర్‌షిప్‌లో సరికొత్త చరిత్ర సృష్టించింది. టీవీ, డిజిటల్ వేదికలపై కలిపి ఏకంగా 120 కోట్ల మంది ఈ లీగ్‌ను వీక్షించినట్లు అధికారిక ప్రసారకర్త 'జియో హాట్‌స్టార్' వెల్లడించింది. ఆర్‌సీబీ వరుసగా రెండోసారి టైటిల్ గెలిచిన గుజరాత్ టైటాన్స్‌తో జరిగిన ఫైనల్ మ్యాచ్‌ను రికార్డు స్థాయిలో 40 కోట్ల మంది వీక్షించారు. డిజిటల్ వేదికలపై ప్రాంతీయ భాషల కంటెంట్ వాటా ఏకంగా 33% పెరిగింది. ఇటీవల ముగిసిన ఐపీఎల్ 2026 సీజన్ వ్యూయర్‌షిప్‌లో సరికొత్త చరిత్ర సృష్టించింది. టీవీ, డిజిటల్ వేదికలపై కలిపి ఏకంగా 120 కోట్ల మంది ఈ లీగ్‌ను వీక్షించినట్లు అధికారిక ప్రసారకర్త 'జియో హాట్‌స్టార్' వెల్లడించింది. ఆర్‌సీబీ వరుసగా రెండోసారి టైటిల్ గెలిచిన గుజరాత్ టైటాన్స్‌తో జరిగిన ఫైనల్ మ్యాచ్‌ను రికార్డు స్థాయిలో 40 కోట్ల మంది వీక్షించారు. డిజిటల్ వేదికలపై ప్రాంతీయ భాషల కంటెంట్ వాటా ఏకంగా 33% పెరిగింది. ఇటీవల ముగిసిన ఐపీఎల్ 2026 సీజన్ వ్యూయర్‌షిప్‌లో సరికొత్త చరిత్ర సృష్టించింది. టీవీ, డిజిటల్ వేదికలపై కలిపి ఏకంగా 120 కోట్ల మంది ఈ లీగ్‌ను వీక్షించినట్లు అధికారిక ప్రసారకర్త 'జియో హాట్‌స్టార్' వెల్లడించింది. ఆర్‌సీబీ వరుసగా రెండోసారి టైటిల్ గెలిచిన గుజరాత్ టైటాన్స్‌తో జరిగిన ఫైనల్ మ్యాచ్‌ను రికార్డు స్థాయిలో 40 కోట్ల మంది వీక్షించారు. డిజిటల్ వేదికలపై ప్రాంతీయ భాషల కంటెంట్ వాటా ఏకంగా 33% పెరిగింది. ఈ సిరీస్‌లో భాగంగా జూన్ 17 అంటే బుధవారం భారత-ఏ జట్టు.. అఫ్ఘానిస్థాన్-ఏ జట్టుతో తలపడనుంది. ఈ మ్యాచులో టీమిండియా తరఫున అశోక్ శర్మ బరిలోకి దిగే అవకాశం ఉంది. అశోక్ వర్మ ఐపీఎల్ 2026లో గుజరాత్ టైటాన్స్ తరఫున ప్రాతినిధ్యం వహించాడు. ఈ సీజన్‌లో అశోక్ వర్మ గంటకు 154.2 కిలోమీటర్ల వేగంతో బంతులు విసిరి అందరి దృష్టిని ఆకర్షించాడు. అయితే ఐపీఎల్ 2026లో అతడు ధారాళంగా పరుగులు సమర్పించుకున్నాడు. ఈ సీజన్‌లో ఆరు మ్యాచులు ఆడిన అతడు.. మొత్తంగా 21 ఓవర్లు వేశాడు. 6 వికెట్లు తీశాడు. అయితే సుమారుగా ఓవర్‌కు 11 రన్స్ చొప్పున అతడు సమర్పించున్నాడు. అయినప్పటికీ అతడిపై భారత సెలక్టర్లు విశ్వాసం ఉంచారు. తన వేగంతో ప్రత్యర్థి బ్యాటర్లను ఇబ్బంది పెట్టగలడని భావించారు. అందుకే యుధ్వీర్ సింగ్ ప్లేసులో తీసుకున్నారు.యుధ్వీర్ సింగ్ భుజం గాయంతో ట్రై సిరీస్‌లో టీమిండియా-ఏ తరఫున ఒక్క మ్యాచ్ కూడా ఆడలేకపోయాడు. ప్రాక్టీస్ సమయంలో బౌలింగ్ వేయడంలో ఇబ్బంది పడిన యధ్వీర్ బెంచ్‌కే పరిమితమయ్యాడు. దీంతో అతడి స్థానంలో అశోక్ శర్మకు చోటు లభించింది. యుధ్వీర్ బెంగళూరులోని బీసీసీఐ సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్‌కు వెళ్లనున్నాడు.

## న్యూజిలాండ్‌తో డ్రా చేసుకున్న ఇరాన్

### ఈజిప్ట్‌తో 1-1తో డ్రా అయిన బెల్జియం
### సౌదీ అరేబియా, ఉరుగ్వే మ్యాచ్ డ్రా

ఫిఫా వరల్డ్‌కప్ 2026లో తొలి మ్యాచ్‌ల నుంచే అనూహ్య ఫలితాలు నమోదవుతున్నాయి. సోమవారం మూడు మ్యాచ్?లు జరగ్గా, అన్నీ కూడా డ్రానే అయ్యాయి. అయితే ఈ మెగా టోర్నీకి ముందు రాజకీయ వివాదాలు, నిరసనలతో వార్తల్లో నిలిచిన ఇరాన్ జట్టు, మైదానంలోనూ తీవ్ర ఒత్తిడిని ఎదుర్కొంది. ప్రపంచకప్‌లో అట్టడుగు ర్యాంక్‌లో ఉన్న న్యూజిలాండ్‌తో ఇరాన్ 2-2తో డ్రా కావడంతో నాకౌట్ అవకాశాలకు తొలి మ్యాచ్‌లోనే ఎదురుదెబ్బ తగిలింది. మరోవైపు బెల్జియం, ఉరుగ్వే వంటి జట్లు కూడా తమ తొలి మ్యాచ్‌ల్లో విజయం సాధించలేకపోయాయి.లాస్ ఏంజెలెస్‌లో జరిగిన గ్రూప్-జి మ్యాచ్‌లో ఇరాన్ రెండుసార్లు వెనుకబడినా పోరాడి 2-2తో డ్రా చేసుకుంది. మ్యాచ్ ఏడో నిమిషంలోనే న్యూజిలాండ్ ఆధిక్యంలోకి వెళ్లింది. క్రిస్ వుడ్ ఇచ్చిన పాస్‌ను ఎలిజా జస్ట్ అద్భుతంగా గోల్‌గా మలిచాడు. ఆరంభ షాక్ నుంచి కోలుకున్న ఇరాన్ ఎటాక్ పెంచింది. స్టార్ ఫార్వర్డ్ మెహదీ తారెమీ చేసిన ప్రయత్నం పోస్టును తాకి బయటకు వెళ్లింది. చివరకు 32వ నిమిషంలో రామిన్ రెజాయియాన్ సమం చేశాడు. అయితే ఆ తర్వాత మరోసారి ఎలిజా జస్ట్ గోల్ చేసి న్యూజిలాండ్‌కు ఆధిక్యం అందించాడు. ఇరాన్ ఓటమి దిశగా సాగుతున్న సమయంలో మహమ్మద్ మొహేబీ 64వ నిమిషంలో హెడ్డర్‌తో గోల్ చేసి స్కోరును 2-2గా మార్చాడు. చివరి అరగంటపాటు ఇరాన్ ఎటాక్స్ చేసినా విజయం అందుకోలేకపోయింది. దీంతో ప్రపంచకప్ నాకౌట్ దశకు తొలిసారి చేరాలన్న ఇరాన్ ఆశలకు తొలి మ్యాచ్‌లోనే గట్టి దెబ్బ



తగిలింది. ఇరాన్ మ్యాచ్‌కు ముందు, తర్వాత రాజకీయ ఉద్రిక్తతలు చోటుచేసుకున్నాయి. ఇరాన్ ప్రభుత్వానికి వ్యతిరేకంగా వందలాది మంది నిరసనకారులు స్టేడియం వెలుపల ఆందోళనలు నిర్వహించారు. ఆ జట్టు ప్రజలకు ప్రాతినిధ్యం వహించడం లేదని వారు ఆరోపించారు. స్టేడియం లోపల కూడా అభిమానులు ఫిఫా నిబంధనలను ధిక్కరిస్తూ ఆందోళనలకు ముందు ఉపయోగించిన ఇరాన్ జెండాలను ప్రదర్శించారు. టీషర్టులు, బ్యానర్లు, జెండాల రూపంలో అవి కనిపించాయి. జాతీయ గీతం వినిపించినప్పుడు కొందరు అభిమానులు వెనుదిరిగి నిలబడగా, మరికొందరు నినాదాలు చేశారు. భద్రతా సిబ్బంది కొన్ని చోట్ల ఆంక్షలు విధించినప్పటికీ, మ్యాచ్ మొత్తం రాజకీయ సందేశాలు కనిపించాయి. సియాటెల్‌లో జరిగిన మరో గ్రూప్-జి పోరులో బెల్జియం, ఈజిప్ట్ 1-1తో డ్రా అయ్యాయి. మొహమ్మద్ సలాహ్ పాస్‌ను అందుకున్న ఎమామ్ అషూర్ 19వ నిమిషంలో గోల్ చేసి ఈజిప్ట్‌కు ఆధిక్యం అందించాడు. దీంతో ప్రపంచకప్‌లో తొలి విజయంపై ఈజిప్ట్ ఆశలు చిగురించాయి. మ్యాచ్ అంతా బెల్జియం ఆధిపత్యం ప్రదర్శించినా అవకాశాలను గోల్స్‌గా మలచలేకపోయింది. 65వ నిమిషంలో రొమెలు లుకాకు మైదానంలోకి అడుగుపెట్టిన కేవలం 22 సెకన్లకే ప్రభావం చూపించాడు. థామస్ మునియర్ ఇచ్చిన క్రాస్‌ను అడ్డుకునే క్రమంలో ఈజిప్ట్ ఆటగాడు మహ్మద్ హానీ గోల్ చేయడంతో బెల్జియం సమం చేసింది. చివరి నిమిషాల్లో ఇరు జట్లు విజయం కోసం ప్రయత్నించినా స్కోరు మారలేదు. దీంతో ప్రపంచకప్‌లో తొలి విజయాన్ని అందుకోవాలన్న ఈజిప్ట్ కల మరోసారి నెరవేరలేదు. మయామిలో జరిగిన గ్రూప్-హెచ్ మ్యాచ్‌లో ఉరుగ్వే 1-1తో సౌదీ అరేబియాతో డ్రా అయింది. మ్యాచ్ ప్రారంభం నుంచే ఉరుగ్వే బంతిపై ఆధిపత్యం ప్రదర్శించినా గోల్ చేయలేకపోయింది. 41వ నిమిషంలో అబ్దులెలాహ్ అల్ అమ్రీ గోల్‌తో సౌదీ అరేబియా ఆధిక్యంలోకి వెళ్లింది. రెండో అర్ధభాగంలో ఉరుగ్వే స్పీడ్ పెంచింది. ఫెడెరికో వాల్వెర్డే, ఫెడెరికో వినాస్ పలుమార్లు అవకాశాలు సృష్టించినా సౌదీ గోల్‌కీపర్ మహ్మద్ అల్ ఓవైస్ అద్భుత సేవ్‌లతో నిలిచాడు. అయితే 80వ నిమిషంలో వినాస్ హెడ్డర్‌ను అడ్డుకున్న గోల్‌కీపర్ నుంచి వచ్చిన రీబౌండ్‌ను మాక్సిమిలియానో అరౌజో గోల్‌గా మలిచి ఉరుగ్వేకు ఊరటనిచ్చాడు. మ్యాచ్ ముగిసే సరికి ఇరు జట్లు చెరో పాయింట్‌తో సరిపెట్టుకున్నాయి.

# విశ్వాజి



## పవర్ హౌస్ ఎనర్జీ కోసం వీటిని తప్పకుండా తినండి!

భారతీయ వంటకాల్లో రొయ్యలకు ప్రత్యేక స్థానం ఉంది. వాటి రుచి, పోషక విలువలతో ఎంతోమందికి రొయ్యలు అంటే బాగా ఇష్టం ఉంటుంది. రొయ్యలు రోగనిరోధక శక్తిని పెంచే కీలకమైన పోషకాలతో నిండి ఉంటాయి. రొయ్యల్లో అధిక స్థాయిలో ప్రోటీన్లు, విటమిన్లు, ఖనిజాలు ఉంటాయి. అందుకే, ఆరోగ్యంపై శ్రద్ధ ఉన్నవారికి ఇవి ఆహారంలో మంచి ఎంపిక. ప్రోటీన్ పుష్కలంగా మనం ఆరోగ్యంగా ఉండాలంటే మన శరీరానికి కావలసినంత ప్రోటీన్ ఉండాలి. శరీర కణజాల నిర్మాణానికి, వాటి మరమ్మతులకు ప్రోటీన్ చాలా అవసరం. రొయ్యల్లో పుష్కలంగా ప్రోటీన్ లభిస్తుంది. ఇది కండరాలను బలోపేతం చేయడానికి, శరీర పనితీరును మెరుగుపరచడానికి ఉపయోగపడుతుంది. మీ రోజువారీ ప్రోటీన్ అవసరాలను తీర్చడానికి రొయ్యలు చాలా బాగా పనిచేస్తాయి. విటమిన్లు మరియు ఖనిజాలు విటమిన్ 12, విటమిన్ ఈ, ఖనిజాలు, యాంటీ ఆక్సిడెంట్లు, ఒమేగా 3 ఫ్యాటీ యాసిడ్, రొయ్యల్లో పుష్కలంగా ఉంటాయి. ఇవి నాడీ వ్యవస్థ సరిగ్గా పనిచేయడానికి, డీఎన్ఏ ఉత్పత్తికి తోడ్పడతాయి. శరీర కణాలను దెబ్బతినకుండా కాపాడే యాంటీఆక్సిడెంట్ విటమిన్ %జు% కూడా వీటిలో ఉంటుంది. అలాగే జింక్, సెలీనియం వంటి ఖనిజాలు రోగనిరోధక శక్తిని పెంచడంలో కీలక పాత్ర పోషిస్తాయి. తక్కువ కేలరీలు బరువు తగ్గాలనుకునే వారికి లేదా తక్కువ కేలరీల ఆహారం తీసుకునే వారికి రొయ్యలు మంచి ఆహారంగా చెప్పొచ్చు. ఇవి అధిక కేలరీలను జోడించకుండానే శరీరానికి అవసరమైన పోషకాలను అందిస్తాయి. పోషకాల లోపం లేకుండా బరువును అదుపులో ఉంచుకోవడానికి రొయ్యలు ఎంతగానో ఉపయోగపడతాయి. ఒమేగా-3 ఫ్యాటీ యాసిడ్లు గుండె ఆరోగ్యానికి మేలు చేసే ఒమేగా-3 ఫ్యాటీ యాసిడ్లు రొయ్యల్లో ఉంటాయి. ఈ ఆరోగ్యకరమైన కొవ్వులు శరీరంలో మంటను తగ్గించి గుండె జబ్బుల ప్రమాదాన్ని తగ్గిస్తాయి. ఆహారంలో రొయ్యలను చేర్చుకోవడం ద్వారా గుండె ఆరోగ్యాన్ని మెరుగుపరచుకోవచ్చు. రొయ్యలను అనేక రకాల వంటకాల్లో ఉపయోగించవచ్చు. కూరల నుండి సలాడ్‌ల వరకు వీటిని ఎన్నో రకాలుగా చేయవచ్చు. వీటితో కిడ్నీలు క్లీన్‌గా, ఆరోగ్యంగా సులభంగా చేసుకోగలిగిన ఆహారాలలో రొయ్యలు ఒకటి అవి త్వరగా ఉడికిపోతాయి కాబట్టి, బిజీగా ఉండే వ్యక్తులకు పోషకమైన ఆహారాన్ని తక్కువ సమయంలో తయారు చేసుకోవడానికి వీలవుతుంది. భారతీయ వంటకాలలో రొయ్యలను చేర్చడం, వాటి పోషకాలతో మనకు ఆరోగ్య ప్రయోజనాలను అందిస్తాయి. కనుక ఆహారంలో అప్పుడప్పుడు తప్పనిసరిగా రొయ్యలను చేర్చుకోవాలి.

# పొద్దునే ప్రొటీన్ ఫుడ్



పొద్దుననిద్ర లేచిన వేళా విశేషమే రోజంతటినీ నిర్ణయిస్తుంది. పొద్దునే మన టిఫిన్లలో ఇడ్లీ, పోహా, ఉప్మా, ఆలూ పరాఠా లాంటివి ప్రధానంగా ఉంటాయి. ఇవన్నీ కార్బొహైడ్రేట్లతో నిండి ఉంటాయి. కానీ ఆరోగ్యానికి అత్యవసర పోషకమైన ప్రొటీన్ ఉండదు. అయితే, ఉపాహారం నుంచే 20 గ్రాముల ప్రొటీన్ అందేలా చూసుకుంటే మంచిది. అలాగని ప్రొటీన్ పౌడర్ల మీద ఆధారపడకూడదు. ఆహారంలో కొన్ని చిన్న మార్పులు చేసుకుంటే సరిపోతుంది. పొద్దునే ఆరగించడానికి ప్రొటీన్లతో సమృద్ధమైన టిఫిన్లు కొన్నిటి గురించి తెలుసుకుందాం. శరీర విధులు సాఫీగా సాగాలంటే ప్రొటీన్లు సమృద్ధిగా ఉన్న ఆహారం తీసుకోవాలి. శరీర కణజాలం, కండరాలు, ఎముకలు, చర్మం, వెంట్రుకలు, గోళ్ల నిర్మాణంలో ప్రొటీన్లు కీలకంగా నిలుస్తాయి. ఎంజైముల విడుదలలో ఇవి కీలకపాత్ర పోషిస్తాయి. అంతేకాదు ప్రొటీన్లు మన రోగ నిరోధక వ్యవస్థలో అంతర్భాగం. ప్రొటీన్లు తీసుకుంటూ తగినంత వ్యాయామం చేస్తే ఆరోగ్యకరమైన జీవితం సొంతమవుతుంది. ప్రొటీన్లు శరీరానికి మాత్రమే కాదు మెదడు పనితీరుకు కూడా అండగా నిలుస్తాయి.

పల్లీలు కూరగాయలతో క్వినోవా ఉప్మా

ఓ కప్పు క్వినోవాలో 8 గ్రాముల ప్రొటీన్లు ఉంటాయి. దీనికి కూరగాయలు, కరివేపాకు, ఓ టేబుల్ స్పూన్ వేయించిన పల్లీలు, పచ్చి బఠాణీలు కలపాలి. ఉడికించిన శనగలతో సలాడ్ తీసుకుంటే మొత్తం 22 గ్రాముల ప్రొటీన్లు దొరుకుతాయి. ఒక్క క్వినోవా ఉప్మా, కూరగాయలు, పల్లీల నుంచే 17 గ్రాముల ప్రొటీన్లు లభిస్తాయి. శనగపిండి టోస్ట్, టోఫు బుర్జీ.. రెండు బ్రెడ్ పకోడీలు (శనగపిండితో చేసినవి) తీసుకోవాలి. దీనికి 75 గ్రాముల టోఫు బుర్జీ జతచేయాలి. టమాటాలు, పసుపు, జీలకర్ర కలపాలి. దీని ద్వారా 23 గ్రాముల ప్రొటీన్లు లభిస్తాయి. రాజ్మా పరాఠా, కప్పు పెరుగు.. మామూలుగా రాజ్మా లంచ్‌కే అనుకుంటారు. కానీ ఓ కప్పు రాజ్మాను ఉడికించి ముద్దగా చేసుకోవాలి. దాన్ని పరాఠా స్టఫ్‌గా వాడుకోవాలి. ఇలా చేస్తే 15 గ్రాముల ప్రొటీన్ దొరుకుతుంది. దీన్ని పుదీనా, సైంధవ లవణం కలిపిన హంగ్ కర్డ్ (నీళ్లు తీసేసిన పెరుగు)లో అద్దుకుని తినేయాలి. సత్తు పరాఠా, ఉడికించిన గుడ్డు, బటర్ మిల్క్.. సత్తు అంటే వేసవి పానీయం మాత్రమే కాదు. 100 గ్రాముల సత్తులో 20 గ్రాముల ప్రొటీన్లు ఉంటాయి. కాబట్టి, కొద్దిగా నెయ్యి వేసి సత్తు పరాఠా చేసుకోవాలి. తినే వాళ్లయితే దీంతోపాటు ఓ ఉడికించిన గుడ్డు తినాలి. గ్లాసెడు బటర్ మిల్క్ తాగాలి. రెండు మోస్తరు సత్తు పరాఠాల నుంచి 14 గ్రాములు, ఉడికించిన గుడ్డు నుంచి 6 గ్రాములు, బటర్‌మిల్క్ నుంచి 2 గ్రాములు.. మొత్తంగా 22 గ్రాముల ప్రొటీన్లు లభిస్తాయి.

మూంగ్‌దాల్ చిల్లా పనీర్ ఫిల్లింగ్

ఒక్కో చిల్లా (దోశ లాంటిది)లో 5 6 గ్రాముల ప్రొటీన్లు ఉంటాయి. వీటిలో నింపే 50 గ్రాముల తురిమిన పనీర్ నుంచి 9 గ్రాముల ప్రొటీన్లు లభిస్తాయి. రెండు చిల్లాలను ఓ కప్పు పెరుగుతో లాగించేయాలి. పెరుగుతో లభించే 5 గ్రాములతో కలుపుకొని మొత్తం 26 గ్రాముల ప్రొటీన్లు లభిస్తాయి. మొలక పెసర్లు ఓట్స్ చీలా ఇది కూడా దోశలా చేసుకునేదే. అరకప్పు ఓట్స్‌లో 5 గ్రాముల ప్రొటీన్ దొరుకుతుంది. దీన్ని ఓ కప్పు పెసర మొలకలతో కలిపితే మరో 14 గ్రాములు లభిస్తాయి. దీనికి కాస్త శనగపిండిని జోడిస్తే మరో 2 గ్రాములు మొత్తంగా 21 గ్రాముల ప్రొటీన్లు దొరుకుతాయి.

## చియా సీడ్స్ తీసుకున్న ఆ తరువాత ఆ పని చేయకపోతే కష్టం



ప్రస్తుతం చియా సీడ్స్ చాలామంది ఆహారంలో ఒక భాగంగా మారాయి. పోషకాల విషయంలో వీటిని సూపర్ ఫుడ్ గా చెప్పుకోవచ్చు. చాలా సులభంగా ఎలాంటి ఆహారంలోనైనా కలుపుకోవచ్చు. గ్రానోలా, స్మూతీస్, పుడ్డింగ్, సలాడ్ డ్రెస్సింగ్, మఫిన్స్, చియా వాటర్ వంటి వాటిలో కూడా వీటిని ఉపయోగించవచ్చు. చియా గింజలను ప్రతిరోజూ తినడం మంచిదేనా? అనే విషయంపై డైటీషియన్లు ఏం చెబుతున్నారో ఇప్పుడు తెలుసుకుందాం. చియా గింజలు అంటే ఏమిటి? చియా సీడ్స్.. ఆస్ట్రేలియా, లాటిన్ అమెరికా, దక్షిణ అమెరికా ప్రాంతాలలో పెరిగే చియా మొక్క నుండి వస్తాయి. చియా సీడ్స్ నీటిని పీల్చుకుని వాటి పరిమాణం కంటే 10 నుండి 12 రెట్లు ఎక్కువగా వ్యాకోచిస్తాయి. వీటి ప్రత్యేకత ఇదే. నీటిలో కరిగే ఫైబర్ అధికంగా ఉండటం వల్లే ఈ సీడ్స్ ఇలా వ్యాకోచిస్తాయి. "వాడిన నూనెను మళ్ళీ వాడుతున్నారా? అయితే హాస్పిటల్ లో బెడ్ కన్ఫర్మ్!" అందుకే చియా సీడ్స్ మొక్కల ఆధారిత లేదా పాల పదార్థాలను చిక్కగా చేసి క్రీమీ పుడ్డింగ్‌గా మారుస్తాయి. చియా సీడ్స్ లలోని ఫైబర్ కారణంగానే ఇవి బరువు తగ్గడానికి, మలబద్ధకం నివారణకు సహాయపడతాయి. చియా గింజల వల్ల కలిగే ఆరోగ్య ప్రయోజనాలు ఏమిటి? చియా గింజల్లో అనేక ముఖ్యమైన పోషకాలు ఉన్నాయి. ప్రతి పోషకం దాని స్వంత ఆరోగ్య ప్రయోజనాలను అందిస్తుంది. చియా గింజలను ప్రతిరోజూ తినడం సురక్షితమేనా? చియా గింజలను ప్రతిరోజు తినడం సురక్షితమే అయినప్పటికీ, వాటిని తిన్నప్పుడు తగినంత నీరు తాగడం చాలా ముఖ్యం. "ఫైబర్ సాధారణంగా ఆరోగ్యానికి మంచిదే, కానీ ఎక్కువ ఫైబర్ తింటే కొన్నిసార్లు సైడ్ ఎఫెక్ట్స్ వచ్చే అవకాశం ఉంది. దీనివల్ల గ్యాస్, ఉబ్బరం వంటి సమస్యలు వస్తాయి" అని డాక్టర్ బియాస్ హెచ్చరించారు.

## వెనిగర్‌ని వాడేద్దాం

మార్కెట్‌లో దొరికే కూరగాయలు, ఆకుకూరలపై క్రిమిసంహారక మందుల అవశేషాలు ఎక్కువగా ఉంటున్నాయి. ఎంత శుభ్రం చేసినా.. కొన్నిసార్లు అలాగే ఉండిపోతుంటాయి. అలాంటప్పుడు.. వెనిగర్ కలిపిన నీటితో కూరగాయలు, ఆకుకూరలను శుభ్రం చేస్తే మంచి ఫలితం ఉంటుంది. కొత్తిమీర, పుదీనాను వెనిగర్ కలిపిన నీటిలో నానబెడితే.. ఎక్కువ రోజులు తాజాగా ఉంటాయి. వంటలకు పులుపు కావాలంటే.. కొద్దిగా వెనిగర్‌ను వాడుకోవచ్చు. దీనివల్ల వంట రుచి తగ్గకుండా ఉంటుంది. ముఖ్యంగా సలాడ్లు, గ్రేవీ వంటకాల్లో వెనిగర్ బాగా ఉపయోగపడుతుంది. మాంసం మెత్తగా ఉడకాలంటే.. వెనిగర్‌ను వాడాల్సిందే. మాంసానికి కొద్దిగా వెనిగర్ రాయడం వల్ల ముక్కలు మెత్తబడుతాయి. త్వరగా ఉడుకుతాయి. అంతేకాదు.. మాంసంలో ఉండే హానికరమైన బ్యాక్టీరియా, కొవ్వును తొలగించడంలోనూ వెనిగర్ సాయపడుతుంది. వెనిగర్‌తో మాంసం రుచి కూడా పెరుగుతుంది. కేవలం వంటలకు మాత్రమే కాదు.. వంటింటిని శుభ్రం చేయడంలోనూ వెనిగర్ ముందుంటుంది. కూరగాయలు తరిగే బోర్డ్, స్టీల్ పాత్రలు, గాజు వస్తువుల మీది మరకలు, దుమ్ము, నూనె జిడ్డును తొలగించడంలో వెనిగర్ సమర్థంగా పనిచేస్తుంది. నీటిలో కొద్దిగా వెనిగర్ కలిపి.. ఆయా వస్తువులను తుడిస్తే తళతళా మెరిసిపోతాయి. వెనిగర్‌ను సరిగ్గా వాడితే.. వంట పనులు వేగంగా పూర్తవుతాయి.




# మార్కెట్

## విండోస్ 10 యూజర్లకు మైక్రోసాఫ్ట్ గుడ్‌న్యూస్..

### ఇలా చేస్తే మరో ఏడాది అప్‌డేట్స్..!

విండోస్ 10 ఆపరేటింగ్ సిస్టమ్ వాడుతున్న యూజర్లకు అలెర్ట్. ఈ ఏడాది అక్టోబర్ 14 తర్వాత నుంచి మైక్రోసాఫ్ట్ అప్‌డేట్స్, సెక్యూరిటీ ప్యాచ్‌లను నిలిపివేయనున్నట్లు ప్రకటించింది. ఇకపై ఈ ఆపరేటింగ్ సిస్టమ్‌కు సంబంధించి అన్ని సేవలు నిలిచిపోనున్నాయి. అయితే, ఇప్పటికప్పుడు యూజర్లు అందరూ భయపడాల్సిన అవసరమేమీ లేదు. సాధారణ ట్రిక్‌తో సంవత్సరం పాటు సెక్యూరిటీ అప్‌డేట్స్‌ను పొందే అవకాశం ఉన్నది. మైక్రోసాఫ్ట్ విండోస్ 10 యూజర్ల కోసం ఎక్స్‌టెండెడ్ సెక్యూరిటీ అప్‌డేట్స్ పేరుతో ప్రోగ్రామ్‌ను ప్రారంభించింది. ఇప్పటికప్పుడు విండోస్ 11 ఆపరేటింగ్ సిస్టమ్‌కి మారకుండా, హార్డ్‌వేర్ సపోర్ట్ చేయని యూజర్లను దృష్టిలో పెట్టుకొని ఈ ప్రోగ్రామ్‌ను తీసుకు వచ్చింది. వినియోగదారులు ఇందులో వినియోగదారులు సెక్యూరిటీ అప్‌డేట్స్‌ను పొందుతారు. అయితే, కొత్త ఫీచర్లు, టెక్ సపోర్ట్ మాత్రం ఉండదు. అయితే, ఈ సేవలను పొందేందుకు యూజర్లు 30 డాలర్లు (రూ.2500) ఒకేసారి చెల్లించాల్సి ఉంటుంది. పీసీ బ్యాకప్ చేసి ఉంటే.. మైక్రోసాఫ్ట్ రివార్డ్ పాయింట్లు ఉంటే ఈ సేవలను మాత్రం ఉచితంగా పొందే అవకాశం ఉంది. ప్రస్తుతం మీరు వాడుతున్న విండోస్ 10 సిస్టమ్ వాడుతున్న అందరికీ మైక్రోసాఫ్ట్ ఉచితంగానే విండోస్ 11 ఉచితంగా ఇన్‌స్టాల్ చేసుకునేందుకు అవకాశం ఇస్తున్నది. 10 ఓఎస్‌ను కొనసాగించాలనుకునే వారికి ఈఎస్‌యూ తీసుకోవచ్చని టెక్ నిపుణులు పేర్కొంటున్నారు.




## 5 బ్యాంకులు ప్రైవేటీకరణ.. వాటాల విక్రయానికి రంగంలోకి కేంద్రం

బీవోఎం, ఐవోబీ, యూకో తదితర సంస్థలే గురి



న్యూఢిల్లీ : కేంద్రంలో నరేంద్ర మోదీ సర్కారు కొలువుదీరిన దగ్గర్నుంచి దేశంలో ప్రభుత్వ రంగ బ్యాంకుల సంఖ్య క్రమేణా తగ్గిపోతున్నది. కుదిరితే వాటాల విక్రయాలు, కాకపోతే విలీనాలు. ఇదీ.. గత 11 ఏండ్లుగా సాగుతున్న తంతు. ఈ క్రమంలోనే ఇప్పుడు మరో 5 సర్కారీ బ్యాంకుల్లో వాటాల విక్రయానికి కేంద్రం సిద్ధమవుతున్నది. ఇందులో భాగంగానే మంగళవారం ఈ లావాదేవీల కోసం సాంకేతిక, న్యాయపరమైన సలహాదారులను నియమించేందుకు అంతర్గత మంత్రుల బృందం కూడా సమావేశమైనట్టు సమాచారం. ఆర్థిక సేవల శాఖ కార్యదర్శి, పెట్టుబడులు-ప్రభుత్వ ఆస్తుల నిర్వహణ శాఖ (దీపం) కార్యదర్శి తదితరులు ఇందులో పాల్గొన్నట్టు తెలుస్తున్నది. దీంతో ఇక క్షేత్రస్థాయిలో పని మొదలుకానుండగా.. వీలైనంత త్వరలోనే సదరు బ్యాంకుల్లో సర్కారీ వాటాలు తగ్గిపోనున్నాయి. అయితే ఆయా బ్యాంకుల్లో కేంద్రం 20 శాతం వరకు వాటాలను అమ్మకానికి పెట్టే అవకాశాలున్నట్టు తెలుస్తున్నది. ఈ బ్యాంకుల్లోనే.. బ్యాంక్ ఆఫ్ మహారాష్ట్ర (బీవోఎం), ఇండియన్ ఓవర్సీస్ బ్యాంక్ (ఐవోబీ), యూకో బ్యాంక్, సెంట్రల్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, పంజాబ్ అండ్ సింధ్ బ్యాంకుల్లో వాటాల అమ్మకానికి కేంద్ర ప్రభుత్వం రెడీ అవుతున్నది. క్వాలిఫైడ్ ఇన్‌స్టిట్యూషనల్ ప్లేస్‌మెంట్ (క్యూఐపీ), ఆఫర్ ఫర్ సేల్ (ఓఎఫ్ఎస్) పద్ధతుల ద్వారా వాటాలను ప్రభుత్వం విక్రయానికి పెట్టబోతున్నదని సంబంధిత వర్గాలు చెప్తున్నాయి. లావాదేవీల నిర్వహణకు మర్చంట్ బ్యాంకర్ల నియామకం జరిగితే.. నిధుల సమీకరణ ప్రక్రియ మరింత వేగవంతం అవుతుందని పేర్కొంటున్నాయి. వాటాల విలువ, ఎంత వాటా అమ్మేయాలి? కావాల్సిన పత్రాలు, వాటి ద్వారా అనుమతులు తీసుకోవడం ఇవన్నీ చకచకా జరిగిపోనున్నాయి. అన్నీ కుదిరితే ఈ ఆర్థిక సంవత్సరం (2025-26), లేకుంటే ఎలాగైనా వచ్చే ఆర్థిక సంవత్సరం (2026-27) వాటాల అమ్మకాలు కచ్చితంగా ఉంటాయని ప్రభుత్వ ఉన్నత వర్గాల ద్వారా తెలియవస్తున్నది. కాగా, రూ.2,000 కోట్లకు దిగువన ఉండే లావాదేవీలకు కొందరు మర్చంట్ బ్యాంకర్లు, ఆపై విలువైన లావాదేవీలకు మరికొందరిని నియమించవచ్చని అంచనా. ఆ రెండే.. ఇండియన్ ఓవర్సీస్ బ్యాంక్, సెంట్రల్ బ్యాంక్ ఆఫ్ ఇండియాలను ప్రైవేటీకరించాలని మోదీ సర్కారు ఎప్పట్నుంచో ప్రయత్నిస్తున్నది. 2021-22 కేంద్ర బడ్జెట్‌లోనే ఇందుకు ప్రణాళికల్ని కూడా పెట్టింది. కానీ ఇప్పటిదాకా అది కుదరలేదు. దీంతో త్వరలో రాబోయే వాటాల ఉపసంహరణలో ముందుగా ఈ రెండింటినే ప్రైవేటీకరణ దిశగా ముందుకు జరుపాలని కేంద్ర ప్రభుత్వం చూస్తున్నట్టు చెప్తున్నారు. ఇప్పటికే ఐడీబీఐ బ్యాంక్‌ను ప్రైవేట్‌పరం చేయాలని చూస్తుండగా, ప్రభుత్వ రంగ బీమా సంస్థ ఎల్ఐసీ ద్వారా కేంద్రం పావులు కదుపుతున్న సంగతి విదితమే. బ్యాంక్‌లో ఎల్ఐసీతో ప్రభుత్వ వాటాను కొనిపించినది తెలిసిందే. ఈ క్రమంలో ఆ వాటాలను అమ్మేందుకు తీవ్రంగా కసరత్తులు చేస్తున్నదీ చూస్తూనే ఉన్నాం. ఇక అంతకు ముందు ఆయా ప్రభుత్వ బ్యాంకులను ఎస్బీఐ, మరికొన్నింటిలో విలీనం చేసినదీ విదితమే.

## టాప్‌గేర్‌లో ఈవీల విక్రయాలు.. జూన్‌లో 28 శాతం వృద్ధి : ఫాడా వెల్లడి



ముంబై : దేశవ్యాప్తంగా ఎలక్ట్రిక్ వాహనాలకు ప్రజల నుంచి విశేషస్పందన లభిస్తున్నది. గత నెలలో దేశీయంగా 1.80 లక్షల యూనిట్ల ఎలక్ట్రిక్ వాహనాలు అమ్ముడయ్యాయి. క్రితం ఏడాది ఇదే నెలలో అమ్ముడైన వాహనాలతో పోలిస్తే 28.60 శాతం అధికమని ఫెడరేషన్ ఆఫ్ ఆటోమొబైల్ డీలర్ల అసోసియేషన్ (ఫాడా) తాజాగా వెల్లడించింది. ఈ-ప్యాసింజర్ వాహనాలకు డిమాండ్ అధికంగా ఉండటం ఇందుకు కారణమని తెలిపింది. ఎలక్ట్రిక్ ప్యాసింజర్ వాహన అమ్మకాలు 7,323 యూనిట్ల నుంచి 13,178 యూనిట్లకు చేరుకున్నాయి. మొత్తం వాహన విక్రయాల్లో ప్యాసింజర్ వాహనాల వాటా 4.4 శాతానికి ఎగబాకింది. అలాగే 60, 550 యూనిట్ల ఎలక్ట్రిక్ త్రి-చక్ర వాహనాలు కాగా, 1,05,355 యూనిట్ల ద్విచక్ర వాహనాలు అమ్ముడయ్యాయి. కమర్షియల్ వాహనాలు ఏడాది ప్రాతిపదికన రెండింతలు పెరిగి 1,146 యూనిట్లకు చేరుకున్నాయి. పెట్రోల్ ధరలు గరిష్ఠ స్థాయిలో ఉండటంతో వాహన కొనుగోలుదారులు ఈవీలపై ఆసక్తి చూపుతున్నారని, అలాగే కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన ప్రత్యేక స్కీంలు కూడా ఆకట్టుకుంటున్నాయని ఫాడా ప్రెసిడెంట్ సీఎస్ విఘ్నేశ్వర్ తెలిపారు. చార్జింగ్ స్టేషన్లు అత్యధికంగా ఏర్పాటుకావడంతో చార్జింగ్ ఇబ్బందులు కూడా లేకుండా పోయాయన్నారు.

# ఆంధ్రప్రదేశ్

## రొయ్యల ఫీడ్ ధరలు పెంచేది లేదు

**అనుమతి లేకుండా పెంచితే కఠిన చర్యలు**

**గొడ్డలిపార్టీ ప్రతిదీ రాజకీయం చేస్తోందని ఆగ్రహం**

**ఏపీ వ్యవసాయ శాఖ మంత్రి అచ్చెన్నాయుడు**

పార్వతీపురం,జూన్16 : అనుమతి లేకుండా ఫీడ్ ధరలు పెంచితే ఊరుకునేది లేదని ఏపీ వ్యవసాయ శాఖ మంత్రి అచ్చెన్నాయుడు హెచ్చరించారు. అనుమతి లేకుండా ఫీడ్ ధరలు పెంచడాన్ని నిలిపివేశామని స్పష్టం చేశారు. మంగళవారం పార్వతీపురం మన్యం జిల్లాలో పర్యటించి, పలు కార్యక్రమాల్లో మంత్రి పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి అచ్చెన్నాయుడు మాట్లాడారు. ప్రతి చిన్న అంశాన్ని రాజకీయం చేయడం గొడ్డలి పార్టీ అధ్యక్షుడు జగన్ రెడ్డి నైజమని మంత్రి అచ్చెన్నాయుడు ఎద్దేవా చేశారు. వైసీపీ హయాంలో విద్యుత్ సబ్సిడీ కేవలం రూ.750 కోట్లు ఇచ్చారని అన్నారు. కూటమి ప్రభుత్వం రొయ్యల రైతులకు ఏడాదికి రూ.1,170 కోట్ల విద్యుత్ సబ్సిడీ ఇస్తుందని స్పష్టం చేశారు. సోయాబీన్, ఫిష్ ఆయిల్ ధరలు పెరిగిన మాట వాస్తవమేనని చెప్పుకొచ్చారు. ముడి పదార్థాల ధరల భారం రైతులపై ఒక్కసారిగా మోపడానికి వీల్లేదని స్పష్టం చేశారు. ప్రభుత్వం, అధికారులు, రైతులు, తయారీదారులతో కూడిన కమిటీ ద్వారానే ఇకపై ధరల నిర్ణయం ఉంటుందని పేర్కొన్నారు. రొయ్యల రైతుల ప్రయోజనాల పరిరక్షణెలి తమ ప్రభుత్వ లక్ష్యమని వ్యాఖ్యానించారు. జోన్, నాన్-జోన్, 10 ఎకరాల పరిమితి నిబంధనలని తొలగించామని తెలిపారు. ప్రతి ఆక్వా రైతుకూ యూనిట్‌కు రూ.1.50కే విద్యుత్ అందిస్తున్నామని వివరించారు. గతంలో ల్యాబ్‌ల పేరుతో ప్రచారం తప్ప క్షేత్రస్థాయిలో సౌకర్యాలు లేవని ప్రస్తావించారు. రాష్ట్రంలోని ఏ గ్రామానికైనా వచ్చి వాస్తవాలు పరిశీలించాలని గొడ్డలి పార్టీ అధ్యక్షుడుకి సవాల్ విసిరారు. ఫీడ్ ధరల నియంత్రణకు దేశంలోనే తొలిసారిగా ప్రత్యేక రాష్ట్రస్థాయి కమిటీ ఏర్పాటు చేశామని మంత్రి అచ్చెన్నాయుడు వివరించారు.

## చిన్నారి జ్ఞానేశ్వరి మిస్సింగ్‌పై ముమ్మర దర్యాప్తు

**సంచార జాతులను విచారిస్తున్న పోలీసులు**

కాకినాడ,జూన్16 : కాకినాడ జిల్లా తుని చిన్నారి జ్ఞానేశ్వరి కేసుపై పెద్దాపురం డీఎస్పీ తిలక్ కీలక విషయాలు వెల్లడించారు. ఈ కేసులో దర్యాప్తు కొనసాగిస్తున్నామని తెలిపారు. మంగళవారం డీఎస్పీ తిలక్ మీడియాతో మాట్లాడారు. 35 నిమిషాల వ్యవధిలో బాలిక మిస్సయిందని చెప్పుకొచ్చారు. చిన్నారి జ్ఞానేశ్వరి సమాచారం తెలిసిన వెంటనే గాలింపు చర్యలు చేపట్టామని స్పష్టం చేశారు. జీడీ పిక్కలు ఏరుకునే వారిని కూడా పిలిచి చిన్నారి గురించి విచారించామని తెలిపారు. పాప మిస్సయిన చోట బొమ్మలను ఏర్పాటు చేసి పర్యవేక్షిస్తున్నామని పేర్కొన్నారు. చిన్నారికి సంబంధించి తప్పుడు వార్తలను ప్రచురించే వారిపై లీగల్‌గా చర్యలు తీసుకుంటామని డీఎస్పీ తిలక్ హెచ్చరించారు. పాపను జంతువులు తీసుకెళ్లాయనే కోణంలో కూడా దర్యాప్తు చేస్తున్నామని వివరించారు. జీడి పిక్కలను ఏరుకునే సంచార జాతుల వారిపై నిఘా పెట్టి విచారణ చేస్తున్నామని తెలిపారు. చిన్నారి జ్ఞానేశ్వరి కుటుంబం పెంచుకుంటున్న కుక్కకు నాలుగు రోజులుగా ఎలాంటి ఆహారం లేకపోవడంతోనే చనిపోయిందని వెల్లడించారు. కుక్క పోస్టుమార్టం రిపోర్టు రెండు రోజుల్లో వస్తుందని డీఎస్పీ తిలక్ పేర్కొన్నారు.

## యోగా మన జీవితంలో భాగం కావాలి

**కృష్ణా తీరంలో పెద్ద ఎత్తున యోగాంధ్ర**

**21న యోగా దినోత్సవ విజయం చేయాలన్న కలెక్టర్**

విజయవాడ,జూన్16 : రాష్ట్ర వ్యాప్తంగా యోగాంధ్ర వేడుకలను ఘనంగా నిర్వహిస్తున్నారు. ప్రభుత్వ అధికారులు, ప్రజాప్రతినిధులు, ప్రజలు అంతా కలిసి యోగాసనాలు వేస్తున్నారు. మంగళవారం ఉదయం కలెక్టర్ లక్ష్మీశ ఆధ్వర్యంలో బరమ్ పార్కులోని కృష్ణా నదీ తీరాన యోగాంధ్ర కార్యక్రమం నిర్వహించారు. ప్రింట్, ఎలక్ట్రానిక్, సోషల్ మీడియా ప్రతినిధులు, విద్యార్థులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. 'హెల్తీ, వెల్తీ, హ్యాపీ ఆంధ్రప్రదేశ్' కోసం అందరూ సహకరించాలని కోరారు. ప్రతి ఒక్కరూ యోగాను తమ జీవితంలో ఒక భాగంగా చేసుకోవాలని సూచించారు. శరీరాన్ని ఎంత ఆరోగ్యంగా ఉంచుకుంటే, మనం చేసే పనిలో అంతటి అంకితభావం ఉంటుందని తెలిపారు. వికసిత్ భారత్, విజన్ ఆంధ్రప్రదేశ్ 2047 వంటి లక్ష్యాలను సాధించాలంటే పౌరులందరూ ఆరోగ్యంగా ఉండటం అవసరమన్నారు. ఈ యోగాసనాలు సరళంగా ఉండి ప్రతి ఒక్కరూ సులభంగా ప్రాక్టీస్ చేసేలా ఉంటాయని కలెక్టర్ వెల్లడించారు. రోజుకు 45 నిమిషాల పాటు సమయం కేటాయిస్తే సరిపోతుందని తెలిపారు. జూన్ 21వ తేదీన అంతర్జాతీయ యోగా దినోత్సవం సందర్భంగా విజయవాడ వీఎంసీ స్టేడియం, అంబేద్కర్ కళా వేదికలో రాష్ట్ర స్థాయి కార్యక్రమం ఉంటుందని.. సీఎం చంద్రబాబు నాయుడు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్, ఇతర ప్రజాప్రతినిధులు, అధికారులు పాల్గొంటారని తెలిపారు. ప్రజలందరూ ఈ యోగాంధ్ర కార్యక్రమంలో పాల్గొని ఆరోగ్యవంతమైన సమాజ స్థాపనకు సహకరించాలని కలెక్టర్ లక్ష్మీ శ పిలుపునిచ్చారు. కృష్ణాజిల్లా పామర్రు మొవ్వ మండలం కూచిపూడిలో యోగాంధ్ర వేడుకలు ఘనంగా నిర్వహించారు. కృష్ణా జిల్లా కలెక్టర్ బాలాజీ, పామర్రు ఎమ్మెల్యే వర్ల కుమార్ రాజా, అధికార ప్రముఖులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. కూచిపూడి కళాకారులు, విద్యార్థులతో కలిసి కలెక్టర్, ఎమ్మెల్యే సామూహిక యోగాసనాలు వేశారు. విద్యార్థుల యోగా విన్యాసాలు అందిరినీ ఆకట్టుకున్నాయి. ఈ సందర్భంగా కలెక్టర్ బాలాజీ మాట్లాడుతూ.. ప్రజలందరూ యోగాపై సంపూర్ణ అవగాహన కలిగి ఉండాలని... అప్పుడే అనేక వ్యాధులకు దూరంగా ఉంటామన్నారు. యోగా సాధన ద్వారా కలిగే ప్రయోజనాలు అనేకమని, మానసిక చైతన్యం పెరుగుతుందని చెప్పారు. ముఖ్యంగా బాల్య దశ నుంచే యోగా అలవాటు చేసుకుంటే ఆరోగ్యవంతమైన సమాజం ఏర్పడుతుందని కలెక్టర్ తెలిపారు. ప్రపంచ ప్రసిద్ధిగాంచిన కూచిపూడిలో యోగాంధ్ర వేడుకలు జరగడం సంతోషకరమని ఎమ్మెల్యే కుమార్ రాజా తెలిపారు. 76 ఏళ్ల వయసులో సీఎం చంద్రబాబు ఇంత చురుగ్గా ఉండడానికి కారణం... ఆయన దశాబ్దాలుగా యోగా సాధన చేయడమే అని చెప్పుకొచ్చారు. ప్రకృతి మనకు అందించిన గొప్ప వరం యోగా అని అన్నారు. యోగా చేద్దాం.... ఆరోగ్యంగా జీవిద్దాం అన్నది అందరి నినాదం కావాలని ఎమ్మెల్యే కుమార్ రాజా పేర్కొన్నారు.

# సింగపూర్‌తో ఏపికి మంచి సంబంధాలు

**మూడు దశాబ్దాలుగా కలసి పసనిచేస్తున్నాం**

**పార్ట్‌నర్‌షిప్ సన్నాహక సమ్మిట్‌లో చంద్రబాబు**



అమరావతి,జూన్16 : సింగపూర్‌తో భారత్‌కు, ప్రత్యేకించి ఏపీకి మంచి సంబంధాలు ఉన్నాయని ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు వ్యాఖ్యానించారు. సింగపూర్ నిర్మాత లీ క్వాన్ యూ అంటే తనకు చాలా అభిమానమని పేర్కొన్నారు. మూడు దశాబ్దాల క్రితం నుంచే సింగపూర్‌తో కలిసి పనిచేస్తున్నామని వివరించారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో హైదరాబాద్‌లో సింగపూర్ టౌన్ షిప్‌నే నిర్మించామని ప్రస్తావించారు. మంగళవారం సింగపూర్‌లో సీఐఐ పార్టనర్షిప్ సమ్మిట్-2026 బిజినెస్ రోడ్ షోకి సీఎం చంద్రబాబు హాజరయ్యారు. ఈ ఏడాది నవంబర్‌లో జరగనున్న పార్టనర్‌షిప్ సమ్మిట్ సన్నాహక సమావేశంగా సింగపూర్‌లో తొలి రోడ్ షోని సీఐఐ నిర్వహిస్తోంది. ఈ సందర్భంగా సీఎం చంద్రబాబు మాట్లాడారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర విభజన తర్వాత కొత్త రాజధాని నిర్మాణం కోసం సింగపూర్ మాస్టర్ ప్లాన్‌ని తయారు చేశామని తెలిపారు. బ్లూ, గ్రీన్ రాజధానిగా అమరావతి నిర్మాణం కోసం ఓ అద్భుతమైన బృహత్ ప్రణాళికను సింగపూర్ రూపొందించిందని వెల్లడించారు. ఏపీ రాజధాని అమరావతితో పాటు రాష్ట్రంలోని నగరాల అభివృద్ధి తదితర అంశాల్లో సింగపూర్ ప్రభుత్వంతో కలిసి పనిచేస్తున్నామని సీఎం చంద్రబాబు వివరించారు. సింగపూర్ తర్వాత పెట్టుబడులు పెట్టాలనుకుంటే ఆంధ్రప్రదేశ్ అత్యుత్తమ ప్రాంతమని స్పష్టం చేశారు. సింగపూర్ తర్వాత రెండో నివాసంగా అమరావతిని, ఏపీని మార్చుకోమని పారిశ్రామిక వేత్తలకు పిలుపునిచ్చారు. ఏపీలో భూమి, అనుమతులను వేగంగా జారీ చేస్తున్నామని తెలిపారు. ప్రపంచ దిగ్గజ స్టీల్ కంపెనీ ఆర్సెలార్ మిట్టల్‌కు అన్ని అనుమతులు వేగంగా ఇచ్చామని చెప్పుకొచ్చారు. 2028 నాటికి ఆర్సెలార్ మిట్టల్ ఉత్పత్తి కూడా ప్రారంభించి ఏపీ నుంచి ఎగుమతులు చేస్తుందని తెలిపారు. అలాగే గూగుల్ డేటా సెంటర్ ఏర్పాటవుతుందని.. వారికి గ్రీన్ ఎనర్జీని సరఫరా చేయాలని నిర్ణయించామని పేర్కొన్నారు. పెట్టుబడులు వచ్చిన మరుక్షణం నుంచే పరిశ్రమలు ప్రారంభించేలా ఓ నిర్దిష్టమైన కాలవ్యవధిని నిర్ణయిస్తున్నామని సీఎం చంద్రబాబు వివరించారు. గూగుల్‌తో పాటు దాదాపు 10 గిగావాట్ల సామర్థ్యం ఉన్న డేటా సెంటర్లను వివిధ కంపెనీలు ఏర్పాటు చేయబోతున్నాయని ప్రస్తావించారు. ఎల్జీ ఎలక్ట్రానిక్స్ కూడా రూ.7 వేల కోట్లతో శ్రీసిటీలో గృహోపకరణాల తయారీ యూనిట్‌ను ప్రారంభిస్తోందని తెలిపారు. ఏపీలో అమలవుతున్న స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్‌కు ఇవి ప్రత్యక్ష ఉదాహరణలని చెప్పుకొచ్చారు. నైపుణ్యం ఉన్న మానవ వనరులను తయారు చేసేందుకు ఆపరేషనల్ స్కిల్ యూనివర్శిటీని కూడా ఏర్పాటు చేస్తున్నామని వివరించారు. పనిచేస్తూనే నైపుణ్యాలు, ఉన్నత విద్యార్హతలను సాధించేలా ఈ ఆపరేషనల్ యూనివర్శిటీలు ఉపకరిస్తాయని తెలిపారు. ప్రస్తుతం ప్రపంచ వ్యాప్తంగా టెక్నాలజీ విస్తృతి పెరిగిందని.. దీని ఆధారంగానే నిర్ణయాలు ఉంటున్నాయని చెప్పుకొచ్చారు. ఏపీలోనూ అదే తరహాలో డేటా డ్రివెన్ నిర్ణయాలను తీసుకుని పౌరసేవల్ని అందిస్తున్నామని సీఎం చంద్రబాబు పేర్కొన్నారు.

## జనసేనలో జాయినింగ్స్ కమిటీ ఏర్పాటు

**పార్టీలో చేరేవారి కోసం 14మందితో కమిటీ**

**పార్టీ అధినేత పవన్ కల్యాణ్ వెల్లడి**

అమరావతి,జూన్16 : జనసేన పార్టీలో చేరికల సమన్వయానికి జాయినింగ్స్ కమిటీని నియమించినట్లు పార్టీ అధినేత, ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ వెల్లడించారు. జనసేన పార్టీలో చేరేందుకు ఆసక్తి కనబరుస్తున్న ఇతర పార్టీల నేతలు, విద్యావంతులు, సామాజికవేత్తలు, తటస్థులను పార్టీలోకి ఆహ్వానించేందుకు ప్రత్యేకంగా ఈ కమిటీని ఏర్పాటు చేసినట్లు చెప్పారు. 14 మంది సభ్యులతో కూడిన ఈ కమిటీ చేరికలను సమన్వయం చేస్తుందన్నారు. ఢిల్లీ పర్యటన అనంతరం ఈ సభ్యులతో సమావేశం ఏర్పాటు చేసి పార్టీలో చేరికలపై దిశానిర్దేశర చేయనున్నట్లు పవన్ చెప్పారు. ఆంధ్రప్రదేశ్ తరహాలోనే తెలంగాణలోనూ జాయినింగ్స్ కమిటీ నియామకానికి సన్నాహాలు చేస్తున్నామని తెలిపారు. ఈ కమిటీలో ఎమ్మెల్యేలు బొలిశెట్టి శ్రీనివాస్, వంశీకృష్ణ శ్రీనివాస్, పంతం నానాజీ, ఎంపీ లింగమనేని రమేశ్, మాజీ మంత్రి బాలినేని శ్రీనివాసరెడ్డి, మాజీ ఎమ్మెల్యేలు కిలారి రోశయ్య, సామినేని ఉదయభాను, పార్టీ సీనియర్ నేతలు కొటికలపూడి చినబాబు, డా.హరిప్రసాద్, డా.పెదపూడి విజయ్ కుమార్, కొరికాన రవికుమార్, వంపూరు గంగులయ్య, టీసీ వరుణ్, ఆరణి మదన్ సభ్యులుగా ఉంటారని పవన్ కల్యాణ్ పేర్కొన్నారు.

## సీబీఎన్ ఎట్ 361 డిగ్రీస్.. పాలీమ్యాథ్ పుస్తకం

**సింగపూర్‌లో ఆవిష్కరించిన సిఎం చంద్రబాబు**

అమరావతి,జూన్16 : సీబీఎన్ 361 డిగ్రీస్.. పాలీమ్యాథ్ పుస్తకాన్ని ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబు సింగపూర్‌లో ఆవిష్కరించారు. కాకతీయ కల్చరల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో ముఖ్యమంత్రి పాల్గొన్నారు. పుస్తకం తొలి ప్రతులను సింగపూర్‌లోని భారత హైకమిషనర్ శిల్పక్ అంబులే, మంత్రి పి.నారాయణ, కాకతీయ కల్చరల్ అసోసియేషన్ ప్రతినిధులకు అందించారు. ఈ పుస్తకాన్ని 'రేపటి కోసం' దినపత్రిక చీఫ్ ఎడిటర్ శాఖమూరు శ్రీనివాస ప్రసాద్ రచించారు. దీనిని విశ్రాంత ఐఏఎస్ అధికారి కేవీ సత్యనారాయణ ఆంగ్లంలో అనువదించారు. దార్శనిక నేతగా ముఖ్యమంత్రి చంద్రబాబు వివిధ సందర్భాల్లో తీసుకున్న నిర్ణయాలను విశ్లేషిస్తూ ఈ పుస్తకాన్ని రచించారు. ప్రపంచంలోనే అత్యుత్తమ పాలకులుగా గుర్తింపు ఉన్న సింగపూర్, న్యూజిల్యాండ్ మాజీ ప్రధానులు లీ క్వాన్ యూ, జేసిందా ఆర్నాడ్ లాంటి అంతర్జాతీయ దిగ్గజ నేతల తరహాలోనే సీఎం చంద్రబాబు నిర్ణయాలు తీసుకొంటున్నారని.. ఏపీ అభివృద్ధికి విజన్‌ల రూపకల్పనతో పాటు అమరావతి రాజధాని నిర్మాణంలో తీసుకుంటోన్న శ్రద్ధ దీనికి ప్రత్యక్ష ఉదాహరణ అని రచయిత వివరించారు. ఏపీ రెరా మాజీ చైర్మన్ రామనాథ్ వివిధ సందర్భాల్లో వ్యక్తపరిచిన అభిప్రాయాల్లో బాహ్య ప్రపంచానికి తెలియని అంశాలను సీబీఎన్‌అ361 డిగ్రీస్ పుస్తకంలో ఆవిష్కరించినట్టు తెలిపారు. సింగపూర్ ప్రభుత్వ గుర్తింపు పొందిన కాకతీయ కల్చరల్ అసోసియేషన్.. ముఖ్యమంత్రిని గ్లోబల్ పాలీమ్యాథ్ అవార్డుతో సత్కరించింది. సింగపూర్ రూపకర్త లీ క్వాన్ యూ శతజయంతిని పురస్కరించుకుని విడుదల చేసిన వెండి నాణెలిన్ని సీఎం చంద్రబాబుకు అసోసియేషన్ ప్రతినిధులు బహూకరించారు. త్వరలోనే ఈ పుస్తకం తెలుగు, హిందీ సహా వివిధ భారతీయ భాషల్లో విడుదల చేయనున్నట్టు అసోసియేషన్ ప్రతినిధులు తెలిపారు. ఈ కార్యక్రమంలో రెరా మాజీ చైర్మన్ రామనాథ్, కేవీ సత్యనారాయణ, శంకర ప్రసాద్, సింగపూర్‌లోని తెలుగు ప్రముఖులు పాల్గొన్నారు.

## బీసీలపై కక్షపూరిత చర్యలకు పాల్పడ్డ జగన్

**అమర్‌నాథ్ గౌడ్ హత్యే ఇందుకు నిదర్శనం**

**మంత్రి లోకేశ్ ఘాటు విమర్శలు**

అమరావతి,జూన్16 : జగన్ హయాంలో బీసీలకు అన్యాయం జరిగిందని ఆంధ్రప్రదేశ్ విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేశ్ ఫైర్ అయ్యారు. వైసీపీ హయాంలో బీసీలపై కక్షపూరిత చర్యలకు పాల్పడ్డారని దుయ్యబట్టారు. బీసీలు అంటే జగన్‌కు ఎంత కక్షో అమర్నాథ్ గౌడ్ సజీవదహనం నిరూపించిందని పేర్కొన్నారు. వైసీపీ అధినేత వైఎస్ జగన్ మోహన్ రెడ్డిపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. బీసీలపై గొడ్డలి పార్టీ కక్షగట్టిందని ధ్వజమెత్తారు. మంగళవారం అమరావతి వేదికగా మీడియాతో మంత్రి లోకేశ్ మాట్లాడారు. తన అక్కను గొడ్డలి పార్టీ నేతలు వేధిస్తుంటే ప్రశ్నించినందుకు జూన్ 15, 2023న బడికి వెళ్తున్న 15ఏళ్ల బీసీ బాలుడు అమర్నాథ్ గౌడ్‌ను దారుణంగా కొట్టి, కట్టేసి సజీవ దహనం చేశారని మండిపడ్డారు.నాడు గొడ్డలి పార్టీ నిందితులను రక్షించేందుకు ప్రయత్నించిందని మంత్రి లోకేశ్ ఆగ్రహించారు. అన్యాయంగా అమర్‌నాథ్ గౌడ్‌ని చంపేశారని.. ఆయన మృతిచెంది మూడేళ్లు అవుతోందని తెలిపారు. గొడ్డలి పార్టీ వల్ల అన్నివిధాలా నష్టపోయిన అమర్నాథ్ గౌడ్ కుటుంబానికి అండగా ఉంటామని మంత్రి నారా లోకేశ్ భరోసా కల్పించారు. వైసీపీ పైశాచికత్వానికి పరాకాష్ట అమర్నాథ్ గౌడ్ హత్య అని మంత్రి కొల్లు రవీంద్ర మండిపడ్డారు. ఐదేళ్ల పాలనంతా బడుగు బలహీన వర్గాలను వేధించడమేనని ఆగ్రహించారు. చేయాల్సిన అరాచకాలన్నీ చేసి ఇప్పుడు వైసీపీ నేతలు నీతులు చెబుతున్నారని విమర్శించారు. కుట్రలతో రాష్ట్రంలో అలజడులే అజెండాగా జగన్ రెడ్డి అడుగులేస్తున్నారని దుయ్యబట్టారు. అమర్నాథ్ గౌడ్ వర్ధంతి సందర్భంగా ఘన నివాళి అర్పించారు మంత్రి కొల్లు రవీంద్ర.

## ముస్సోరిలో విశాఖకు చెందిన టెక్కీ మృతి

**భర్తతో కలసి విహార యాత్రకు వెళ్లిన రాధాగాయత్రి**

**కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్న పోలీసులు**

న్యూఢిల్లీ,జూన్16 : ఢిల్లీలో సాఫ్ట్‌వేర్ ఇంజినీర్‌గా పనిచేస్తున్న 27 ఏళ్ల రాధా గాయత్రి ముస్సోరీలో అనుమానాస్పద పరిస్థితుల్లో మృతిచెందిన ఘటన కలకలం రేపుతోంది. భర్తతో కలిసి విహారయాత్రకు వెళ్లిన ఆమె ముస్సోరీలోని హోమ్‌స్టే గదిలో విగతజీవిగా మారారు. మృతురాలిని పి. రాధా గాయత్రిగా గుర్తించారు. ఆమె భర్త సౌమ్య శ్రీచరణ్‌తో కలిసి సెలవులు గడిపేందుకు ఉత్తరాఖండ్‌లోని ముస్సోరీకి వెళ్లారు. రాధా గాయత్రి, శ్రీ చరణ్ ఇద్దరూ ఆంధ్రప్రదేశ్‌లోని విశాఖపట్నానికి చెందిన వారు. వీరికి 2025 నవంబర్ 8న వివాహం జరిగింది. గాయత్రి ఢిల్లీలో నివసిస్తూ గురుగ్రామ్‌లోని ఒక ఐటీ సంస్థలో పనిచేస్తున్నారు. ఆమె భర్త శ్రీచరణ్ పుణెలో ఐటీ సంస్థలో పని చేస్తున్నారు. వీరిద్దరూ జూన్ 14 రాత్రి ముస్సోరీలోని కియానా హోమ్‌స్టేకు చేరుకున్నారు. భర్త చెప్పిన వివరాల ప్రకారం.. వారిద్దరూ ఆ రాత్రి మద్యం సేవించి, తెల్లవారుజామున 3:30 గంటలకు నిద్రపోయారు. శ్రీచరణ్ ఉదయం నిద్రలేచి చూసేసరికి.. గాయత్రి నగ్నంగా, స్పృహ లేకుండా, నేలపై పడి ఉంది. ఆమె ముక్కు నుంచి రక్తం కారుతోంది. హోమ్‌స్టే సిబ్బంది ముస్సోరీ పోలీసులకు సమాచారం అందించారు.

## గాయని శ్రీలలిత నివాసానికి ప్రహ్లాద్ జోషి

**12 సుపరిపాలన పుస్తకాన్ని అందించిన కేంద్రమంత్రి**

**ఇంద్రకీలాద్రిపై అమ్మవారికి ప్రత్యేక పూజలు**

విజయవాడ,జూన్16 : విజయవాడలో వివిధ కార్యక్రమాలలో కేంద్ర మంత్రి ప్రహ్లాద్ జోషి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ప్రముఖ యువ గాయని శ్రీలలిత నివాసానికి కేంద్ర మంత్రి విచ్చేశారు. ప్రధాని నరేంద్ర మోదీ నేతృత్వంలోని 12 ఏళ్ల సుపరిపాలన, సాధించిన విజయాలపై రూపొందించిన ప్రత్యేక పుస్తకాన్ని శ్రీలలితకు అందజేశారు. కర్ణాటక, హిందుస్తానీ సంగీత శైలులు రెండింటిలోనూ రాణిస్తున్న శ్రీలలితను ప్రహ్లాద్ జోషి అభినందించారు. అనంతరం కేంద్ర మంత్రి మాట్లాడుతూ.. రెండు విభిన్న సంగీత పక్రియలను నేర్చుకోవడం ఎంతో కష్టతరమన్నారు. గతంలో ప్రధాని మోదీ స్వయంగా శ్రీలలిత ప్రతిభను సామాజిక మాధ్యమాల ద్వారా ప్రశంసించారని తెలిపారు. కర్ణాటకలో ధార్వాడ్.. హిందుస్తానీ సంగీతానికి ఎందరో మహానుభావులను అందించిందన్నారు. దేశవ్యాప్తంగా ప్రధాని మోదీ సాధించిన అద్భుత ప్రగతిని, ప్రపంచ సంక్షోభాల సమయంలోనూ దేశాన్ని సమర్థవంతంగా నడిపించిన తీరు గురించి అందరూ తెలుసుకోవాలని అన్నారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి, ఇక్కడి రాజధానికి కేంద్ర ప్రభుత్వం పూర్తి సహకారం అందిస్తుందని ప్రహ్లాద్ జోషి స్పష్టం చేశారు. ఇంద్రకీలాద్రిపై వెలసిన కనకదుర్గమ్మకు కేంద్ర మంత్రి ప్రహ్లాద్ జోషి ప్రత్యేక పూజలు చేశారు. మంగళవారం ఉదయం ఇంద్రకీలాద్రి చేరుకున్న కేంద్ర మంత్రి ప్రహ్లాద్ జోషి, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్‌కు ఆలయ మర్యాదలతో ఆలయ అర్చకులు, దుర్గగుడి పాలకమండలి చైర్మన్ రాధాకృష్ణ, ఈవో శీనానాయక్ స్వాగతం పలికారు. అమ్మవారిని దర్శించుకుని, వేద పండితుల చేత వేద ఆశీర్వచనం పొందారు. అనంతరం కేంద్ర మంత్రికి అమ్మవారి లడ్డూ ప్రసాదాన్ని, చిత్రపటాన్ని ఆలయ అధికారులు అందజేశారు.


## వైసిపి ఓట్లను తొలగించే కుట్రలో చంద్రబాబు

**సర్ ప్రక్రియపై నాలుగు వారాలు అప్రమత్తంగా ఉండాలి**

**ఫిర్యాదులు వస్తే వెంటనే ఎన్నికల అధికారుల దృష్టికి తీసుకెళ్లాలి**

పార్టీ సీనియర్ నేతలు, ముఖ్య నాయకులతో సమీక్షలో జగన్

అమరావతి,జూన్16 : రాబోయే నాలుగు వారాలు అత్యంత కీలకమని పేర్కొంటూ సర్ ప్రక్రియ పట్ల పార్టీ శ్రేణులు పూర్తి అప్రమత్తంగా ఉండాలని మాజీ ముఖ్యమంత్రి, వైసీపీ అధినేత వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి సూచించారు. వైసీపీకి అనుకూలంగా ఉన్న ఓట్లను తొలగించేందుకు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు నేతృత్వంలోని కూటమి ప్రభుత్వం కుట్రలు చేస్తోందని జగన్ ఆరోపించారు. ఈ సందర్భంగా నియోజకవర్గ కో-ఆర్డినేటర్లు, బూత్ స్థాయి నాయకులు నిర్లక్ష్యం చేయకుండా ప్రతిరోజూ పరిస్థితులను సమీక్షించాలని ఆదేశించారు. ఓట్ల తొలగింపుకు సంబంధించిన ఫిర్యాదులు వస్తే వెంటనే ఎన్నికల అధికారుల దృష్టికి తీసుకెళ్లాలని, సమస్య పరిష్కారం కాకపోతే పార్టీ కేంద్ర కార్యాలయానికి సమాచారం అందించాలని సూచించారు. తాడేపల్లిలోని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ కేంద్ర కార్యాలయంలో పార్టీ సీనియర్ నేతలు, ముఖ్య నాయకులతో కీలక సమావేశం నిర్వహించారు. ఓటర్ల జాబితా సవరణ (ఎస్ఐఆర్) పక్రియపై ప్రత్యేకంగా చర్చించిన జగన్, ఒక్కసారి ఓటు తొలగించబడితే తిరిగి జాబితాలో చేర్పించడం కష్టమవుతుందని పేర్కొన్న జగన్, ప్రతి ఓటును కాపాడుకోవడం పార్టీ శ్రేణుల బాధ్యత అని అన్నారు. క్షేత్రస్థాయిలో ఎలాంటి అలసత్వానికి తావివ్వకుండా నిరంతర పర్యవేక్షణ కొనసాగించాలని సూచించారు. అధికార దుర్వినియోగంతో ఓటర్ల జాబితాలో మార్పులు చేర్పులు చేసే ప్రయత్నాలు జరుగుతున్నాయని విమర్శించారు. ప్రతి బూత్‌లో కనీసం 50 ఓట్లు తొలగించడమే కూటమి లక్ష్యంగా పనిచేస్తోందని ఆరోపించిన జగన్, వివిధ గిమ్మిక్కుల ద్వారా ఓట్ల తొలగింపునకు చేసే ప్రయత్నాలను అడ్డుకోవాలని పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. బూత్ లెవల్ ఏజెంట్లు పూర్తిస్థాయిలో అప్రమత్తంగా పనిచేయాలని, ఎస్ఐఆర్ పక్రియపై రోజువారీ పర్యవేక్షణ కొనసాగించాలని ఆదేశించారు. రాబోయే రోజుల్లో ఓటర్ల జాబితా సవరణ పక్రియలో ప్రతి ఓటును రక్షించేందుకు పార్టీ యంత్రాంగం సమన్వయంతో పనిచేయాలని స్పష్టం చేశారు



# విశ్వంభర విడుదల తేదీపై సందిగ్ధత

## అధికారికంగా ప్రకటించని మేకర్స్

మెగాస్టార్ చిరంజీవి హీరోగా తెరకెక్కుతున్న భారీ సోషియో-ఫాంటసీ సైన్స్ ఫిక్షన్ చిత్రం 'విశ్వంభర' కోసం అభిమానులు ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు. అయితే సినిమా విడుదల తేదీ విషయంలో కొనసాగుతున్న అనిశ్చితి మెగా ఫ్యాన్స్‌ను తీవ్ర నిరాశకు గురి చేస్తోంది. ఇప్పటికే పలుమార్లు వాయిదా పడిన ఈ చిత్రం ఎప్పుడు ప్రేక్షకుల ముందుకు వస్తుందనే అంశంపై సోషల్ మీడియాలో పెద్ద ఎత్తున చర్చ జరుగుతోంది. వశిష్ట దర్శకత్వంలో తెరకెక్కుతున్న ఈ ప్రతిష్టాత్మక ప్రాజెక్ట్‌పై మొదటి నుంచే భారీ అంచనాలు నెలకొన్నాయి. మెగాస్టార్‌ను మరోసారి ఫాంటసీ ప్రపంచంలో చూడబోతున్నామని అభిమానులు ఉత్సాహంగా ఎదురుచూస్తున్నారు. అయితే షూటింగ్ పూర్తయినప్పటికీ విడుదల తేదీపై ఇంకా స్పష్టత లేకపోవడం ఆశ్చర్యానికి గురిచేస్తోంది. మొదట ఈ చిత్రాన్ని జూలైలో విడుదల చేసే అవకాశాలు ఉన్నాయని ప్రచారం జరిగింది. ఆ తర్వాత ఆగస్టు రిలీజ్‌పై కూడా వార్తలు వినిపించాయి. కానీ చిత్ర నిర్మాణ సంస్థ నుంచి ఇప్పటివరకు ఎలాంటి అధికారిక ప్రకటన రాకపోవడంతో ఆ వార్తలన్నీ కేవలం ఊహాగానాలు గానే మిగిలిపోయాయి. తాజా సినీ వర్గాల సమాచారం ప్రకారం, 'విశ్వంభర'ను ఈ ఏడాది దసరా కానుకగా విడుదల చేయాలనే ఆలోచనలో నిర్మాతలు ఉన్నట్లు తెలుస్తోంది. దసరా సీజన్‌కు భారీ చిత్రాలకు మంచి మార్కెట్ ఉండటంతో ఈ పండుగను లక్ష్యంగా పెట్టుకున్నారని టాక్ వినిపిస్తోంది.దీనికి ప్రధాన కారణం రాబోయే నెలల్లో టాలీవుడ్‌లో భారీ చిత్రాలు క్యూ కడుతుండడం. డిసెంబర్ నుంచి వరుస స్టార్ హీరోల సినిమాలు విడుదలకు సిద్ధమవుతున్నాయి. అలాగే 2027 సంక్రాంతి, సమ్మర్ సీజన్లు కూడా ఇప్పటికే పలు క్రేజీ ప్రాజెక్టులతో బుక్ అయ్యాయి. దీంతో 'విశ్వంభర'కు సరైన విడుదల తేదీ ఎంపిక చేయడం మేకర్స్‌కు సవాలుగా మారిందని సినీ విశ్లేషకులు భావిస్తున్నారు.







# కల్కి సీక్వెల్‌లో ఆలియా భట్

పాన్ ఇండియా స్టార్ ప్రభాస్, డైరెక్టర్ నాగ్ అశ్విన్ కాంబినేషన్‌లో వచ్చిన సైన్స్ ఫిక్షన్ వండర్ 'కల్కి 2898 ఏడి' బాక్సాఫీస్ వద్ద ఎలాంటి ప్రభంజనం సృష్టించిందో అందరికీ తెలిసిందే. పురాణాల నేపథ్యంతో తెరకెక్కిన ఈ విజువల్ వండర్‌కు ప్రేక్షకులు బ్రహ్మరథం పట్టారు. అమితాబ్ బచ్చన్, కమల్ హాసన్ వంటి దిగ్గజాల నటన ఈ సినిమాను నెక్స్ట్ లెవెల్‌కు తీసుకెళ్లింది. ప్రస్తుతం ఈ భారీ బ్లాక్‌బస్టర్ సీక్వెల్ 'కల్కి-2' కూడా ప్రస్తుతం శరవేగంగా షూటింగ్ జరుపుకుంటుంది. ఈ క్రమంలోనే 'కల్కి' ఫ్రాంచైజీ నుంచి ఒక ఆసక్తికరమైన అప్‌డేట్ సోషల్ మీడియాలో సెన్సేషన్ క్రియేట్ చేస్తోంది. ఈ సీక్వెల్‌లో బాలీవుడ్ స్టార్ బ్యూటీ ఆలియా భట్ ఎంట్రీ ఇవ్వబోతున్నట్లు సినీ వర్గాల్లో గట్టిగా వినిపిస్తోంది. గతంలో మొదటి భాగంలో నటించిన దీపికా పదుకొనె కొన్ని కారణాల వల్ల ఈ ప్రాజెక్ట్ నుండి తప్పుకున్న సంగతి తెలిసిందే. అయితే, ఆలియా భట్ దీపికా పోషించిన 'సుమతి' పాత్రను చేయడం లేదని తెలుస్తుంది. ఈ సినిమాలో వచ్చే ఒక పవర్‌ఫుల్ స్పెషల్ రోల్‌లో ఆమె కనిపించనున్నట్లు సమాచారం. మరింత షాకింగ్ విషయమేమిటంటే.. ఆలియా భట్ ఇప్పటికే తన పాత్రకు సంబంధించిన కొంతమేర షూటింగ్‌ను కూడా సైలెంట్‌గా పూర్తి చేసిందని టాక్. 'ఆర్ఆర్ఆర్' చిత్రంతో ఇప్పటికే తెలుగు ప్రేక్షకులకు బాగా దగ్గరైన ఆలియా.. ఇప్పుడు ఈ క్రేజీ సైన్స్ ఫిక్షన్ సీక్వెల్‌లో భాగం కావడం సినిమాపై అంచనాలను మరింత పెంచేస్తోంది. ఈ అలియా ఎంట్రీపై త్వరలోనే వైజయంతీ మూవీస్ టీమ్ నుండి అధికారిక ప్రకటన వచ్చే అవకాశం ఉంది.

# వారణాసి బిజీలో మహేశ్‌బాబు

## సందీప్ వంగాతో మూవీపై అప్పుడే క్లారిటీ

సూపర్ స్టార్ మహేశ్ బాబు, సంచలన దర్శకుడు సందీప్ రెడ్డి వంగా కాంబినేషన్‌లో సినిమా రాబోతోందంటూ గత కొన్ని రోజులుగా సోషల్ మీడియాలో ప్రచారం జోరుగా సాగుతున్న సంగతి తెలిసిందే. ప్రముఖ నిర్మాణ సంస్థ ఏషియన్ సినిమాస్ బ్యానర్‌పై ఈ క్రేజీ ప్రాజెక్ట్ సెట్స్ పైకి వెళ్లనుందని ఇండస్ట్రీ వర్గాల్లో టాక్ నడుస్తోంది. మహేశ్ బాబు ప్రస్తుతం రాజమౌళితో చేస్తున్న 'వారణాసి', సందీప్ వంగా కమిట్ అయిన 'స్పిరిట్', 'యానిమల్ పార్క్' ప్రాజెక్టులు పూర్తయిన తర్వాత ఈ కాంబో సెట్ అయ్యే అవకాశం ఉందని అభిమానులు ఆశగా ఎదురు చూస్తున్నారు. నిజానికి వీరిద్దరి కలయికలో సినిమా రావడం ఇదే మొదటి ఆలోచన కాదు. గతంలో ఏషియన్ సినిమాస్ నిర్మాణంలోనే మహేశ్, సందీప్ వంగా కలిసి 'డెవిల్' అనే సినిమా చేయాల్సి ఉంది. ఆ సమయంలో ఇద్దరికీ ఈ నిర్మాణ సంస్థ అడ్వాన్స్‌లు కూడా ఇచ్చినట్లు సమాచారం. కానీ కొన్ని అనివార్య కారణాల వల్ల ఆ ప్రాజెక్ట్ కార్యరూపం దాల్చలేదు. అప్పటి నుంచి ఈ ఇద్దరి కాంబినేషన్ కోసం టాలీవుడ్ ప్రేక్షకులు ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు. అయితే ప్రస్తుతానికి ఈ సినిమాకు సంబంధించి ఎలాంటి అధికారిక ప్రకటన లేదు. మహేశ్ 'వారణాసి' చిత్రం ముగిసిన తర్వాతే ఈ ప్రాజెక్ట్‌పై ఒక స్పష్టత వచ్చే అవకాశం ఉంది. మరి నిజంగానే ఈ కాంబో సెట్ అవుతుందో లేదో చూడాలి.









# 19న రానున్న మా ఇంటి బంగారం

'మా ఇంటి బంగారం' చిత్రంతో ప్రేక్షకుల్ని అలరించేందుకు సిద్ధమవుతోంది నటి సమంత. ఆమె ప్రధాన పాత్రధారిగా నటించిన ఈ సినిమాని నందినీ రెడ్డి తెరకెక్కించిన సంగతి తెలిసిందే. రాజ్ నిడిమోరు, సమంత, హిమాంక్ దువ్వూరు నిర్మించారు. దిగంత్, గుల్షన్ దేవయ్య, గౌతమి తదితరులు కీలక పాత్రలు పోషించారు. ఈ సినిమా ఈ నెల 19న థియేటర్లలోకి రానుంది. ఈ నేపథ్యంలోనే సోమవారం రాత్రి హైదరాబాద్‌లో ప్రీరిలీజ్ వేడుకని నిర్వహించారు. దర్శకులు దేవా కట్టా, డీకే, రాహుల్ రవీంద్రన్, నిర్మాతలు డి.సురేశ్‌బాబు, వై రవిశంకర్, స్వప్న దత్ అతిథులుగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా నటి సమంత మాట్లాడుతూ.. 'ఈ సినిమాతో కచ్చితంగా ఒకొక్కర్ని ప్రేమతో కొడతా. దీన్ని మేమంతా చాలా ప్రేమతో చేశాం. ఇప్పటి వరకు నటిగా నా కెరీర్ చాలా సాఫీగా సాగిపోయింది. కానీ, నటిగా, నిర్మాతగా ఉండటంలో ఉన్న కష్టమేంటన్నది నాలుగైదు రోజులుగా అర్థమవుతోంది. సమష్టి కృషి వల్లే ఈ చిత్రం సాధ్యమైంది. ఈ సినిమాలో నేను చాలా సహజంగా నటించానంటే దానికి ప్రధాన కారణం దీంట్లో ఉన్న సంభాషణలే. ఇందులో నేను చీరలో ÷ట్లు చేశాను. చాలా కష్టంగా అనిపించింది. దీంట్లో యాక్షన్ సన్నివేశాలన్నీ అలరిస్తాయి. ఈ సినిమాలో ప్రతిఒక్కరూ అద్భుతంగా నటించారు' అన్నారు. 'నా జీవితంలో ఈ సినిమాకి పడినంత కష్టం ఏ చిత్రానికి పడలేదు. సమష్టి కృషితో దీన్ని ఆరు నెలల్లో పూర్తి చేయగలిగాం. సమంత, రాజ్ నాపై పెట్టుకున్న నమ్మకాన్ని నిలబెట్టుకున్నానని నమ్ముతున్నా. ఈ నెల 19న మీకు నచ్చిన సామ్‌ని పది రెట్లు గొప్పగా తెరపై చూస్తారు' అన్నారు దర్శకురాలు నందినీ రెడ్డి. ఈ కార్యక్రమంలో చిన్మయి, దిగంత్, ఆనంద్, హిమాంక్, శ్రీలక్ష్మి, గవిరెడ్డి, పోనీ వర్మ తదితరులు పాల్గొన్నారు.

# సూర్యతో నెల్సన్ మూవీకి ప్లాన్

నటుడు సూర్య 50వ చిత్రానికి 'జైలర్' దర్శకుడు నెల్సన్ దిలీప్ కుమార్ దర్శకత్వం వహిస్తారా? అనేది కోలీవుడ్‌లో ఇప్పుడు హాట్ టాపిక్‌గా మారింది. ప్రస్తుతం నెల్సన్, రజనీకాంత్‌తో 'జైలర్ 2' పనుల్లో బిజీగా ఉన్నారు. అయితే 'సూర్య 50' కోసం వీరిద్దరూ కలిసి పని చేయనున్నట్లు సమాచారం. ఈ మైలురాయి చిత్రాన్ని ఫుల్ కామెడీ ఎంటర్‌టైనర్‌గా తీయాలని ప్లాన్. ఈ ప్రాజెక్ట్‌ను సితార ఎంటర్‌టైన్‌మెంట్స్ నిర్మించే అవకాశం ఉందని, దీనికి అనిరుధ్ సంగీతం అందిస్తారని టాక్. నెల్సన్ కామెడీ స్టైల్‌కి, సూర్య ఎనర్జీ తోడైతే థియేటర్లలో నవ్వులే నవ్వులని ఫ్యాన్స్ అంచనా. నెల్సన్ ప్రస్తుతం 'జైలర్ 2' ప్రీ-ప్రొడక్షన్ పనుల్లో ఉన్నారు. దీంతో 'సూర్య 50' సెట్స్ పైకి వెళ్లేందుకు ఇంకా టైమ్ పడుతుంది. అయితే దీనిపై ఇంకా అధికారిక ప్రకటన రాలేదు. నెల్సన్-సూర్య కాంబో కుదిరితే తెలుగు, తమిళ ప్రేక్షకుల్లో భారీ అంచనాలు నెలకొంటాయి.




Printed, Published & Owned by B. Srinivas, Printed at Abhyudaya Publications,& Printers Algunoor, MDI: Thimmapur District, Karimnagar. 505001(T.S) Published at H.NO. 6-3-289,Kishan Nagar, Karimnagar MDI: District karimnagar- 505001(T.S) Editor: B.Srinivas, RNI NO. APTEL/2006/18964, Cell : 7989575563, Mail:thecrimenews123@gmail.com